www.visalaandhra.com VISALAANDHRA Regd No.VJ/042/2015-17 పేజీలు : 12+టాబ్లాయిడ్ +ఆదివారం అనుబంధం వెల: రూ.4.00

SUNDAY
విశాలాంధ్ర
స్థాపితం : 1952
అక్షరాక్షరం అభ్యుదయం
సంపుటి : 66, సంచిక : 217
ఆదివారం 28-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | విజయవాడ ప్రచురణ

• ఆరోగ్యం...ఆహ్లాదం

సైకిల్ సవారీ



- పెరుగుతున్న సైకిల్ ప్రేమికులు
- అన్ని విధాలా మేలంటున్న వైద్యులు
- ఆరోగ్యం కాపాడే వాహనం
- కొత్త మోడళ్లు బెటర్

ఒకప్పుడు ప్రతి ఇంట్లోనూ తప్పనిసరిగా ఉండే వస్తువు సైకిల్. మారిన జీవన ప్రమాణాలు, అధునాతన ద్విచక్ర వాహనాల కారణంగా సైకిల్ దాని ప్రాభవాన్ని కోల్పోయింది. సైకిల్ కేవలం చిన్నపిల్లలు తొక్కుకునే ఆట బొమ్మగా లేదా ఇంట్లో అలంకరణ వస్తువుగా మిగిలిపోయింది.

7 లో

పోషకాల గని

గ్రీన్ యాపిల్

- ఫైబర్ అధికం



రోజుకో యాపిల్ పండును తింటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదు... అనే మాటను మనం ఎప్పటి నుంచో వింటున్నాం. నిజానికి యాపిల్‌ను రోజూ తింటే మనకు కలిగే అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చు.

7 లో



బట్టీయంతో....భ్రష్టు

- పర్సంటేజీలకే ప్రాముఖ్యం
- విద్యార్థుల్లో లోపిస్తున్న సృజనాత్మకత
- ఆచరణలో నిరుపయోగం
- మన విద్యావిధానం నైజీరియా, ఉగాండాల కంటే అధ్వానం

ఏ దేశమైనా విద్యవల్లే వేగంగా అభివృద్ధి సాధించగలుగుతుంది. అలాంటి విద్యను విద్యార్థులకు అందించడంలో అధ్యాపకులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. కానీ అధ్యాపకులకే నిర్బంధం ఎదురైతే.... ఎనిమిదేళ్ల పాఠశాల విద్యలో 14-18 ఏళ్ల విద్యార్థుల్లో కేవలం 43శాతం మాత్రమే సాధారణ విభజన చేయగలిగారు.

Sunday Special

ముచ్చటగా

మూడోసారి...


టెట్ పరీక్షల షెడ్యూల్ మార్పు

- ఫిబ్రవరి 21 నుంచి మార్చి 3 వరకు
- మార్చి 4న ప్రాథమిక కీ విడుదల
- 4 నుంచి 9 వరకు అభ్యంతరాలు
- 12న తుది కీ, 16న ఫలితాలు

2 లో



వారే తేల్చుకోవాలి



- బీజేపీ మిత్రధర్మంపై చంద్రబాబు వ్యాఖ్యలు
- దీటుగా స్పందించిన పురందేశ్వరి, సోము

విశాలాంధ్ర-అమరావతి : బీజేపీతో మేము మిత్రధర్మం పాటిస్తున్నాం...ఆ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారు... మా వారిని విమర్శలు వద్దంటూ నియంత్రిస్తున్నా... అయినా కూడా బీజేపీ నాయకుల విమర్శలు ఆగటం లేదు. టీడీపీతో పొత్తు వద్దనుకుంటే చెప్పండి... మా దారి మేం చూసుకుంటాం... అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇదే సమావేశంలో ప్రతిపక్షనేత వైయస్.జగన్మోహన్‌రెడ్డిపై కూడా విమర్శలకు దిగారు. నాకు కుడిచేయి పనిచేయటం లేదు. అయినా రాష్ట్ర ప్రయోజనాల కోసం దావోస్ వెళ్ళాను. నిద్రకూడా లేదు. అయినా నాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. జగన్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తే బీజేపీతో కలిసి పనిచేస్తానని కొత్తగా చెప్పటం లేదు. జగన్ ఏ మాట మీద నిలబడడు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతిచ్చినప్పుడు ప్రత్యేకహోదా జగన్‌కు గుర్తుకురాలేదా. కేసుల నుంచి బయటపడటానికే అక్రమ ఆస్తులు కాపాడుకోవటానికే జగన్ చేసే ప్రయత్నాలని నిందిస్తూ బీహార్, ఒడిశా తరహాలో అవినీతి ఆరోపణలతో దోచుకున్న సొమ్మంతా వెనక్కు తీసుకుంటామన్నారు. గవర్నర్ లాంటి గౌరవ ప్రదమైన వ్యక్తులకు సంబంధించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయనని హుందాగా ఉంటానన్నారు. గవర్నర్‌ను మార్చాలంటూ కొంతమంది చేస్తున్న కామెంట్లపై స్పందించలేనన్నారు. బీజేపీ నేతలు మా పార్టీ మీద చేసిన ఆరోపణలపై ఆ పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనలోఉన్నప్పుడు వైసీపీ నుండి టీడీపీలో చేరిన వారిని మంత్రులను చేయటంపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చేసిన వ్యాఖ్యలను మీడియా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన పై

- మిగతా 2 లో

తగ్గుతున్న మోడీ ప్రభ

- ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి
- ఓట్లు 5 శాతం.. సీట్లు 30 శాతం గల్లంతు
- లోక్‌నీతి-సీఎస్‌డీఎస్-ఏబీపీ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాషాయ పార్టీ కంగు తినక తప్పేలాలేదు. ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, రానురాను నరేంద్ర మోడీకి ప్రజాదరణ తగ్గుతున్నట్లు తాజా సర్వే ఒకటి పేర్కొంది. అయితే ఎన్నికల్లో కొంతమేర ఓట్లు, సీట్లు తగ్గే అవకాశాలు ఉన్నా కేంద్రంలో మళ్ళీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేనే అధికారంలోకి వస్తుందని, మెజార్టీ తగ్గినా మోడీయే రెండోసారి తిరిగి ప్రధాని పగ్గాలు చేపడతారని తెలిపింది. ఇప్పటికి ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తే ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు 'లోక్‌నీతి-సీఎస్‌డీఎస్-ఏబీపీ' కలిసి 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరిట సర్వే నిర్వహించాయి. 2017లో జరిపిన సర్వే ఫలితాలతో తాజా పరిస్థితిని పోల్చి చూశారు. బీజేపీ గత ఎన్నికల్లో మ్యాజిక్ మార్కును దాటి సొంతంగా 282 సీట్లు సాధించింది. మిత్రపక్షాలను కలుపుకొని 336 సీట్లు గెలిచింది. ఇప్పటికి ఇప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీ 30 స్థానాల వరకు నష్టపోతుందని, ఐదు శాతం ఓట్లను కోల్పోతుందని సర్వేలో తేలింది. బీజేపీ తన సొంత బలంతో అధికారంలోకి రాలేదని మిత్రపక్షాలపై ఆధారపడక తప్పదని స్పష్టమవుతోంది. మొత్తంగా ఎన్డీయే కూటమికి 293 నుంచి 309 స్థానాలు రావచ్చని సర్వే వెల్లడించింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ 59 స్థానాలే గెలవగలిగింది. ఇందులో కాంగ్రెస్ వాటా 44. ఈసారి యూపీఏ బలం 122

- మిగతా 2 లో



మన కుర్రాళ్లు

దుమ్ములేపారు

ఐపీఎల్ - 2018 వేలం

మనీశ్‌పాండే ,రాహుల్ 11 కోట్లు

ఐపీఎల్-2018 వేలం అభిమానుల అంచనాలను తలకిందులు చేస్తూ ఆసక్తికరంగా సాగుతోంది. భారత సీనియర్ ఆటగాళ్లు గౌతం గంభీర్, యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్ వేలంలో నిరాశపరిచినా మనీశ్ పాండే, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్ మాత్రం దుమ్ము లేపారు. విదేశీ ఆటగాళ్లకు ఏ మాత్రం తీసిపోకుండా మన ఆటగాళ్లు వేలంలో అత్యధిక ధరలు పలుకుతున్నారు.

12 లో

వ్యవసాయంపై

కేంద్ర సర్కారు కన్ను

వేల కోట్ల ఆదాయం రాబట్టుకోవచ్చని అంచనా



న్యూఢిల్లీ : దేశంలో పన్ను ఎగవేతదారులకు ముకుతాడు వేయడంతో పాటు కొత్తగా మరో వర్గం ప్రజలను పన్ను పరిధిలోకి తీసుకొచ్చి ఆదాయం పన్ను వసూళ్లను పెంచుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తహతహలాడుతున్నది. రైతులపై పన్నులు విధించడం ద్వారా దండిగా ఆదాయాన్ని రాబట్టుకోవచ్చని యోచిస్తున్నది. ప్రస్తుతం దేశంలోని 70 శాతం వ్యవసాయ కుటుంబాలు చిన్న కమతాలను (ఒక హెక్టారులోపు విస్తీర్ణమున్న పంట భూములు) కలిగి ఉండగా, కేవలం 0.4 శాతం వ్యవసాయ కుటుంబాల వద్ద మాత్రమే పెద్ద కమతాలు (పది హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణమున్న పంట భూములు), 3.7 శాతం వ్యవసాయ కుటుంబాల వద్ద 4 నుంచి 10 హెక్టార్లలోపు విస్తీర్ణమున్న పంట భూములు ఉన్నాయని నేషనల్ శాంపిల్ సర్వే స్పష్టం చేస్తున్నది. వీరిలో చివరి రెండు కేటగిరీల్లోని 4.1 శాతం మంది ధనిక రైతులపై సగటున 30 శాతం వ్యవసాయ పన్ను విధించినా ప్రభుత్వానికి కనీసం రూ.25 వేల కోట్ల రాబడి

- మిగతా 2 లో

నేడు పల్స్ పోలియో



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న రాష్ట్రపతి

3 లో

రేపటి నుంచి బడ్జెట్ సమావేశాలు

- పార్లమెంట్ వాడీవేడిగా జరిగే అవకాశం
- విమర్శనాస్త్రాలు వెలికితీస్తున్న ప్రతిపక్షం
- నేడు సభానాయకులతో స్పీకర్, పార్టీల నేతలతో ప్రభుత్వం సమావేశం



9 లో

ఇదీ లోకం!



అనంత అన్నదాతకు అండ

- రైతులను ఢిల్లీ తీసుకు వెళతా
- కరవుపై నివేదిక తయారు చేస్తా
- రైతు సదస్సులో జన సేనాని పవన్ కల్యాణ్



విశాలాంధ్ర ప్రతినిధి-అనంతపురం : అనంత కరవుకు శాశ్వత పరిష్కారం దొరికేంత వరకూ అనంత అన్నదాతలకు అండగా ఉంటానని జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన రైతు సదస్సులో పాల్గొన్న ఆయన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి నుంచి తెలుసుకున్నారు. అనంతరం పవన్ మాట్లాడుతూ కరవు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యను కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. దీనికోసం అనంత నుంచి ఎంత మంది రైతులు వచ్చినా ఢిల్లీకి తీసుకుని వెళతానని చెప్పారు. అందరూ కలసి ఒక కమిటీగా ఏర్పడి ప్రధాన మంత్రితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయిస్తానని

- మిగతా 2 లో

ముందే 'వేసవి' కూత..!



- 225 ప్రత్యేక రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే
- ఎక్కువశాతం సువిధ, స్పెషల్ చార్జీలవే
- ముందస్తు రిజర్వేషన్ల ప్రక్రియ షురూ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : పండగ సీజన్ ముగిసిందో లేదో వెంటనే రాబోయే వేసవి సెలవులకు ప్రత్యేక రైళ్లను రైల్వేశాఖ ప్రకటించింది. దేశవ్యాప్తంగా దసరా, దీపావళితో మొదలై సంక్రాంతి సెలవులను పురస్కరించుకుని రోజువారి నడిచే రైళ్లకు అదనంగా వందల సంఖ్యలో ప్రత్యేక, సువిధ రైళ్లను రైల్వేశాఖ నడిపింది. సాధారణంగా వేసవి ప్రత్యేక రైళ్లను ఫిబ్రవరి మూడో వారం లేదంటే నాలుగో వారంలో ప్రకటించాల్సి ఉంది. అయితే నెల రోజులు ముందుగానే రైల్వేశాఖ వివిధ మార్గాల్లో నడిపే రైళ్ల జాబితాను ఆయా జోన్లు ప్రకటించాయి. వార్షిక పరీక్షలు ఏప్రిల్‌లో, ఎంసెట్ సహా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పరీక్షలు మే నెలలోనూ నిర్వహిస్తారు. వేసవి సెలవుల్లో చాలా మంది కుటుంబాలతో కలసి వినోద, విహార, తీర్థయాత్రలకు వెళ్లడం రివాజు. రైళ్లలో 120 రోజులు ముందుగానే రిజర్వేషన్ చేయించుకునే సదుపాయం ప్రస్తుతం అందుబాటులో ఉంది. రోజువారీగా నడిచే రైళ్లతోపాటు వీక్లీ, ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌లలో మే మూడోవారం వరకూ అందుబాటులో ఉన్న టికెట్లను రిజర్వేషన్ చేయించుకుంటున్నారు. పలు దూర ప్రాంత రైళ్లలో ఇప్పటికే థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ టికెట్లలో చాలా వరకూ నిండిపోయి ఆర్‌ఏసీ, వెయిటింగ్ లిస్టు కొనసాగుతోంది. అలాగే స్లీపర్ క్లాస్‌లో కూడా వందల సంఖ్యలో ఉండాల్సిన బెర్తులు పదుల సంఖ్యకు తగ్గిపోయింది. గంగాకావేరి, సంఘమిత్ర, నవజీవన్, తమిళనాడు, కోరమండల్, తిరుక్కురల్ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు గరీబ్‌రథ్, హమ్‌సఫర్ తదితర రైళ్లలో ఏప్రిల్, మే నెలలకు వెయిటింగ్ లిస్టు చూపుతోంది. ఇక కోల్‌కతతోపాటు గౌహతి తదితర ఈశాన్య రాష్ట్రాలవైపు వెళ్లే పలు రైళ్లలో చాలా వరకూ ఇప్పటికే నిండిపోయాయి. ఈనేపథ్యంలో వేసవి ప్రత్యేక రైళ్లను అనేక జోన్లు వెల్లడించాయి. దక్షిణ మధ్య రైల్వే

- మిగతా 2 లో

డెమొక్రటిక్ కాంగోలో
8లక్షల మందికిపైగా చిన్నారి నిర్వాసితులు



కిన్షాసా : అంతర్గత సాయుధ ఘర్షణల కారణంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ అఫ్ కాంగో (డీఆర్‌సీ)లో 8,00,000 మందికిపైగా పిల్లలు నిర్వాసితులయ్యారని యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ (యూనిసెఫ్) పేర్కొంది. డీఆర్‌సీలో యూనిసెఫ్ ప్రతినిధి తాజుద్దీన్ ఓయెవాలా ఈ వివరాలను వెల్లడించారు. ముఖ్యంగా టాంగాన్యికా, దక్షిణ కివూ ప్రాంతాలలో ఘర్షణల ప్రభావం తీవ్రంగా ఉందని, తమ ఇళ్లను విడిచివెళ్లిన 1.3 మిలియన్ మందిలో చిన్నారులు చాలామంది ఉన్నారని తెలిపారు. ఈ ప్రాంతాలను అస్థిరపర్చిన హింసాత్మక ఘటనలు ఈ పిల్లలు జీవితాలను దుర్భరంగా మార్చాయన్నారు. వారికి విద్య, కనీసం వైద్యం కూడా అందడం లేదని, ఘర్షణలకు తెగబడిన వారి చేతుల్లో అణచివేతకు, లైంగిక వేధింపులకు గురవుతున్నారని అధికారి చెప్పారు. ఇప్పటివరకు 800కుపైగా లైంగిక వేధింపుల కేసులను గుర్తించినట్టు తెలిపారు. వాస్తవానికి ఇక్కడ జరిగిన హింస స్థాయి చాలా ఎక్కువగా ఉన్నప్పటికీ అందుబాటులో ఉన్న డేటా ప్రకారం గతేడాదిలో మూడువేల మందికిపైగా పిల్లలను సైన్యంతో పాటు సాయుధ గ్రూపులు నియమించినట్టు తెలుస్తోందని ఆయన వివరించారు. ఆహారం లేక వేలాది మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్టు యూనిసెఫ్ భావిస్తోంది. కాంగో ప్రజలకు చేయూతను అందిస్తోంది. మానవత్వ దృక్పథంతో బాధితులకు తక్షణ సాయం అందేలా చూడాలని ఘర్షణకు తెగబడే ఇరువర్గాలను కోరింది.

కరెన్సీ యుద్ధం రావొచ్చు
యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ హెచ్చరిక



దావోస్ : ఎక్స్ఛేంజ్ రేట్లను టార్గెట్ చేసే యత్నాలు కరెన్సీ యుద్ధానికి దారితీయొచ్చునని యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు (ఈసీబీ) హెచ్చరించింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్న ఈసీబీ బోర్డు సభ్యులు బెనోయిట్ కొయ్యూరె మాట్లాడుతూ ఎక్స్ఛేంజ్ రేట్లపై చర్చలను జీ7, జీ20 సమావేశాలకే పరిమితం చేయాలని, ఈ వ్యవహారంలో జోక్యం ఎక్కువైతే తీవ్ర పరిణామాలు తప్పబోవని అన్నారు. నేడున్న పరిస్థితుల్లో కరెన్సీ యుద్ధాన్ని ప్రపంచ ప్రజలు కోరుకోవడం లేదన్నారు. పోటీ కోసం ఎక్స్ఛేంజ్ రేట్లను టార్గెట్ చేయడం సరికాదని సూచించారు. 'ఇటీవల వెలువడిన ప్రకటనలు అనేక ప్రకంపనలు సృష్టించాయి. ఏది ఫలప్రదంగా పరిణమించలేదు. ఈ క్రమంలో వీటిని కొనసాగించడం అర్థరహితం' అని బెనోయిట్ అభిప్రాయపడ్డారు.

అధ్యక్షుడిగా పుతిన్‌కు 67శాతం మద్దతు



మాస్కో : దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేయడంపై నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో 67శాతం అనుకూల ఓట్లు వచ్చినట్టు తెలిసింది. మాస్కోకు చెందిన పబ్లిక్ ఒపీనియన్ ఫౌండేషన్ ఈనెల 20, 21 తేదీల్లో 207 ప్రాంతల్లో మూడువేల మంది అభిప్రాయాలను సేకరించింది. పుతిన్‌కు ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న రష్యన్ కమ్యూనిస్టు పార్టీ మద్దతుగల పావెల్ గ్రుడినిన్, లిబరల్ డెమొక్రటిక్ పార్టీ నేత వ్లాదిమిర్ జిరినోవ్‌స్కీకి 6శాతం ఓట్లు రాగా, అధ్యక్ష రేసులో ఉన్న మిగతా అభ్యర్థులకు ఒక్కశాతం లేదా అంతకన్న తక్కువ ఓట్లు వచ్చినట్టు సంస్థ తెలిపింది. పోల్‌లో పాల్గొన్న 8శాతం మంది అధ్యక్ష ఎన్నికలను విస్మరిస్తామని, 27శాతం మంది పుతిన్‌పై కొంత విశ్వాసమున్నదని, 15శాతం మంది ఆయనపై పెద్దగా సమ్మకం లేదని, 58శాతం మంది అసలు స్పందించలేదని పేర్కొంది. మార్చి 18న రష్యాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 15న ఒపీనియర్ పోల్ నిర్వహించగా పుతిన్‌కు ఓటు వేస్తామని 67శాతం మంది, మద్దతిస్తామని 81.1 శాతం మంది వెల్లడించినట్టు ప్రభుత్వ రంగ సంస్థ వీటీఎస్ఐఓఎం వెల్లడించింది.

వందేళ్ల పోరాటం, త్యాగం
గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ శతవార్షికోత్సవం



పిరాయిస్ : గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) శతవార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వర్కర్స్ సిటీ 'పిరాయిస్'లో శుక్రవారం 'వందేళ్ల పోరాటం, త్యాగం, కేకేఈ పాత్ర' నినాదంతో రాజకీయ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1918, నవంబరులో ఓ చారిత్రక భవంతిలో ఏర్పడిన ది సోషలిస్ట్ లేబర్ పార్టీ ఆఫ్ గ్రీస్ (ఎస్ఈకేఈ) అనంతరం కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ గ్రీస్ (కేకేఈ)గా పేరుమార్చుకొని, అణగారిన వర్గాల కోసం అలుపెరుగని పోరాటాలు, ఉద్యమాలు చేసింది. కాగా, పార్టీ సీసీ ప్రధాన కార్యదర్శి డిమిట్రిస్ కౌట్సుంబస్ సీసీ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయన మాట్లాడుతూ '1918లో కేకేసీ పుట్టిన పిరాయిస్ నగరంలో మీ అందరికీ స్వాగతం. పోరాటాలు, త్యాగాలతో కూడుకున్న 100ఏళ్లు పూర్తిచేసుకున్నాం. కిందిస్థాయి వారి సమస్యలపై ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు సాగించాం. క్యాపిటలిస్ట్ అరాచకాలను తుదిపెట్టేందుకు ఉద్యమించాం. అయితే పార్టీ మరింత బలోపేతమై కార్మిక వర్గం, గ్రీస్ ప్రజల కోసం మరిన్ని ఉద్యమాలు, పోరాటాలు సాగించాల్సిన ఉంది. ఇందుకోసం మా సంపూర్ణ అధికారాలను పార్టీకి ఇస్తున్నాం' అని అన్నారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ శతవార్షికోత్సవం సందర్భంగా ప్రవేశపెట్టిన సీసీ తీర్మానం ఈనెల 13-14 తేదీల్లో 'రిజోపాస్టిస్' వారంత సంచికలో ప్రచురితమైంది.

సూడాన్‌లో ప్రజావ్యతిరేక విధానాలపై ధ్వజం

- ప్రజలకు, కామ్రేడ్లకు కమ్యూనిస్టు పార్టీ సంఘీభావం
- నేతలు, కార్యకర్తల విడుదలకు ఎస్‌సీపీ డిమాండు



సూడాన్ : సూడాన్ భద్రతా బలగాలు సూడానీస్ సీపీ (ఎస్‌సీపీ) సభ్యుడు కామ్రేడ్ అల్ఖాతయిబ్ ఇంటిపై దాడి చేసి, (ఈనెల 17న) ఆయనను అరెస్టు చేసినట్టు ఎస్‌సీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఫతీ అల్‌ఫదల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పార్టీపై ప్రభుత్వం దాడులు చేయించడం, ఎస్‌సీపీ నేతల నిర్బంధకాండ కొనసాగుతోంద న్నారు. ప్రభుత్వ ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానాలను నిరసిస్తూ పార్టీ నిర్వహించిన శాంతియుత మార్చ్ విజయవంతమైందని, ఇందుకు అల్ఖాతయిబ్ అరెస్టు నిదర్శనమని ప్రకటన పేర్కొంది. 50మందికి పైగా కార్యకర్తలు, రాజకీయ నేతలు అరెస్టు అయ్యారని, వారిలో పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సిద్దీఖ్ యూసిఫ్ ఉన్నట్టు తెలిపింది. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండు చేయాల్సిందిగా పార్టీ శ్రేణులకు ఎస్‌సీపీ పిలుపునిచ్చింది. డిటె న్షన్‌లో ఉన్న వారి న్యాయమైన హక్కులను గౌరవిం చాలని, వారిని తమ న్యాయ సలహాదారులతో కలవనివ్వాలని, వైద్యులను అనుమతించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. ఈ నేపథ్యంలో సూడాన్ ప్రజలకు, సూడాన్ కామ్రేడ్లకు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) అంతర్జాతీయ సంబంధాల విభాగం సంఘీ భావాన్ని ప్రకటించింది. సూడాన్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టింది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుతో కలిసి సూడాన్ ప్రభుత్వం కార్మిక వర్గాల జీవితాలను మరింత దుర్భరం చేస్తోందని విమర్శించింది. సామాజిక, ప్రజా స్వామ్య హక్కుల కోసం ఉద్యమిస్తున్న కార్మిక, ప్రజా సంఘాలకు సెల్యూట్ అంటూ ప్రకటనలో కేకేఈ పేర్కొంది. సూడాన్ కమ్యూనిస్టు పార్టీ నేతలు కామ్రేడ్ మోహిదీన్ అల్‌గలద్, కామ్రేడ్ జహీర్ అహ్మద్‌తో పాటు కార్మిక, సామాజిక, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడిన ప్రతి యోధుడిని వెంటనే విడుదల చేయాలని సూడాన్ ప్రభుత్వాన్ని డిమాండు చేసింది.

స్ఫూర్తిప్రదాత జోస్ మార్టి
గౌటెమాలాలో క్యూబా వైద్యుల ప్రశంస

గౌటెమాలా : గౌటెమాలాలోని క్యూబా దౌత్య కార్యాలయానికి చెందిన కార్మికులు, హెల్త్‌బ్రిగేడ్ సభ్యులు జోస్ మార్టి ఆశయాలు, ఆలోచనలు, సిద్ధాంతాలను కొనియాడారు. లాస్‌అమెరికాస్‌లోని ఆయన స్మారకం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వీరు జోస్ వారసత్వాన్ని కొనసాగిస్తామని ప్రతిజ్ఞచేశారు. జోస్‌మార్టి స్ఫూర్తిప్రదాతని క్యూబా వైద్యులు ప్రశంసించారు. ఈనెల 28న మార్టి 128వ జయంతి సందర్భంగా ఆయన స్మారకం వద్ద క్యూబా వైద్యులతో కలిసి జాతీయ సమన్వయకర్త యురీ రాఫెల్ బటిస్టా పుష్పాంజలి ఘటించారు. మార్టి విపవాత్మక జీవితంపై వక్తలు మాట్లాడారు. గౌటెమాలా హెల్త్ మిషన్ తరపున కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ నాడియెస్కా వెలెజ్ మాట్లాడుతూ మార్టి ఆశయాలు ఎంతో గొప్పవని, ఆయన క్యూబా, లాటిన్ అమెరికాతో పాటు ప్రపంచానికే స్ఫూర్తిప్రదాతగా నిలిచారని శ్లాఘించారు. క్యూబన్ హెల్త్ బ్రిగేడ్ ఈ ఏడాదితో గౌటెమాలాలో 20ఏళ్లను పూర్తిచేసుకోనున్నది. మార్టి చెప్పినట్లుగా 'హోంలాండ్ ఈస్ హుమానిటీ' అన్నదానికి కట్టుబడి పనిచేస్తామని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతిఒక్కరూ మార్టిని పాలరాతి విగ్రహంగా కాకుండా మనలో ఒకరిగా చూడాలని గౌటెమాలాలో క్యూబా దౌత్యాధికారి కార్లోస్ డి కెస్పేడెస్ కోరారు. తద్వారా మహానేత ఫిడెల్ కాస్ట్రో ఆశయాలను సైతం యువతరానికి అందించగలమన్నారు.

కేంద్ర సర్కారు కన్ను

(మొదటిపేజీ తరువాయి)

వస్తుందని ప్రపంచ బ్యాంకు గ్లోబల్ ట్యాక్స్ టీమ్ సంస్థ అంటున్నది. గతంలో కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ కూడా ఇదే సూచన చేశారు. సంపన్న రైతులపై పన్నులు విధించాలని ఆయన గతేడాదే కేంద్రానికి స్పష్టం చేశారు. ఆదాయం ఏ రంగంలో వస్తున్నదన్న విషయంతో నిమిత్తం లేకుండా ధనిక రైతుల గురించి మనం ఎందుకు మాట్లాడలేకపోతున్నాం అని ఆయన ప్రశ్నిస్తున్నారు. మరోవైపు నీతి ఆయోగ్ కూడా కేంద్రానికి ఇదే ప్రతిపాదన చేసింది. వ్యవసాయ ఆదాయంపై పన్ను విధించాలని నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. తదుపరి మూడు సంవత్సరాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి గత ఏడాది ప్రకటించిన కార్యాచరణ ముసాయిదాలో నీతి ఆయోగ్ ఈ ప్రతిపాదన చేసింది. రైతులకు మూడేళ్ల పాటు వచ్చే సగటు ఆదాయాన్ని ప్రాతిపదికగా చేసుకుని వ్యవసాయ ఆదాయంపై విధించాల్సిన పన్నును మదింపు చేయాలని నీతి ఆయోగ్ సూచించింది.

అన్నదాతకు అండ

(మొదటిపేజీ తరువాయి)

హామీ ఇచ్చారు. ఏ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందో వారికే తన మద్దతు అన్నారు. అనంతపురం యువత ఒక్క తాటిపై నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నించి వారిపై ఒత్తిడి తేవాలన్నారు. ప్రతి వ్యవస్థలో కొన్ని లోపాలు, తప్పులు ఉన్నాయంటూ రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా సమస్య పరిష్కారం కోసం సంయమనం పాటించాలని తెలిపారు. హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తి కాకపోవడం చాలా బాధాకరమన్నారు. ప్రాజెక్టు ఆలస్యానికి గల కారణాలను జనసేన కమిటీ అధ్యయనం చేసి ఒక నివేదిక తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నామన్నారు. ఈ సభ ఓట్ల రాజకీయం కోసం కాదన్నారు. అనంతపురం కరవు, రైతుల సమస్యల గురించి, రైతుల ఆత్మహత్యల నివారణకు తగిన సూచనలను నిపుణులు, రైతుల ద్వారా తెలుసుకోవడమే సభ ముఖ్య ఉద్దేశమన్నారు.

పలు సమస్యలను వివరించిన రైతులు

మొదటగా రైతులను మాట్లాడించిన పవన్ వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. నాసిరకం విత్తనాల వల్ల నష్టపోతున్నామని, ప్రభుత్వమే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలను అందించాలని ఒక రైతు కోరారు. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, గిడ్డంగులు ఏర్పాటు చేయాలని మరొక రైతు వివరించారు. వ్యాఖ్యాతగా వ్యవహరించిన వెంకటరెడ్డి మాట్లాడుతూ తుంగభద్ర నది నీటిని వాడుకునే సరైన వ్యవస్థ లేదని, ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించే పంటలను సాగు చేసేలా ప్రభుత్వం సూచించాలన్నారు. రైతుల సమస్యల కోసం రాజకీయాలకు అతీతంగా ఒక సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రైతులు కొనే వస్తువులపై టాక్సును పూర్తిగా తొలగించాలని కోరారు. సరైన విద్యుత్, పరిశ్రమలు, తాగు, సాగునీటి వసతి, రహదారులు నిర్మించాలని మరొక రైతు విజ్ఞప్తి చేశాడు.

ముచ్చటగా మూడోసారి...

విశాలాంధ్రబ్యూరో - అమరావతి

ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి టెట్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం మార్చింది. టెట్ పరీక్షకు ప్రిపేర్ అయ్యేందుకు సమయం చాలనందున పరీక్షల తేదీలను వాయిదా వేయాలని పలువురు అభ్యర్థుల కోరిన మీదట ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మానవ వనరుల అభివృద్ధిశాఖ (హెచ్‌ఆర్‌డీ) మంత్రి గంటా శ్రీనివాసరావ కార్యాలయం టెట్ కొత్త షెడ్యూల్‌ను శనివారం విడుదల చేసింది.

ఫిబ్రవరి 21వ తేదీ నుంచి మార్చి మూడో తేదీ వరకు టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి నాలుగో తేదీన టెట్ పరీక్ష ప్రాథమిక కీని విడుదల చేయాలని, దానిపై నాలుగో తేదీ నుంచి తొమ్మిది వకు అభ్యంతరాలు స్వీకరించి మార్చి 12న తుది కీని విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కాగా, మార్చి 16న టెట్ ఫలితాలను వెల్లడించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు హెచ్‌ఆర్‌డీ మంత్రి గంటా శ్రీనివాసరావు కార్యాలయం నుంచి జారీ అయిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహించనున్న టెట్ పరీక్ష కోసం 4,46,833 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. తొలుత జనవరి 17న పరీక్ష నిర్వహించాలని భావించగా, తర్వాత దానిని ఫిబ్రవరి ఐదుకు వాయిదా వేశారు.

అయితే పరీక్షకు సిద్ధమయ్యేందుకు సమయం చాలడంటూ పలువురు అభ్యర్థులు మంత్రి శ్రీనివాసరావును కలిసి విన్నవించారు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం పరీక్షను ఫిబ్రవరి 21వ తేదీ నుంచి మార్చి మూడో తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇదిలావుండగా దరఖాస్తుకు సంబంధించి ఫిబ్రవరి 17వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారు. ఫిబ్రవరి తొమ్మిదో తేదీన మాక్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనుండగా, ఫిబ్రవరి పదో తేదీ నుంచి హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలియజేసింది.

వారే తేల్చుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

విధంగా స్పందించారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాను. ఎన్నికల సమయంలోనే మిత్రులుగా జతకట్టి గెలుపొందాం. అయినా కూడా బీజేపీ నేతలు విమర్శించటం సరికాదని చంద్రబాబు స్పష్టం చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలకు ప్రతిగా బీజేపీతో మిత్రత్వం ఉండాలో, తెంచుకోవాలో అనేది ఆయనే నిర్ణయించుకోవాలని ఆ పార్టీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీల మధ్య సంబంధాలు సరిగా లేవన్నది చాలా కాలంగా జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. బీజేపీ జాతీయ నాయకులకు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి సంబంధాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని అంటున్నారు. కేంద్రంలో వెంకయ్యనాయుడు మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభు త్వానికి అండగా ఉండేవారు. ఆ తర్వాత ఆయన ఉపరాష్ట్రపతిగా ఎన్నిక కావటంతో చంద్రబాబును వ్యతిరేకించే బీజేపీ నేతలు బహిరంగంగానే టీడీపీపై విమర్శలు ఎక్కుపెట్టారు. గుజరాత్ ఎన్నికల ఫలితాల తర్వాత సోము వీర్రాజు కేంద్రం నిధులతో పథకాలను నిర్వహిస్తూ ప్రధాని మోడీ ఫొటో గానీ, పేరు గానీ ఉచ్ఛరించటం లేదని విమర్శించటంతో పాటు పోలవరం నిర్మాణం మొత్తం కేంద్ర ప్రభుత్వమే నిర్మిస్తుందని, నిధులు తీసుకుంటూ కేంద్రాన్ని విమర్శించటం తప్పంటూ టీడీపీపై ధ్వజమెత్తారు. ఇందుకు సమాధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరాన్ని కేంద్రం నిర్మిస్తామంటే, వారికే అప్పగించి తాము పక్కకు తప్పుకుంటామని శాసనసభలో ప్రకటించారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కేంద్రం సరిగా నిధులు ఇవ్వకుంటూ అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. రెండవరోజు ఆ వ్యాఖ్యలను సవరించుకున్నారు.

మూడు రోజుల క్రితం పిఏసి సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు వైసీపీ నుండి టిడిపిలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలను మంత్రులుగా నియమించటం సరికాదన్నారు. దీనికి ప్రతిగా టీడీపీకి చెందిన మంత్రి అచ్చెనాయుడు ఎమ్మెల్యే బోండా ఉమలు విష్ణుకుమార్‌రాజు విమర్శలను పట్టించుకోవద్దని తేలిగ్గా కొట్టేశారు. అయితే విష్ణుకుమార్‌రాజు చేసిన విమర్శలు దావోస్‌లో ఉన్న చంద్రబాబుకు పార్టీ నేతలు అదేరోజు వివరించారు.

తగ్గుతున్న మోడీ ప్రభ

(మొదటిపేజీ తరువాయి)

నుంచి 132 వరకు పెరగొచ్చని అంచనా.

ఇది శాతాల లెక్క..

ఈ నెలలోనే ఎన్నికలు జరిగితే ఎన్డీయేకు దేశవ్యాప్తంగా 40 శాతం ఓట్లు లభిస్తాయి. యూపీఏ 30 శాతానికి పరిమితమవుతుది. బీజేపీకి 34 శాతం ఓట్లు లభిస్తాయి. 2014 ఎన్నికలతో పోల్చితే ఇది 3 శాతం ఎక్కువే. కానీ ఎనిమిది నెలల క్రితం జరిగిన సర్వేలో బీజేపీకి 39 శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 5 శాతం మైనస్‌గా ఉంది.

రాహుల్‌కు పెరుగుతున్న ప్రజాదరణ

కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో రాహుల్ గాంధీకి ప్రజాదరణ పెరుగుతున్నట్లు స్పష్టమైంది. ప్రధానిగా రాహుల్‌కు 8 నెలల క్రితం 9 శాతం మంది మాత్రమే ఓటు వేయగా ఇప్పుడు ఆ సంఖ్య 20 శాతానికి చేరింది. మోడీ 'పాపులారిటీ' మసకబారుతున్నట్లు తేలింది. 'మోడీయే మళ్లీ ప్రధాని కావాలి' అని 2017 మే నెలలో 44 శాతం మంది కోరుకోగా ఇప్పుడు ఆ సంఖ్య 37 శాతానికి పడిపోయింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో మోడీకి ప్రజాదరణ తగ్గింది. దక్షిణాదిన మరీ ఎక్కువగా పడిపోయింది. మోడీ ప్రభుత్వ పని తీరు బాగుందని గతంలో 64 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడు 51 శాతం మందే ఆ మాట చెప్పారు. అసంతృప్తి 27 నుంచి 40 శాతానికి పెరిగింది.

అచ్చేదిన్ ఎక్కడా..?

'అచ్చేదిన్'.. ఇది మోడీ మంత్రం. నిజంగానే 'మంచి రోజులు వచ్చాయని/వస్తాయని భావిస్తున్నారా అని 8 నెలల కిందట ప్రశ్నించగా 63 శాతం మంది ఔను అని బదులిచ్చారు. ఇప్పుడా సంఖ్య 40కి పడిపోయింది.

సమస్య ఏమిటి..?

'మీ దృష్టిలో ప్రధాన సమస్య ఏమిటి అని ప్రశ్నించగా 27 శాతం మంది 'నిరుద్యోగం' అని బదులిచ్చారు. 14 శాతం మంది పేదరికం, 10 శాతం మంది ధరల పెరుగుదల గురించి ప్రస్తావించారు. 'అవినీతి' తగ్గుతోందని ఈ సర్వేలో వెల్లడైంది. గత సర్వేలో 13 శాతం మంది 'అవినీతే ప్రధాన సమస్య'ని చెప్పగా ఇప్పుడు ఆ సంఖ్య 9 శాతానికి పడిపోయింది.

జీఎస్టీ హడావుడి చర్యే..

'నోట్ల రద్దు' భారత ఆర్థిక వ్యవస్థకు మంచిదని 48 శాతం మంది.. కాదని 34 శాతం మంది అభిప్రాయపడ్డారు. జీఎస్టీని హడావుడిగా ప్రవేశపెట్టారని 48 శాతం మంది, కాదని 42 శాతం మంది, ఆలోచించే చేశారని 27 శాతం మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రైతులు, వ్యాపార వర్గాల్లో బీజేపీపై అసంతృప్తి పెరుగుతుంది. తమ సమస్యలను ఎన్డీఏ కంటే యూపీఏనే బాగా పరిష్కరించిదని ఆ వర్గాల వారు తెలిపారు.

ఏ ప్రాంతంలో ఎవరికెన్ని ?

ప్రాంతం	స్థానాలు	ఎన్‌డీఏ	యూపీఏ	ఇతరుల
ఉత్తర భారతం	151	106-116	10-16	24-30
తూర్పు	142	68-76	15 -21	48-56
దక్షిణ	132	31-37	59-67	32-38
పశ్చిమ	118	79-89	30-36	0-2
మొత్తం	**543**	**293-309**	**122-132**	**110-120**

ముందే 'వేసవి' కూత..!

(మొదటిపేజీ తరువాయి)



గురు,శుక్రవారాల్లో కలిపి మొత్తం 225 ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. సికింద్రాబాద్-విజయవాడ, కాచిగూడ-కాకినాడ పోర్ట్, కాచిగూడ-విశాఖపట్నం, విశాఖపట్నం-తిరుపతి, తిరుపతి-కాచిగూడ, కాచిగూడ-కృష్ణరాజపురం, తిరుపతి-విశాఖపట్నం, సికింద్రాబాద్-గౌహతి, మధ్య మార్చి నుంచి జూన్ వరకూ నిర్దేశించిన రోజుల్లో సూపర్‌ఫాస్ట్, స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్లు గురు,శుక్రవారాల్లో అధికారులు ప్రకటించారు. దీంతో వేసవి ప్రత్యేక రైళ్లకు కూడా ముందస్తు రిజర్వేషన్ల ప్రక్రియ ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో ప్రారంభమైంది. రాబోయే రోజుల్లో చెన్నై-సత్రాగచ్చి, హైదరాబాద్-కొచ్చివెల్లి, తిరుపతి-నాగర్‌సోల్, తిరుపతి-కాకినాడ మధ్య కూడా ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. కాగా సువిధ, స్పెషల్ చార్జీల రైళ్ల వల్ల రైల్వేశాఖకు ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. తత్కాల్ టికెట్ల మాదిరిగానే ఈ రైళ్లలో టికెట్ చార్జీలు సాధారణ చార్జీల కంటే అధికంగా ఉండడంతో వివిధ మార్గాల్లో డజన్ల కొద్దీ నడుపుతోంది. ఉదాహరణకు సికింద్రబాద్-విజయవాడ మధ్య ఏర్పాటు చేసిన నెంబరు 07757/58 సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ చైర్‌కార్ టికెట్ ధర రూ. 620లుగా ఉంది. జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు విజయవాడ నుంచి సికింద్రాబాద్‌కు ఏసీ చైర్‌కార్ టికెట్ రూ. 520లు. దీంతో స్పెషల్ రైలుకు అదనంగా రూ. 100లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధంగా ప్రత్యేక రైళ్ల వల్ల ఆదాయం ఆశాజనకంగా ఉన్నందునే నెల రోజులు ముందుగానే వేసవి రైళ్లను ప్రకటించారని ప్రయాణీకులు పేర్కొంటున్నారు. సంక్రాంతి సెలవులకు నడిపిన విధంగానే వేసవిలో కూడా విజయవాడ-సికింద్రబాద్, విజయవాడ-విశాఖపట్నం, కాకినాడ-తిరుపతి, తిరుపతి-విశాఖపట్నం, సికింద్రాబాద్-కాకినాడ మార్గాల్లో జనసాధారణ్ రైళ్లను నడిపేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇన్నోవేషన్ వ్యాలీగా నవ్యాంధ్ర..
విజయవంతంగా దావోస్ పర్యటన
ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాలాంధ్ర అమరావతి : దేశంలో పరిశ్రమల స్థాపనికి ఏ రాష్ట్రానికి లేని అదుతే అవకాశాలు నవ్యాంధ్రకు ఉన్నాయని దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రామికవేత్తలు కొనియాడారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటున్న ప్రస్తుత తరుణంలో ఏపీలో ఇన్నోవేషన్ వ్యాలీ ఏర్పాటు చేస్తామని సీఎం నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. దావోస్ పర్యటన ముగించుకొని వచ్చిన ఆయన సీఎం మీడియా సమావేశంలో మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి కర్నూలు వరకు ఇన్నోకేషన్ వ్యాలీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకు సీఐఐ సహకరిస్తుందన్నారు. పెట్టుబడులు ఆకర్షించటమే లక్ష్యంగా చేసిన దావోస్ పర్యటన విజయవంతంగా జరిగినట్లు తెలిపారు. ప్రపంచంలోని మేధావులు, పారిశ్రామికవేత్తలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు ఇదన్నారు. తాను ఇప్పటి వరకు 14 సార్లు ఈ సదస్సుకు వెళ్లానని చెప్పారు. 20 ఏళ్ల తరువాత భారత ప్రధాని ఈ సదస్సుకు హాజరయ్యారన్నారు. ప్లీనరీలో మాట్లాడిన తొలి భాతర ప్రధాని నరేంద్ర మోదీ అని తెలిపారు. 4వ పారిశ్రామిక విప్లవం, టెక్నాలజీ, వ్యాపారం, పరిశ్రమలు తదితర రంగాలకు సంబంధించి కొత్త అంశాలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. భారత్ అత్యంత శక్తిపంతమైన దేశం, ఇక్కడ అవకాశాలు ఎక్కువ, ఇనార్మేషన్ టెక్నాలజీలో స్ట్రాంగ్, ఇక్కడ ఇంగ్లీష్ మాట్లాడేవారు అధికంగా ఉండటంతోపాటు అతి పెద్ద మార్కెట్ కలిగి ఉందని అందువల్ల ప్రపంచం మొత్తం భాతర్ వైపు చూస్తోందని చెప్పారు. ఈ పర్యటనలో రెండు ఎంఓయులు జరిగినట్లు, 25 ద్వైపాక్షిక సమావేశాలలో పాల్గొన్నట్లు వివరించారు. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సంబంధించి 50 సంస్థలు 'మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్' లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఆసక్తి వ్యక్తీకరణ లేఖలు) ఇచ్చినట్లు తెలిపారు. దావోస్ లో భారత్, ఆంధ్రప్రదేశ్ ఆకర్షణీయంగా నిలిచాయని, తాము ముఖ్యమైన అన్ని అంశాల్లో పాల్గొన్నామని చెప్పారు. యుపీఎల్ లిమిటెడ్ కంపెనీ గ్లోబల్ సీఈవో జై షరోఫ్ తో సమావేశమైనట్లు తెలిపారు. వర్షం పడకపోయినా సాగు నీటికి ఉపకరించే ఒక ఉత్పత్తిని యూపీఎల్ సంస్థ రూపొందించినట్లు తెలిపారు. భూమిలోని నీటిని గ్రహించి కరవు ఏర్పడిన సందర్భేలో నెమ్మదిగా నీటిని విడుదల చేసే ఉత్పత్తి ఇదని, దీనిని మన రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టడానికి వారిని ఏపీకి ఆహ్వానించినట్లు చెప్పారు.

పెట్టుబడులతో పారిశ్రామిక అభివృద్ధి...

రాష్ట్రంలో భాగస్వామ్య సదస్సులు నిర్వహించడం ద్వారా దేశంలో ఏ రాష్ట్రానికి రాని పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆటోమొబైల్ రంగంలో 3.7 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. అనంతపురానికి కియా మోటార్స్ రావడం, దక్షిణ కొరియా టౌన్ షిప్ ఏర్పడటంతో అక్కడి వాతావరణం మారిపోయిందన్నారు.

నేడు పల్స్ పోలియో



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని రకాలు చర్యలు తీసుకొంది. పోలియో రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే క్రమంలో ఈ కార్యక్రమాన్ని రెండు విడతలుగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతగా ఈనెల 28వ తేదీన, రెండో విడతలో మార్చి 11వ తేదీన పోలియో చుక్కలను వేయనున్నారు.అప్పుడే పుట్టిన బిడ్డలు మొదలుకొని ఐదేళ్ల వయసు కలిగిన పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చని యునెస్కో, యునిసెఫ్ వంటి సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ సారి రాష్ట్రంలో 60 లక్షల మంది చిన్నారులకు అవసరమైన మందులను అధికారులు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా 1.50 లక్షల మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులతోపాటు అంగన్వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పాఠశాలలు, కళాశాలలు, కూడళ్లు, బస్టేషన్లు, రైల్వేస్టేషన్లు.. ఇలా ప్రజలు తిరుగాడే ప్రదేశాల్లో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే కిట్లతో ఇంటింటికీ తిరిగి టీకాలు వేసే విధంగా కూడా అధికారులు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్గించేందుకు ఇప్పటికే 13 జిల్లాల్లో విస్తృతమైన ప్రచారం చేస్తున్నామని తెలిపారు. అలాగే టీవీ ఛానళ్లు, సినిమా థియేటర్లలో పోలియో చుక్కల ఆవశ్యకతను వివరించే ప్రకటనలతో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

హాస్టల్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వైఫల్యం: ఏఐఎస్ఎఫ్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లు, మేనేజిమెంట్ హాస్టళ్లలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రంగన్న తెలిపారు. విజయవాడలోని కబేళా వీధిలోని ఎస్సీ మేనేజిమెంట్ హాస్టల్‌లో నగర కార్యదర్శి పి చరణ్ అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగన్న మాట్లాడుతూ రాష్ట్రంలో హాస్టళ్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. వీటిని పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం దురదృష్టకరమన్నారు. హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, స్నానాలగదులు, మరుగుదొడ్లు, విద్యుద్దీపాలు, ఫ్యాన్లు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినీ విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో హాస్టళ్లను అభివృద్ధి చేస్తాం.. ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తాం.. మెస్ చార్జీలను పెంచుతాం.. సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తాం.. అని హామీలు గుప్పించిన టీడీపీ అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగేళ్లు కావస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం ఆయా తరగతులను బట్టి చెల్లిస్తున్న మెస్‌చార్జీలను పెంపుదల చేయాలని ఆయన డిమాండు చేశారు. ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో రాబోయే రోజుల్లో ఉద్యమిస్తామని రంగన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం జరిగిన ఎస్సీ మేనేజిమెంట్ హాస్టల్ కమిటీ ఎన్నికలో అధ్యక్షునిగా సందీప్, కార్యదర్శిగా శ్రీరామ్ ఎన్నికయ్యారు. అలాగే కార్యనిర్వాహక కార్యదర్శితోపాటు మరో వంద మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

పతాకావిష్కరణలో అపశ్రుతి...!

- ముడి ఊడక ఎగరని జాతీయ జెండా
- సీరియస్ అయిన సీఎం చంద్రబాబు
- జెండాను సరి చేసిన యోగా కో ఆర్డినేటర్
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వారం రోజులపాటు నిర్వహిస్తున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలలో భాగంగా జాతీయ పతాకావిష్కరణలో అపశ్రుతి చోటు చేసుకుంది. విజయవాడకు సమీపంలోని ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని ఏసీఏ క్రికెట్ స్టేడియంలో సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. టోర్నమెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా తొలుత సీఎం చంద్రబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేందుకు ఉద్యుక్తులయ్యారు. అయితే జెండాకు గట్టిగా తాడుతో ముడి వేయటంతో అది ఊడలేదు. అయినప్పటికీ సీఎం చంద్రబాబు ఓప్పిగ్గా జెండాను లాగేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోవడంతో చిరాకు పడ్డ ఆయన వెంటనే పక్కనే ఉన్న సివిల్ సర్వీసెస్ జెండాను, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) జెండాను ఆవిష్కరించారు. జాతీయ జెండా ఆవిష్కరణ కాకుండానే క్రీడాకారుల నుంచి చంద్రబాబు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అప్పటికే రాష్ట్ర యోగా, క్రీడలకో ఆర్డినేటర్ రవీంద్రనాథ్ జెండా ముడిని లాగి పతాకావిష్కరణ చేసేందుకు కుస్తీ పడుతూనే ఉన్నారు. ఈలోగా పోలీసు బ్యాండ్ జనగణ మన గీతాన్ని కూడా ఆలపించింది. ఎంతకీ జెండా ఎగరకపోవటంతో కో ఆర్డినేటర్ రవీంద్రనాథ్, శాప్ ఇతర సిబ్బంది జెండా పోల్‌ను బయటకు లాగి జాతీయ జెండా ముడిని ఊడదీశారు. ఆ సమయంలో పోల్ పక్కనే బెలూన్‌లు పట్టుకున్న విద్యార్థినులపై పోల్ పడబోగా విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌తోపాటు ఆ దృశ్యాన్ని తన కెమేరాలో బంధించేందుకు వచ్చిన ది హన్స్ ఇండియా ఫోటోగ్రాఫర్ వై వినయ్‌కుమార్, గవర్నర్‌పేట -1 డిపో కండక్టర్ కే బాబూలాల్ అప్రమత్తమై పోల్‌ను పట్టుకున్నారు. దీంతో అక్కడ స్వల్ప ప్రమాదం తప్పింది. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో చివరిగా జాతీయ జెండా ఎగరటం గమనార్హం. ఇదిలావుండగా, జాతీయ పతాకం ఎగరకపోవటంపై సీఎం చంద్రబాబు అధికారుల వైఖరిపై సీరియస్ అయ్యారు. దీంతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. కృష్ణాజిల్లా కలెక్టర్ బీ లక్ష్మీకాంతం ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ బాబూరావు విచారణ చేపట్టారు. పోల్‌కు జెండా ఎవరు కట్టారో చెప్పాలని ఆయన శాప్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (వీసీ అండ్ ఎండీ) ఎన్ బంగార రాజును కోరారు. రాష్ట్ర యోగా, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న రవీంద్ర నాథ్ జెండా కట్టారని, అయితే ఆయన నామి నేటెడ్ పోస్టులో ఉన్నట్లు బంగార రాజు తెలియజేశారు. ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు జాతీయ జెండాను కట్టటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్య తీసుకోవాల్సి ఉన్నందున అందుకు బాధ్యుల పేరు చెప్పాలని జేసీ-2 బాబూరావు శాప్ వీసీ అండ్ ఎండీ బంగారరాజును కోరటం గమనార్హం.



సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల తిరుపతిలో జరిగిన 71 రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో నూతన కార్యవర్గం ఎంపిక తర్వాత విజయవాడలోని ఎస్టీయూ కార్యాలయంలో శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. సీపీఎస్ రద్దు కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు. ఉద్యోగ, ఉపా ధ్యాయులకు సంబంధించి పదవ వేతన సవరణ కమిటీ నియామకం, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరు, పదవీ విమరణ చేసిన వారికి అర్ధవేతన సెలవును నగదుగా మార్చుకోవడానికి జీఓలో సవరణలు వంటి అంశాలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నెలవారీ ప్రీమియం చెల్లిస్తున్న హెల్త్‌కార్డు కలిగిన ఉద్యోగ, ఉపాధ్యాయులు సదరు కార్డులను సమగ్రంగా వినియోగించుకునే విధంగా జీవోల జారీకి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన నేతలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు గంటా మోహన్, ఢిల్లి ప్రసాద్, ధనుంజయ నాయుడు, పి మధుసూదన్‌తోపాటు వివిధ జిల్లాల నుంచి హాజరైన నాయకలు అభినందనలు తెలిపారు.



సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్‌కే శర్మ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కే శర్మ తెలిపారు. విజయవాడలోని ఒక హోటల్‌లో శనివారం యూనియన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, గ్రూప్-సీ,డీ ఉద్యోగుల వేతన సవరణకు కేంద్రంపై వత్తిడి తెస్తామన్నారు. అనంతరం రాబోయే యూనియన్ ఎన్నికల్లో ఫెడరేషన్ వ్యూహాలు, ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఫెడరేషన్ వర్కింగ్ ప్రసిడెంట్ పీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ కమలాకన్నన్, వైస్ ప్రసిడెంట్ ఎం ప్రసాదరావు, నాయకులు పవన్‌కుమార్ శర్మ, స్టీఫెన్‌తోపాటు వివిధ రాష్ట్రాల నుంచి సంచాలకులు పాల్గొన్నారు.

తక్షణమే విశాఖ రైల్వే జోన్ ప్రకటించాలి

రైలు దీక్షకు సీపీఐ మద్దతు: కె రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేంద్రప్రభుత్వం తక్షణమే విశాఖ రైల్వే జోన్‌ను ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండు చేశారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు కోసం ఉత్తరాంధ్ర చర్చావేదిక తరపున మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ చేపట్టిన 48 గంటల రైలుదీక్షకు సిపిఐ తరపున మద్దతు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లో విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, గత ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చిందన్నారు. అంతకు ముందు కూడా పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో అప్పటి రైల్వే మంత్రి జాఫర్ షరీఫ్ విశాఖ రైల్వే జోన్ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఏర్పాటై 44 మాసాలు గడుస్తున్నప్పటికీ ఏపీకి రావలసిన విభజన హామీల అమలుకు నోచుకోలేదన్నారు. ఈ విషయమై 2016 మార్చి 16వ తేదీన లోక్‌సభలో 'కమిటీ వేశామని, కమిటీ పరిశీలన తర్వాత రైల్వే జోన్ విషయం చూస్తాం' అని కేంద్రం ప్రకటన చేసిందన్నారు. కానీ ఆ కమిటీ ఏం నివేదిక ఇచ్చిందో తెలియచేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. సాధారణంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలంటే 600 కిలోమీటర్ల పరిధి ఉంటే సరిపోతుందన్నారు. కాని విశాఖ డివిజన్‌లో 1052 కిలోమీటర్ల పరిధి ఉందన్నారు. ఒక్క విశాఖపట్నంలోనే రైల్వేశాఖ అధీనంలో 782 ఎకరాల భూమి అందుబాటులో ఉందన్నారు. దేశంలో అతిపెద్ద డీజిల్ లోకోషెడ్, వ్యాగన్ వర్క్‌షాప్, కోచ్ డిపో వంటి రైల్వేజోన్ ఏర్పాటుకు అనువైన సదుపాయా లున్నాయని ఆయన తెలిపారు. రైల్వేజోన్ ఏర్పాటుకు అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ బీజేపీ రాజకీయ స్వార్థం కోసం విశాఖ రైల్వేజోన్ ప్రకటించకుండా తాత్సారం చేస్తోందని ఆయన విమర్శించారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్లమెంటు సాక్షిగా చేసిన చట్టాల అమలు విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిందిపోయి, మెతకవైఖరి అవలంభిస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి బడ్జెట్ సమావేశాల్లో విశాఖ రైల్వేజోన్ ప్రకటించాలని రామకృష్ణ డిమాండు చేశారు.

'ఉపాధి' అవార్డుల దరఖాస్తుకు ఫిబ్రవరి 20 వరకు గడువు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : జాతీయస్థాయిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ ఆర్ఈజీఎస్) అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును కేంద్రం పొడిగించింది. ఉపాధి పథకాన్ని అమలు చేయటంలో రాష్ట్ర, జిల్లాలస్థాయిలో అవార్డుకు ఫిబ్రవరి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ కార్యదర్శి ఏకే సుంబ్లే సూచించారు. ఈ మేరకు ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయానికి సర్క్యులర్‌ను జారీ చేశారు. అలాగే 2016-17 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం వేతనాల చెల్లింపులో ప్రతిభ కనబరిచిన మొదటి పది మందికి కూడా అవార్డులున్నా యన్నారు.

టెన్త్ సీసీఈ విధానంతో ఎవరికి మేలు..?

ఏడాది క్రిందటే విచారణకు ప్రకటించిన మంత్రి గంటా

విశాలాంధ్ర-విశాఖసిటీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతేడాది నుంచి పదవ తరగతి పరీక్షల్లో అవలంభిస్తున్న నూతన విధానం సీసీఈతో పరీక్షా ఫలితాల పట్ల విద్యావర్గాలతో పాటు విద్యార్థుల తల్లితండ్రుల్లో కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీసీఈ విధానానికి ముందు 2015వ సంవత్సరంలో రాష్ట్రం మొత్తమ్మీద 6,06,575 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరవ్వగా వారిలో 4,680 మంది విద్యార్థులు 10/10 సీజీపీఏను సాధించారు. అంటే పదికి పది సీజీపీఏ 0.77 శాతం మందికి లభించింది. 2016 ఏడాదిలో నిర్వహించిన 10వ తరగతి పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 6,17,030 మంది హాజరుకాగా వారిలో 94.52 శాతంతో 5,83,266 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 10/10 సీజీపీఏను 6,444 మంది మాత్రమే సాధించారు. అంటే 1.04 శాతం మందికి మాత్రమే ఆ ఏడాది టెన్త్ ఫలితాల్లో 10/10 లభించాయి. ఇక సీసీఈ విధానంలో పదవతరగతి పరీక్షలు నిర్వహించిన గతేడాది ఫలితాలను పరిశీలిస్తే రాష్ట్ర వ్యాప్తంగా 6,09,502 మంది టెన్త్ పరీక్షలకు హాజరుకాగా వారిలో 91.92 శాతంతో 5,60,253 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో 10/10 సీజీపీఏను 18,225 మంది సాధించారు. 10/10 అంతకు ముందు కన్నా రెండు రెట్లు అమాంతం పెంగడంతో ఈ విద్యా విధానంపై విద్యావర్గాలతో పాటు విద్యార్థుల తల్లి తండ్రులకు అనుమానాలు వచ్చాయి.

సీసీఈ విధానంతో పరీక్షలు :

సాధారణంగా పదవతరగతి పరీక్షలు 100 మార్కులకు నిర్వహిస్తారు. కానీ ఈ సీసీఈ విధానంతో 80 మార్కులకు మాత్రమే పబ్లిక్ పరీక్షలు జరిపి, మిగిలిన 20 మార్కులకు ఆయా విద్యార్థి చదువుతున్న పాఠశాలలోనే పరీక్ష నిర్వహిస్తారు. దీంతో 20 మార్కులు విషయంలో పాఠశాలల యాజమాన్యలు అవకతవకలకు పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి.

విచారణ చేయిస్తానన్న విద్యాశాఖా మంత్రి :

2017 టెన్త్ ఫలితాల్లో ఊహించని స్థాయిలో 10/10 సాధించిన విద్యార్థుల సంఖ్య 18,225 మందిగా ఉండడం, గత ముందు ఏళ్లతో పోల్చుకుంటే ఆ సంఖ్య రెండు రెట్లు పెరగడంతో ఆ ఏడాది పది ఫలితాలు విడుదల రోజునే మంత్రి గంటా శ్రీనివాస్ ఈ వ్యవహారంపై విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు.

ప్రైవేట్ పాఠశాలలకు మేలు:

ఈ సీసీఈ విధానం ప్రైవేట్ పాఠశాలలకు మేలు చేకూర్చడానికేనని విద్యావర్గాల్లో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. 2016 ఫలితాల్లో రాష్ట్రంలో పది ఫలితాల్లో 10/10 సాధించిన విద్యార్థుల సంఖ్య 6,444 మంది ఉంటే వారిలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు కేవలం 389 మంది మాత్రమే. మిగిలిన 6,055 మంది కూడా ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వారే. మరి గత ఏడాది ఫలితాల్లో 18,225 మంది రాష్ట్రంలో 10/10 సాధిస్తే వారిలో ఎంత మంది ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారో ఊహించుకోవచ్చు. రాష్ట్రంలో విద్యా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తాం, మెరుగైన విద్యా బోధన తీసుకువస్తాం అని పదే పదే ప్రకటించే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావులు టెన్త్ పరీక్షలకు అవలంభిస్తున్న సీసీఈ విధానం పట్ల ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుల మృతి



విశాలాంధ్ర-చర్ల : చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతల్నార్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని తడిమెట్ల-మొరంపల్లి దండకారణ్యంలో శనివారం తెల్లవారు జామున పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పులలో స్కాల్‌పారాకు చెందిన జన మిలీషియా కమాండర్ గుంచె బంద్రితోపాటు మహిళా మావోయిస్టు ఒకరు మృతి చెందారు. ఘటనకు సంబంధించిన వివరాలను సుకుమా జిల్లా ఎస్పీ అభిషేక్ మీనా వెల్లడించారు. 'కోబ్రా(కమాండో బెటాలియన్ ఫర్ రెసొల్యూట్ యాక్షన్), సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక విభాగం 201వ బెటాలియన్‌కు చెందిన సంయుక్త బృందం ఒకటి స్థానిక పోలీసులతో కలిసి ఇక్కడికి 500 కిలోమీటర్ల దూరంలోని చింతల్నార్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించింది' అని ఆయన తెలిపారు. నాలుగురోజుల క్రితం నారాయణపూర్ జిల్లాలోని ఇర్పనార్ దండకారణ్యంలో మావోలకు, పోలీసులకు జరిగిన ఎదురు కాల్పులలో నలుగురు పోలీసులు మృతి చెందగా 9 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలైన ఘటన విదితమే. కాగా దీనికి ప్రతీకార చర్యగా నారాయణపూర్, సుక్మా జిల్లాలలో భారీగా సీఆర్‌పీఎఫ్, జీఆర్జీ భారీగా పోలీసు బలగాలు మోహరించి కూంబింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో చర్య, ప్రతీకార చర్యలతో దండకారణ్యం దద్దరిల్లుతోంది. ఎదురు కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో భద్రతా దళాలు జరిపిన గాలింపులో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. అక్కడ నుంచి రెండు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.

హమాలీ సమస్యలను పరిష్కరిస్తామని ఎండీ హామీ : ఏఐటీయూసీ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) హామీ ఇచ్చినట్లు ఏఐటీయూసీ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లా అంజనేయులు, ఎస్ వెంకట సుబ్బయ్య ప్రకటనలో తెలిపారు. కార్పోరేషన్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 268 మండల స్టాక్ పాయింట్లలో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు నిర్వహిస్తున్న హమాలీ కార్మికులకు రెండేళ్లకు ఒకసారి కూలీ రేట్ల పెంపుపై జరిగిన ఒప్పందం గత డిసెంబరుతో ముగిసిందన్నారు. జనవరి నుంచి కొత్త రేట్లను ఇవ్వాలని ఏఐటీయూసీతోపాటు సీఐటీయూ, హమాలీ సంఘాలు వేర్వేరుగా చార్టర్ ఆఫ్ డిమాండ్స్ ఇచ్చిన నేపథ్యంలో కార్పోరేషన్ కార్యాలయంలో జనరల్ మేనేజర్లు వెంకట రమణ (పీడీఎస్), ప్రకాశరావు (మార్కెటింగ్), రామసర్సయ్య (సేల్స్), కల్పన (పీఎఫ్ సెక్షన్) కార్మిక సంఘాల నాయకులతో సంయుక్త సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నోటీసులో పేర్కొన్న డిమాండ్లపై చర్చించిన అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకొని లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు పెంచాలని తాము అధికారులను గట్టిగా కోరామన్నారు. కూలీ రేట్లతోపాటు 60 ఏళ్లు నిండిన కార్మికులకు లక్ష రూపాయల గ్రాట్యుటీ ఇవ్వాలని, ప్రమాద బీమా రూ. 5 లక్షలు కల్పించాలని, స్వీపర్లకు కనీస వేతనాలు చెల్లించాలని కోరామన్నారు. అలాగే సంక్రాంతి కానుక, రంజాన్‌తోఫా, క్రిస్మస్ కానుక మొదలైన ప్రత్యేక వాటికి ప్రత్యేక కూలీ ఇవ్వాలని డిమాండు చేసామన్నారు. ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్‌కు సొంత గోడౌన్లను నిర్మించాలని, డైరెక్ట్ మూమెంట్ నిర్వహించకుండా ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారానే ఎగుమతి చేయాలని కోరామన్నారు. ఇందుకు అధికారులు అంగీకరించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ అంశాలపై కార్పోరేషన్ ఎండీ వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. అధికారులతో సమావేశమైన వారిలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి కృష్ణ, ఏపీ సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి కామేశ్వరరావు, చిక్కాల గోవింద్, కొఠారి రమణ, సహాయ కార్యదర్శులు ఎం మన్మధ రావు, ఆర్ అంజిబాబు, టి వీరబాబు, నాయకులు రుత్తల నూకరాజు, మురళి, సూరి, యాకోబు, శ్రీమన్నారాయణ, పైడియ్య, శ్రీరాములు పాల్గొన్నారని నేతలు తెలిపారు.

సంపాదకీయం

చలిగింతలు

రుతువు.. ప్రకృతి లిఖించిన ఆదికావ్యం, చిత్రించిన సకల వర్ణ దృశ్యం, ఆలపించిన సుమధుర గీతం. కాలం దివ్య యాత్రలో ఓ మజిలీ. ఆరు రుతువుల్లో వేటికవే నిత్యనూత్నం, అత్యంత విచిత్రం, విస్మయపరిచే అద్భుతం, సకల ప్రాణి సమ్మోహనం. ఈ ఆరు రుతువులూ పదహారు కళలుగా మానవ జీవనగ్రంథాన్ని సుసంపన్నంచేసే ప్రకరణాలే.. జీవ వైవిధ్యానికి ప్రకరణాలే. ఇప్పుడు మనల్ని హేమంతం పలకరిస్తోంది. 'తుషార శీతల సరోవరాన, అనంత నీరవ నిశీథిలోన సుమధుర రసానుభూతిని పంచుతోంది. తెలుగువారికే కాదు, ఉష్ణమండలానికి చెందిన దక్షిణాపథంలోని వారందరికీ చలికాలం ఆప్యాయంగా ఆహ్వానించగదినదే. చలిదేశాల్లో నివసించే వారు మాత్రం శీతరుతువును జీవితపు దుర్దినాలతో పోల్చుకుంటారు. ఆ దేశాల్లో ఎడతెగని మంచు కురిసి నేలంతా హిమావృతమై నిప్పచ్చరంగా ఉంటుంది. మనకు ఆ బాధ లేదు. మనకు అన్ని రుతువుల్లోకెల్లా హేమంత, శిశిరాలే ఆహ్లాదకరమైనవి. అందుకేనేమో మన పెద్ద పండగలన్నీ ఎండలు, వానలు వెనుకబట్టిన తర్వాతనే వరుసగా వస్తాయి. హేమంతం.. పెద్ద పండగలు తెచ్చే ఆప్తబంధువు. వేసవిలో ఎండలోకి రావడమే భయం. శీతాకాలంలో మాత్రం సూర్యుడు నిజంగానే లోకబాంధవుడిగా మనకు కనిపిస్తాడు. కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక'లో బొండుమల్లెలు దండిగా విచ్చుకొనే విలాసవేళే హేమంతం అని అభివర్ణించాడు. మనిషి మెదడు చురుగ్గా పనిచేయడం మొదలుపెట్టిన తర్వాత కొత్త కొత్త పరికరాలు, పరిజ్ఞానాన్ని కనుగొని ప్రకృతిని వికృతిగా మార్చే దుస్సాహసానికి దిగుతున్నాడు. ఫలితంగా వాతావరణ సమతౌల్య త దెబ్బతిని రుతువుల దరువు ప్రారంభమైంది. దీంతో చలిపులి గాండ్రిస్తోంది. గజగజ వణికిస్తోంది. అయితే ఈ ఏడాది ఈ చలిపులి భీకరంగా జూలు విదిల్చింది.

నిజమే.. చలి, చిన్న పదమే అయినా తలపుల్లోకి వచ్చినా.. తరుముకొచ్చినా భరించడం కష్టమే! శీతగాలి జివ్వుమనగానే చాటలోని వెలక్కాయలాగా గుండె తెగ దొర్లుతుంది. సోడాబుడ్డిలోని గోళీఖాయలాగా కొట్టుకొంటుంది. పుటుక్కున దారం తెగిన హారం లాగా వెన్నెముకలోని ఒక్కోపూసా జారిపడుతుంది. వేళ్లు వంకర్లు తిరుగుతాయి. ఒళ్లు జలదరిస్తుంది. దవడల్లో దదదద.. తనువంతా గజగజలాడుతుంది. పొగమంచులోంచి రొదచేస్తూ వచ్చిన గాలి ముక్కుపుటల్లోకి చొరబడి.. కనిపించని సూదులతో గాట్లు పెడుతుంది. పెదవులు, పాదాలు పగుళ్లెదతాయి. విశాఖ మన్యంలో ముఖ్యంగా లంబసింగి, చింతపల్లి ప్రాంతాల ప్రజలు ఈ చలిపులి గాండ్రింపుల భయాన్ని అనుభవిస్తున్నారు. చలి సివంగి విశ్వరూపాన్ని లంబసింగి వాసులు ఇటీవల కాలంలో నిత్యం దర్శిస్తున్నారు.. భరిస్తున్నారు. అక్కడ ఉష్ణోగ్రత మూడు డిగ్రీలు నమోదవుతోంది. గతంలో అయితే అక్కడ ఏకంగా సున్నా డిగ్రీలకు చేరింది. న్యూయార్క్‌లోనే కాదు, లంబసింగి లోనూ మంచుతాకిడి ఉక్కిరిబిక్కిరి చేసింది. అందుకే హిమేవ హంతీతి హేమంత: అన్నారు. అంటే హిమంతో హింసించేది హేమంతం. ఇది మనకు కొత్త కాదనే చెప్పాలి. రాముడి కాలంలోనూ హేమంత విజృంభణ ఉన్నట్లు తెలుస్తోంది. శత్రువుల మీద దండయాత్రకు శీతాకాలమే మిక్కిలి అనువైనదని వాల్మీకి పేర్కొన్నారు. సీతాలక్ష్మణ సమేతంగా శ్రీరాముడు గోదావరి తీరాన ఉండగా 'దిశలెల్ల చలికి భీతిల్లి ముసుగుపెట్టినటుల' హిమపాత ఉత్పాతం ముంచుకొచ్చిందని రంగనాథ, ఉత్తర రామాయణ భాష్యకారులు విశదీకరించారు. రామచంద్ర ఉపాఖ్యా నము, రామరాయ విలాసము కావ్యాల్లోనూ సుశీతల శిశిర ఆగమనం లలిత కుసుమ శోభితంగా భాసించిందని వర్ణించారు. శివరాత్రి మహాత్మ్యములో శ్రీనాథుడు.. పెనుచలికి గడగడ వణికిన వనదేవత దంతవీణ వాయించినట్లు పేర్కొన్నారు. భాగవతంలో రుతుశ్రీమంతంగా, పంచతంత్రంలో హేమంత భాస్వంతంగా వర్ణించారు. కళాపూర్ణోదయంలో నాయికానాయకుల ప్రణయో త్సాహంగా శీతరుతువును దర్శించారు. శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో హేమంతాన్ని కామినులు అధరాలకు మధూచ్ఛిష్టం అద్దుకొనే అవసరంగా పేర్కొన్నారు. హేమంతం ఇసుమంత కుసుమ వికాస పరిమళ శోభితం అని ముక్కు తిమ్మన్న అక్షరీకరించారు. యవ్వనవతులు లజ్జపర్యాలనొదిలి ప్రాణేశుల బిగికౌగిల్లో ఒళ్లు కాచుకొనే కమ్మని కాలం.. హేమంతం అని ధూర్జటి చమత్కరించారు. నిజమే ప్రణయానికి హేమంతానికి విడదీయలేని బంధం ఉంది. హేమంతానికి గిలిగింతలు పోని కవులు లేరు.'రుతు సంహారం'లో విశ్వనాథ హేమంతాన్ని వర్ణిస్తూ ఆవుదూడ నుదుటిమీద ఆదే మంచుబొట్టు గుజరాతీనాతి పాపిట మెరిసే ముత్యమంత పవిత్రంగా ఉంది' అన్నారు. బాపురెడ్డి రుతురాగంలో హేమంతి గానం వినిపించారు. మన సినీకవులు మాత్రం తక్కువ తిన్నారా..! కొండగాలి తిరిగింది... గుండె ఊసులాడింది అన్నారు ఆరుద్ర. ఉత్తర దిశనుంచి చలిగాలి సుళ్లు రేగితే.. గోదావరి వరదలాగా కోరిక చెలరేగెం దన్నారు. వాసంత సమీరము నీవై, హేమంత తుషారము నీవై అని పేర్కొన్నాడు మహాకవి శ్రీశ్రీ. విరహబాష్ప తుషారమ్ము గురిసె కనుమొగిడ్చెను హేమంత కాళరాత్రి అని ఒకాయన అంటే, చన్నీటి వాయువు జలకంబులాడి పుప్పొడి మైనిండా బూసికొన్నాడని మరో రచయిత సెలవిచ్చారు. కావ్యాలు, కథలు, సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలోనూ చలికాలం సుమబాణం అంటూ సరాగాలకు దిగి నరసల్లాపాలాడే వారికి కొదవుండదు. చలిగాలికి పులకరం, పూల ఊసుకు కలవరం, శీతకాలం జలదరింతలతో పలవరింతలు పోయే వరూధినీ ప్రవరులకు లెక్కుండదు.

ఇదంతా హేమంత రుతు విలాసమైతే.. మరోవైపు విలాపమూ ఉంది. ఎముకలు కొరికే చలిలో గజగజ వణుకుతూ, గడగడలాడుతూ బతుకుజీవుడా అంటూ కాలం వెళ్లదీసే బక్క ప్రాణులకు అది కాళరాత్రే. ఢిల్లీ, ముంబై, కోల్‌కత్తా, మద్రాసు, హైదరాబాద్ వంటి మెట్రోపాలిటన్ నగరాలతోపాటు చిన్న చిన్న పట్టణాల వరకూ ఎందరో అభాగ్యులు, అనాథలు, రెక్కలు ముక్కలు చేసుకొనే బడుగుజీవులు చలి కరిచే కాళరాత్రి రోడ్లపైనే కాలంవెళ్లదీస్తారు. చలి కాటుకు ఎందరో మృత్యువాత పడుతుంటారు. మన దేశంలో ప్రతి శీతకాలంలో ఈ విషాద ఘటనలు సహజమే. కాకపోతే ఇవేవీ వార్తలకెక్కవు. శీతకాలం కోతపెట్టగ, కొరడుకట్టీ, ఆకలేసీ కేకలేసిన అభాగ్యులను మహాకవి శ్రీశ్రీ అక్షరీకరించారు. శీతాకాలంలో ఆరుబయట ప్రకృతి చిత్రహింసలు కన్నా జైల్లో వెచ్చగ గడపడమే మేలని, అందుకు నేరం చేసి పోలీసులకు దొరికిపోవాలని ఓ నిర్భాగ్యుడు పడిన నానా పాట్లు గురించి ఆంగ్ల కథకుడు ఓ హెన్రీ 'కాప్ అండ్ యాంథమ్' కథలో హృద్యంగా చిత్రీకరించారు. ఇప్పుడంటే కాయిల్స్, మస్కుటోలు వచ్చాయి కానీ గతంలో చలి పులి పంజాకు దడిచి ఫ్యాన్ కట్టేస్తే గదంతా దోమలు దండెత్తేవి. ఎంత కప్పుకొని పడుకున్నా పగబట్టినట్లు అవి కుట్టేవి. ప్రసిద్ధ రచయిత ఈవీ లూకాస్ ఈ దయనీయ స్థితిని వర్ణించాడు. దోమలకు మన రక్తమే మద్యం. అవి బాగా జుర్రుకొని కైపెక్కి పడుకున్న తర్వాతే వాటిని మట్టుపెట్టాలని చమత్కరిస్తాడు.

ఏ రుతవునైనా మనిషికి మేలు చేసేందుకే ప్రకృతి ప్రసా దించింది. మనిషి స్వార్థంతోనే ప్రకృతి నియమాన్ని భంగపర్చి తను బాధల లోయల్లోకి నెట్టబడుతున్నాడు. ప్రకృతిని మనం కాపాడితే.. అది మనల్ని రక్షిస్తుంది. చలిలో వెచ్చదనం, వేడిమిలో చల్లదనం ఒంటికి, ఇంటికి రక్షణ కవచంగా పనిచేస్తాయి. ఆంగ్లకవి షెల్లీ అన్నట్లు హేమంతం తర్వాత వసంతం రాకుండా పోతుందా? (If Winter comes can Spring be far behind?). 'కుహూరుత శీకరాలే లోకమంతా జల్లులాడే ముహూర్తాలు ఆగమిస్తా'యని ఆశిద్దాం.

విశ్లేషణ

మోడీ సర్కారు గాలిబుడగలు - భాగం 8

జావగారిన మోడీ పథకాలు



మర్ల విజయ కుమార్

ఆక్స్‌ఫామ్ అంతర్జాతీయ సంస్థ లెక్కల ప్రకారం 2017లో భారతదేశంలో ఉత్పత్తి అయిన సంపదలో 78 శాతం అత్యంత ధనికులైన 1 శాతం కుబేరుల జేబుల్లోకి చేరింది. వారి అంచనా ప్రకారం ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా అతితీవ్ర స్థాయిలో భారతదేశంలో సంపద తారతమ్యాలు పెరిగిపోతునాయి. గత మూడున్నర ఏళ్ళలో మోడీ ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అన్నీ క్రమం తప్పకుండా చతికిలపడి, జావగారిపోతుంటే, దేశ సమస్యలను మురగబెట్టి, ప్రజలలో కుల మత విద్వేషాలు రెచ్చగొట్టి, వారి ద ృష్టిని మళ్లించి, చల్లగా చాపక్రిందనీరులాగా ఈ దేశాన్ని దేశీయ, విదేశీయ బడా వ్యాపార సంస్థల పరంచేయటానికి కుట్రలు పన్నుతున్నదీ ప్రభుత్వం. జీఎస్టీ అమలు, కరెన్సీ రద్దుతో చెలరేగిన ఆర్థిక సమస్యలు, వ్యవసాయరంగం పూర్తి నిర్లక్ష్యంతో రైతులలో పెల్లుబికిన ఆగ్రహం, మాటలు నీటిమూటలై, కల్పిస్తామన్న 10 కోట్ల ఉద్యోగాలు ఎక్కడా కానరాకపోవటం, అడ్డూ ఆపూ లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు, మరొక పక్కన ఇష్టారాజ్యంగా బ్యాంకులను బడా పెట్టుబడిదారులు నిరర్థక అప్పుల పేరున కొల్లగొట్టుకోవటం గమనిస్తే, ఈ ప్రభుత్వానికి దేశ ఆర్థిక వ్యవస్థను ఎట్లా నడపాలో, సమస్యలను ఎట్లా పరిష్కరించాలో తెలిసినట్లుగా లేదనే అభిప్రాయాన్ని చాలామంది ఆర్థిక నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ చర్యలన్నీ అసంఘటిత రంగ, గ్రామీణ పరిశ్రమలను, వ్యాపారాలను దెబ్బతీసి, బడా వ్యాపార సంస్థల పరంచెయ్యటమే పరమావధిగా కనిపిస్తున్నది. నగదురహిత భారత్ పేరున ప్రతి ఆర్థిక లావాదేవీ, అది చిన్నదైనా, పెద్దదైనా నగదు రూపంలో కాకుండా, ఎలక్ట్రానిక్‌గానే జరగాలని ఒత్తిడితేవటం చూస్తుంటే, ఏటా ఈ ఇంటర్‌నెట్ కంపెనీలకు 3. 4 లక్షల కోట్ల రూపాయల లాభాలు పండించటమే ప్రధాన ధ్యేయంగా తేటతెల్లమవుతోంది. విదేశీ బ్యాంకులలోని 90 లక్షల కోట్ల రూపాయల అక్రమ డిపాజిట్లను వెనక్కు తెచ్చి, ప్రతి పౌరునికీ 15 లక్షల రూపాయలచొప్పున బ్యాంకు అక్కౌంట్లలో వేస్తానని ఎన్నికల సమయంలో చేసిన ప్రతిన ఊసెత్తటంలేదు మోడీ. ఎంతో ఆర్భాటంతో ప్రకటించిన పథకాలన్నీ ఒక్కొక్కటిగా గాలిబుడగల్లాగా తప్పున పేలిపోయి, మాయం అయిపోతోంటే, "అనుకున్నది ఒక్కటీ, అయినది ఒక్కటీ, బోల్తా కొట్టావులే బుల్ బుల్ పిట్టా!" అని లోకం అంతా మోడీని, అతని వానర గణాల్నీ చూసి ఎకసెక్కం చేస్తున్నారు. వేళాకోళం మాట అటుంచి, ధనిక వర్గాలు, అవినీతిపరులు తప్ప, దేశంలోని అన్ని వర్గాల ప్రజల జీవితాలు ఛిద్రమవుతుంటే, తోకకు నిప్పంటించుకుని, దేశం అంతటినీ తగలబెడుతున్నాడీ ప్రభుద్దుడు, అతని రాకాసి గణాలూనూ. ఈ చేతగాని, దుష్ట ప్రభుత్వ వైఫల్యాలు కొన్నింటిని ఇక్కడ విశ్లేషిద్దాం.

అధికారంలోకి వచ్చిన కొత్తలో, "జన్ ధన్" ప్రణాళిక లో భాగంగా కోట్లాదిమంది ప్రజలకు బ్యాంకు అక్కౌంట్లు తెరిపించి, ప్రభుత్వ సహాయం, సబ్సిడీలు నేరుగా ప్రజలకు చేరుతాయని ఆర్భాటంగా పథకాన్నయితే ప్రకటించారుగాని ఆచరణలో అమలు శూన్యమే. దీనితో, ఏదో వస్తుందని ఎదురుచూసిన సామాన్యుడికి నిరాశే ఎదురైంది. మొత్తానికి 'జన ధన్' పథకం ధన్‌దనా మని పేలిపోయింది. లక్షల కోట్ల రూపాయల వ్యవసాయ సబ్సిడీలు రైతులకు అందకపోగా, అవి దేశీయ, విదేశీయ బహుళజాతి విత్తనాల, పురుగుమందుల, ఎరువుల కంపెనీలకు మాత్రం నేరుగా వచ్చి వాటి ఒళ్లోపడుతున్నాయి. ఇక రాసురాను ప్రజాసంక్షేమ పథకాలు కుదించ టంతో, ప్రజల చేతికి చేరవలసిన సొమ్ములు ఎక్కడా కానరావటంలేదు. ప్రజారోగ్యం అటకెక్కటంతో, ప్రైవేటు వైద్య సంస్థల ఇష్టారాజ్యంగా మారింది.

స్వచ్ఛభారత్ పేరుచెప్పి, ఏటా వేల కోట్ల రూపాయలు అదనపు పన్నుగా వసూలుచేసే ఈ ప్రభుత్వం సాధించినది ఏమైనా ఉంటే, 80 లక్షల టాయిలెట్ల నిర్మాణమే. అయితే అందులో 60 శాతం అంటే, 48 లక్షల టాయిలెట్లు నీటి సరఫరాలేక నిరుపయోగంగా పడిఉన్నాయి. అదే యూపీఏ హయాంలో ఏటా ఒక కోటి టాయిలెట్లు నిర్మించారు. "నవామి గంగే" పేరున పెద్ద ఆర్భాటంచేసి, సాధించినది "సున్నకి సున్న, హళ్ళికి హళ్ళి" అన్న చందంగా, ఎప్పటిలానే మురుగుతో గంగానది కళకళలాడుతోంది. మన పట్టణాలు, గ్రామాలూ ఎప్పటిలానే చెత్తాచెదారంతో, పొంగిపొరలుతున్న మురికి కాలువలతో కనువిందు చేస్తున్నాయి. మరొక పక్కన పారిశ్రామిక ఉత్పత్తి, ఎగుమతులు దిగదుడుపు కావటం, ఏవైనా కొత్త పరిశ్రమలు స్థాపించినా అవి ఆటోమేటిక్ యంత్రాలతో నడవటం, మరొక పక్కన పెద్ద స్థాయిలో ఉద్యోగాలు, జీవన భ ృతి కల్పించగలిగిన చిన్న పరిశ్రమలు, అసంఘటిత రంగం ప్రభుత్వ తుగ్లక్ చర్యల కారణంగా కుప్పకూలటంతో, యువతకు ఉద్యోగావకాశాలు అదృశ్యమైపోతున్నాయి. కల్పిస్తానన్న ఉద్యోగాలలో 10 శాతం కూడా ఈ ప్రభుత్వం కల్పించలేకపోయింది. మేక్ ఇన్ ఇండియా తప్పున పేలిపోయి, అద ృశ్యమైపోయింది. కొత్తగా స్థాపించే పరిశ్రమలలో ఉన్నత



ఏమీ సేతురా లింగా, ఏమీ సేతురా!!!

సాంకేతిక శిక్షణ పొందిన కార్మికులు అవసరం అవుతారు. దేశ వ్యాప్తంగా 45 కోట్ల మందికి ఉన్నత సాంకేతిక శిక్షణ ఇవ్వబోతున్నామని పటాటోపంతో ప్రకటించిన "స్కిల్స్ ఇండియా" పథకం సరైన అమలుకు నోచుకోక, ఇప్పటివరకూ కేవలం 2.5 శాతం, అంటే ఒక కోటీ 12 లక్షల మందికే తరిఫీదు ఇచ్చారు. సామాన్యంగా మనదేశంలో ఈమాత్రం మందికి ఎట్లానూ శిక్షణ ఇవ్వబడుతోంది. అంటే, ఈ "స్కిల్స్‌ఇండియా" వట్టి హుళక్కే నన్నమాట. బీజేపీ ఎన్నికల మానిఫెస్టోలో 10 కోట్ల మందికి జీవానాధారాన్ని కల్పించే వస్త్ర పరిశ్రమకు చేయూతనిచ్చి, దానిని త్వరితగతిని అభివ ృద్ధి చేస్తామని వాగ్దానాలు చేశారు. నిజానికి, ప్రభుత్వం తొలి ఏడాది పాలనలోనే వస్త్ర పరిశ్రమ భారీ నష్టాలను ఎదుర్కొన్నది. ఇక కరెన్సీరద్దుతో, మొత్తంగా వస్త్ర పరిశ్రమ కుప్పకూలింది. కోట్లాది కార్మికుల జీవితాలు ఛిద్రమయ్యాయి. ఇదొక్కటీ చాలదన్నట్లుగా సరళీక ృత పన్నుల విధానం, క్యాష్ లెస్ ఇండియా వంటి అనాలోచిత పిచ్చి చర్యలకారణంగా భారతీయ వస్త్ర పరిశ్రమ కుప్పకూలే పరిస్థితి దాపురించింది. చేనేత కార్మికుల పరిస్థితి మరింతదిగజారి, వారికి బ్రతికే మార్గాలన్నీ మూసుకుపోతున్నాయి. ఇక లోకమంతా కోడై కూస్తున్న కరెన్సీ రద్దు ప్రహసనం గురించి వేరే చెప్పనవసరం లేనేలేదు. 500, 1000 రూపాయల నోట్లను రద్దుచేసి, ఈ చర్యతో దేశంలోని నల్లధనమంతా బయటికి లాగుతానని, దొంగనోట్లకు కాలం చెల్లిందని ప్రగల్భాలు పలికాడు ఈ ఉత్తరకుమారుడు. రద్దయిన నోట్లలో 99 శాతం బ్యాంకులకు తిరిగివచ్చిందని రిజర్వు బ్యాంకే ప్రకటించటంతో నల్ల ధనం ఎందుకు బయటికి రాలేదనే విషయాన్ని దాటవేయటానికి కుంటిసాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నదీ ప్రభుత్వం. కొత్తలో ప్రజలు ఇతగాడు ఏదో అద్భుతాన్ని సాధిస్తాడనుకొని నమ్మిన మాట నిజమే. ఆ నమ్మకాన్నే వాడుకొని ఉత్తర ప్రదేశ్ ఎన్నికలలో విజయాన్ని పొందింది బీజేపీ, కాని ఏడాది పైగా గడిచిన తరువాత, దేశ ఆరికాభివృద్ధి అథమ దశకు చేరుకొంటూంటే, తమ జీవితాలు ఛిద్రమవుతుంటే, నల్లకుబేరులు ఎప్పటిలానే అపార లాభాలను పిండుకుని, విదేశాలకు చేరవేస్తోంటే, అన్ని రంగాలలోని ప్రజలు తీవ్ర అసంత ృప్తికి లోనవుతున్నారు. మోడీ కరెన్సీ రద్దుతో కొట్టిన దెబ్బనుండి భారత ఆర్థిక వ్యవస్థ కోలుకోవటానికి కనీసం మరొక పదేళ్లపాటైనా పాట్లు పడక తప్పదని, వచ్చే రెండుమూడేళ్లలో మన జీడీపీ వృద్ధిరేటు మరింత దిగజారవచ్చునని దేశంలోని, అంతర్జాతీయంగానూ అనేకమంది ఆర్థికవేత్తలు, ఆర్థిక విశ్లేషణా సంస్థలు హెచ్చరిస్తున్నాయి. అంటే, దేశానికి ముందుముందు గడ్డురోజులు తప్పవని తెలుస్తున్నది.

"నేను తినను, ఇతరులను తిననివ్వను" అని ప్రగల్భాలు పలికిన ఈ ప్రబుద్ధుని వెనుక అంతా నల్లటి మసే! గుజరాత్ ముఖ్యమంత్రిగా వెలగబెట్టినంత కాలం, తనకు, తన పార్టీకి అనువైన వ్యాపార వేత్తలకు రాష్ట్రాన్ని అడ్డంగా దోచి వారి దోసిట్లో పోశాడు. ముఖ్యంగా అతగాడికి సన్నిహితుడైన అదానీ వ్యాపారం ఇంతింతై, వటుడింతై అన్నట్లుగా పెరిగిపోవటానికి మోడీ అండదండలే ముఖ్యకారణం. ఎన్నికలలో నెగ్గి ఢిల్లీకి ప్రయాణం కడితే, ఇతగాడు వాడుకున్నది అదానీ ప్రైవేటు విమానం. మరి ఏపాచినోటితో పతివ్రత కబురు పలుకుతున్నాడితగాడు? ఢిల్లీలో గద్దెనెక్కిన తరువాత, మోడీ అండతో అదానీ ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి నిరర్థక అప్పులుగా కొల్లగొట్టుకున్నది అక్షరాలా 72 వేల కోట్ల రూపాయలు. ఒక్క 2017లోనే అదానీ ఆస్తుల విలువ 127 శాతం పెరిగినట్లుగా వెల్లడయింది. ఇక అంబానీల సంగతి సరేసరి. వారు నిరర్థక అప్పులుగా దోచుకున్న సొమ్ములు లక్షన్నర కోట్ల రూపాయలకు పైబడి ఉన్నాయి. అన్నిటికంటే విచిత్రమేమిటంటే, బీజేపీ అధ్యక్షుడు అమీత్ షా పుత్రుడు జే షా వ్యాపార సంస్థ ఒక్క ఏడాదిలోనే 16,500 రెట్లు పెరిగింది. ఇది ప్రపంచ వ్యాపార చరిత్రలోనే ఒక అరుదైన వింత. ఇక ప్రపంచంలోని పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు ఈ విషయమై పరిశోధనలు చేయవచ్చును. మోడీ నీతులు వల్లిస్తే విని నమ్మేవారు కరవవుతున్నారు.

చివరిగా "ఈ ప్రభుత్వ పథకాలన్ని ఎందుకు ఘోరంగా వైఫల్యం అవుతున్నాయి" అని పరిశీలన చేస్తే, తేలేది ఏమిటంటే, ఈ దేశ ఆర్థిక వ్యవస్థ పట్ల, అంతర్జాతీయ వ్యాపా రం గురించి సరైన అవగాహన లేకపోవటం, పథకాలు అట్టహాసంగా ప్రకటిస్తే చాలును, వాటంతటవి అమలు అయిపోతాయనే అహంకారం, తప్ప క్రియాశీలత శూన్యం గావటం, అబద్దాలమీద అబద్దాలు చెప్పుకుంటూ, రోజు గడుపుకోవటం, దేశ సమస్యలకు ఏవిధంగానూ సంబంధంలేని అసందర్భ విషయాలను ప్రధాన్యతనిచ్చి, విధ్వంసక రాజకీయ లబ్ది పొందటం కోసం ప్రజల ద ృష్టి మళ్లించటం, చేతగానితనంతోనూ, కుత్సిత బుద్ధితోనూ, అంతర్జాతీయ బహుళ జాతి సంస్థలకు ఊడిగంచేసి, వారి ప్రాపకంకోసం ప్రాకులాడటం ఈ దుష్ట ప్రభుత్వ వ్యాధి లక్షణాలు అని తేటతెల్లమవుతున్నది. ఈ వ్యాధికి మందు ఒక్కటే - వచ్చే ఎన్నికల్లో బీజేపీ ని మట్టికరిపించటం.

(సమాప్తం)

-వ్యాస రచయిత : అఖిల భారత అభ్యుదయ వేదిక జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు.
సెల్ : 09848933545

ప్రసంగాలు గొప్పగా ఉంటాయి.. అయితే

టి.వి. సుబ్బయ్య

మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం చేసిన నాటినుంచి ఆయన ప్రసంగాలు, ఇచ్చే నినాదాలు చాలా గొప్పగా ఉంటాయని మీడియా ప్రచారం చేయడమేకాదు, వాస్తవంగా వుంది. తాజాగా స్విట్జర్లాండ్ పర్వతశ్రేణి ప్రాంతం దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థికవేదిక సదస్సులో మాట్లాడుతూ, ఉగ్రవాదం, వాతావరణ మార్పులు, వాణిజ్య స్వీయరక్షణవాదం ముఖ్యమైన అంశాలని, వీటిని ఎదుర్కోవాలని మోడీ పిలుపునివ్వడం ద్వారా మీడి యాను, ప్రతినిధులను ఆకట్టుకొన్నారు. ప్రతి ఏడాది ఈ 'తిరునాళ్ల' జరుగుతుంది. దీనివల్ల ప్రయోజనం సంపన్నవర్గాలకేనని ఆర్థికవేత్తలే విశ్లేషించారు. 25 ఏళ్ల క్రితం ప్రపంచీకరణ ప్రారంభమైనప్పుడే దీని పర్యవసానాలు దారుణంగా వుంటాయని అమర్త్య సేన్, స్టిగ్లిట్జ్‌లాంటి ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. అది నిజమేనని ఈ సదస్సుకు ఒక రోజు ముందు అంతర్జాతీయ హక్కుల సంస్థ 'ఆనోచమ్' 2017 'అభివృద్ధి' నివేదికను విడుదల చేసింది. ప్రపంచ సంపదలో 82 శాతం కేవలం ఒక శాతం సంపన్నులవద్ద వుందని, భారతదేశంలో 73 శాతం సంపద కూడా ఒక శాతం ధనాఢ్యులవద్ద ఉందని తేల్చింది. 2016లో 58 శాతం సంపద ఒక శాతం ధనికుల వద్ద వుందని అనోచమ్ పేర్కొంది. అంటే మోడీ పాలనలో సంపన్నులూ పెరిగారు, వారి సంపదలూ పెరిగాయి. సామాన్యుల పరిస్థితి దిగజారింది. ఈ ధోరణి పెట్టుబడిదారీ వ్యవస్థలలోగల ప్రత్యేక లక్షణం. ఈ అంశాలను సదస్సులో పాల్గొన్న ఏ నేతలూ ప్రస్తావించరు. తేలుకుట్టిన దొంగల్లా మౌనం పాటిస్తారు. ప్రపంచీకరణ తర్వాత వర్ధమాన దేశాలలో ప్రకృతి వనరులను కొల్లగొట్టిన దేశాలు, ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గం ధనికుల జాబితాలో చేరిపోయాయి. రక్షణవాదాన్ని అటు చైనా అధ్యక్షుడు జియాంగ్, ఇటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బలంగా తెరపైకి తెచ్చారు. పరోక్షంగా మోడీ వీరిద్దరినీ విమర్శించారని ఇక్కడి ఆయన అనుకూల మీడియా, వందిమాగదులు సంబరపడ్డారు.

మోడీ ప్రసంగాల కేసరి అని దాదాపు నాలుగేళ్లకాలం రుజువు చేసింది. గుజరాత్ 'డొల్ల అభివృద్ధిని' గూర్చి వేలాదికోట్ల నల్లధనాన్ని (35వేల కోట్లని అంచనా) వెచ్చించి మీడియా ద్వారా ప్రచారం సాగించి గెలిచారు. విదేశాల్లోని నల్లధనం తీసుకురాకపోగా దేశంలో నల్లధన సంపన్నులను పెంచారు. పెద్దనోట్ల రద్దువల్ల నల్లధనం తెల్లబడింది. జీఎస్టీ మూలంగా వ్యాపారాలు, పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి పై రెండు చర్యల ద్వారా లక్షలాది మంది ఉద్యోగాలు, పనులు ఊడగొట్టారు. సంపన్నులు కట్టే ప్రత్యక్ష పన్నుల వాటా తగ్గించడమే గాక పన్నుశాతాన్ని సైతం 25 నుంచి 20కి తగ్గించారు. పరోక్షపన్నుల వాటాను పెంచుతున్నారు. అనేక దేశాలలో ప్రత్యక్ష పన్నుల వాటాను పెంచి, పరోక్ష పన్నుల వాటాను తగ్గించి ప్రజలపై భారం తగ్గించారు.

దావోస్ సదస్సులో వాతావరణ మార్పులపైన శ్రద్ధ వహించాలన్నారు. వాతావరణంలోకి బొగ్గు ద్వారా విడుదలయ్యే కర్బనపు వాయువులు తగ్గించాలంటే వినియోగం తగ్గాలి. అంటే బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు తగ్గాలి. కానీ బొగ్గుపై టన్నుకు రూ. 50గా వున్న సెస్సును రూ. 400కు పెంచగా వసూలైన దాదాపు 74వేల కోట్లలో రూ. 28వేల కోట్లు మాత్రమే కేటాయించగా రూ. 7వేల కోట్లు ఖర్చుచేసి రూ. 57వేల కోట్లకు పైగా జీఎస్టీ వల్ల వచ్చిన నష్టాన్ని పూడ్చేందుకు బదిలీ చేశారు. ఇదీ పర్యావరణంపై ఉండే ప్రేమ.

సామాజిక విభజనకు దోహదం చేసే ఎన్నో ఘటనలు గత నాలుగేళ్లలో జరిగినా మౌనంగా ఉంటూ.. అప్పుడప్పుడు ఇది మంచిది కాదంటూ మాట్లాడు తున్నారు. ప్రపంచీకరణ తర్వాతనే ఆర్థిక అస మానతలు అపారంగా పెరిగాయి. వసుధైక కుటుంబం లాంటి మాటలు వినడానికేగానీ ఆచరణలో ఎక్కడా కనిపించవు. చరిత్రను, సైన్సును వక్రీకరిస్తూ శాస్త్రవేత్తలను పరి హసిస్తున్నారు. 'పద్మావతి' సినిమా ప్రదర్శిం చరాదని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కర్ణిసేన తదితర సంస్థలు విధ్వంసం సృష్టిస్తున్నా వారిని ఏమీ అనడంలేదు. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించడంలో అలసత్వం. వారి ఓట్ల కోసమే మౌనం పాటిస్తున్నారు.

జీఎస్టీ వల్ల పేదలు ధనవంతులవు తున్నారని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అదెలాగో వివరిస్తే బాగుండేది. సంతోషసూచిలో పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్ దేశాల కంటే మనం వెనుకబడి 122వ స్థానంలో ఉన్నామని సర్వే తేల్చింది. బ్యాంకులకు బకాయిలు చెల్లించక ఎగవేసిన వారిలో అంబానీలు, అదానీలు ముందున్నారు. వీరి నుంచి వసూలు చేయకుండా బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న కష్టార్జితాన్ని హరించేందుకు ఎఫ్ఆర్‌డీఐ క్లాజును ఆర్థిక చట్టసవరణలో చేరుస్తున్నారు. పదవీ విరమణ తర్వాత దాచుకున్న డబ్బుపైన జీవిస్తున్న పెద్దవాళ్లు లక్షలమంది ఉన్నారు. ఎఫ్ఆర్‌డీఐతో వారి జీవనానికే ఎసరుపెట్టే చర్యలు తీసుకుంటూ ఈ చర్య మంచిదేనని ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆధార్ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తున్నారని జనం గగ్గోలు పెడుతున్నా వినడంలేదు. తన ఆధార్ నెంబరుతో 9 మంది సిమ్‌కార్డులు తీసుకున్నారని ఢిల్లీకి చెందిన వనిత ఫిర్యాదు చేస్తే కోర్టుకు వెళ్లమని నిర్వాహకులు సలహా ఇచ్చారని వార్తలు వచ్చాయి. బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలు దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరనున్నాయని తాజాగా ఆర్బీఐ వర్గాల సమాచారం. మోడీగారు వచ్చిన తర్వాత రూ. 3 లక్షల కోట్లకుపైగా బకాయిలు పెరిగాయి. గత నాలుగేళ్లలో ప్రయోజనం పొందిన వర్గం ఉందా? బీజేపీ మాత్రం ఎన్నికల ఖర్చుకోసం రూ. 80వేల కోట్లు వసూలు చేసిందని అన్నాహజారే అంచనా వేశారు. ఇప్పుడు అవినీతికి చట్టబద్ధత కల్పించేందుకు ఎన్నికల విరాళాల బాండ్లను ఎస్‌బీఐ ద్వారా విడుదల చేస్తున్నట్టు ఏలుతున్న వారు ప్రకటించారు. మోడీ గారి పాలన మాటలకే పరిమితమైందని ఈ ఏ అంశాన్ని తీసుకున్నా స్పష్టమవుతుంది.

భూసేకరణ చట్టానికి తూట్లు పొడిచే

సవరణ చట్టాన్ని తిప్పికొట్టాలి



రావుల వెంకయ్య

భూసేకరణ చట్టం 1894ను అనేక పోరాటాల ఫలితంగా 2013లో పార్లమెంటు ఆమోదించింది. దానిలో రైతాంగానికి ప్రయోజనం చేకూర్చే అనేక అంశాలున్నాయి. రైతు దగ్గర భూమి తీసుకోవాలంటే మార్కెట్ విలువకు నాలుగు రెట్లు నష్టపరిహారం చెల్లించాలని, ప్రైవేటు అవసరాలకైతే 80 శాతం, ప్రభుత్వ అవసరాలకైతే 70 శాతం ఆమోదం పొందాలని, రెండు మూడు పంటలు పండే భూమిని తీసుకోరాదని, గ్రామ సభలు నిర్వహించి ఆమోదం పొందాలని, రైతు మీద ఆధారపడిన కౌలుదారులకు, వ్యవసాయ కార్మికులకు గ్రామీణ చేతివృత్తుల వారికి నష్టపరిహారంతో పాటు పునరావాస, పునఃనిర్మాణ బాధ్యతలు తీసుకోవాలని, సామాజిక కోణం నుండి ఆలోచించాలని చట్టంలో స్పష్టంగా పేర్కొంది.

కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ చట్టానికి అనేక సవరణలతో మూడుసార్లు ఆర్డినెన్సుల మీద ఆర్డినెన్సులు తీసుకువచ్చారు. ఇవన్నీ కూడా రైతాంగానికి తీవ్రంగా వ్యతిరేకత కలిగించే విషయాలే. ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు, ఆందోళనలు జరిగాయి. దేశంలో తొలిసారి 25 రాజకీయ పార్టీలు, 50 రైతు సంఘాలు ఐక్యంగా ఢిల్లీ పార్లమెంటు ముందు నిరసన ర్యాలీని నిర్వహించారు. దాని ఫలితంగా ఆర్డినెన్సుకు ఆమోదం తెలపకుండా రాష్ట్రపతి తిప్పి పంపారు. దానితో నరేంద్రమోడీ భూసేకరణ చట్ట సవరణల ఆర్డినెన్సులను పక్కనపెట్టారు. సవరణల ఆర్డినెన్సులను బలపరచిన రాష్ట్రాలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి స్థానంలో వున్నారు. భూసేకరణ చట్ట సవరణ ఆర్డినెన్సులకు రాష్ట్రపతి ఆమోదం పొందనందు వలన రాష్ట్రాలు తమకు తోచిన విధంగా అమలు చేసుకోవచ్చని దొడ్డిదారి ప్రయత్నాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సలహా ఇచ్చారు.

దీనితో మన రాష్ట్ర ముఖ్యమంత్రి భూసమీకరణ పేరుతో భూములు తీసుకోవటం మొదలుపెట్టారు. రాష్ట్రంలో రాజధాని పేరుతో నౌకారవాణా కేంద్రాలు, విమానాశ్రయాలు, సెజ్‌లు, ఎక్స్‌ప్రెస్ రోడ్ల పేరుతో లక్షలాది ఎకరాలు రైతుల దగ్గర నుండి బలవంతంగా లాక్కోవటం మొదలుపెట్టారు. 13 జిల్లాల్లో 15 లక్షల ఎకరాలు "భూబ్యాంకు' పేరుతో రైతుల భూములు కారుచౌకగా లాక్కోవటానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా భూ నిర్వాసితులు జరుపుతున్న ఆందోళనలను ఉక్కుపాదంతో నిర్బంధాలతో అణచివేయటం మొదలుపెట్టారు. అణచిన కొద్దీ ఉద్యమాలు ఇంకా ఉవ్వెత్తున లేస్తునే ఉన్నాయి. అభివృద్ధి పేరుతో అవసరానికి మించి రైతుల వద్ద నుండి బలవంతంగా భూములు గుంజుకొని కార్పొరేట్ శక్తులకు, ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు, రియల్ ఎస్టేట్ వ్యాపారం రాష్ట్ర ప్రభుత్వం మొదలుపెట్టింది. కేంద్ర ప్రభుత్వం మరియు ప్రభుత్వ రంగం సంస్థలకు ఎకరాకు నాలుగు కోట్ల రూపాయల చొప్పున భూమిని అమ్ముకుంటూ, ప్రైవేట్ సంస్థలకు ఎకరాకు యాభై లక్షల రూపాయల చొప్పున కారుచౌకగా భూములు కట్టబెడుతూ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

2017 నవంబరు 29న చడీ చప్పుడు లేకుండా శాసనసభ, శాసన మండలిలలో 2013 భూసేకరణ చట్టానికి తూట్లు పొడుస్తూ మరో చట్టం చేసుకుంది. అదీ అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండా చూసి ఏకగ్రీవంగా బిల్లు ఆమోదింప చేసుకుంది. దానిని రాష్ట్రపతి ఆమోదానికి పంపించారు. దానికి రాష్ట్రపతి ఆమోదం పొందితే రైతులపాలిటి శాపంగా మారుతుంది. 2013 చట్టంలో రైతుల ఆమోదం మార్కెట్ విలువకు 4 రెట్ల నష్టపరిహారం, రైతు మీద ఆధారపడే కౌలు రైతు, వ్యవసాయ కూలీ, గ్రామీణ చేతివృత్తులవారికి పునరావాస, పునర్నిర్మాణం కలిగించాలనే సామాజిక బాధ్యత తుంగలో తొక్కారు. ప్రైవేటు వ్యక్తులకు భూమి ఇస్తే రైతు ఎంతో కొంత డబ్బు చెల్లిస్తే చాలని జీఓ. 31ఏ ప్రకారం చట్టంలో పొందుపర్చబడింది. సామాజిక అంశాలు విస్మరించారు. గ్రామసభలు పెట్టి రైతు ఆమోదం పొంది నోటిఫికేషన్ చేయాల్సిన అవసరం లేదు. కలెక్టర్లకు విచక్షణాధికారాలు కట్టబెట్టారు. అందరూ ఆమోదించారని కలెక్టరు సంతృప్తి చెందితే చాలని ఎటువంటి విచారణ లేకుండా సెక్షన్ 23 ప్రకారం అవార్డు జారీ చేయడాన్ని బిల్లులో చేర్చారు. రైతు, బాధిత కుటుంబాలు రాత పూర్వకమైన హామీ పొందాలనే విషయం విస్మరించారు. ఇంకొక దుర్మార్గమైన విషయం ఏమిటంటే 2017 నవంబరులో బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందితే 2014 జనవరి నుండి అమల్లోకి వస్తుందని బిల్లులో చేర్చారు. ఇంతకన్నా దారుణం మరొకటి లేదు. 2014 నుండి ఉభయ రాష్ట్రాల్లో 3,032 పిటిషన్లు కోర్టు పెండింగులు ఉన్నాయి. ఇటీవల కోర్టు ఉభయ రాష్ట్రాల ప్రభుత్వాల్ని నివేదికలు ఇవ్వాల్సిందిగా కోరింది. తెలంగాణ ఇచ్చిన నివేదిక మీద కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆ నివేదిక కూడా ఇవ్వడానికి గడువు కోరింది. దానికి కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇలాంటి పెండింగ్ కేసులు ఇంకా ఎన్నో వెలుగులోకి రావలసి వుంది. కనుక ఇంత దుర్మార్గమైన బిల్లును రాష్ట్రపతి ఆమోదించకుండా అఖిలపక్ష రైతు సంఘాలు ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతికి విజ్ఞప్తి చేయవలసిన అవసరం వుంది. కోర్టుల ద్వారా కూడా వ్యతిరేకంగా పిటిషన్లు వేయాలి. రాష్ట్ర వ్యాపితంగా రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాస రచయిత : ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు

విశాలాంధ్ర

బతుకు
The Life

ఆదివారం
28 జనవరి 2018



కమ్యూనిస్టులకు పాలనాధికారం అప్పగించితే.. ఎంతగా సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందో విశాఖ జిల్లా నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామ పంచాయతీని చూస్తే స్పష్టమవుతోంది. ఆ గ్రామానికి మూడు దశాబ్దాలపాటు ప్రతిసారి ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్యూనిస్టు నేత మాకిరెడ్డి దేవుడు ఆ గ్రామాన్ని ఆదర్శపంచాయతీగా తీర్చిదిద్దారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు తన సొంత భూమిలో దళితులకు ఊరు మధ్యన ఇళ్లు కట్టించారు. పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి అటవీ బంజరు భూములను పేదలకు పంచేలా చేశారు. అమాయకులైన గిరిజనుల్లో ఉండే మూఢనమ్మకాల నిర్మూలనకు కృషిచేశారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా ముందుగా తమ గ్రామంలో అమలుచేసి అందరికీ ఆదర్శంగా నిలిచిన నిబద్ధ కమ్యూనిస్టు ఆయన. తన 120 ఎకరాల ఆస్తిని ప్రజల కోసం, గ్రామం కోసం, పార్టీ కోసం ఖర్చు చేసి నేడు 12 ఎకరాల రైతుగా మిగిలిన ప్రజానేత ఆయన. గ్రామాభ్యుదయమే తన శ్వాసగా, పార్టీ నిర్మాణమే తన గుండెచప్పుడుగా జీవిస్తున్న దేవుడ్ని ఆ గ్రామస్థులు నిజంగా తమ పాలిట దేవుడుగా భావిస్తారు. ఇదంతా నా ఘనత కాదనీ, కమ్యూనిస్టు ఉద్యమం నేర్పిన జీవితానుభవం, జీవనసత్యం అని చెప్పడంలోనే ఆయన గొప్పదనం తేటతెల్లమవుతోంది.

మాకిరెడ్డి దేవుడు... గబ్బాడ దేముడు!



విశాఖ జిల్లా నర్సీపట్నం మండలం గబ్బాడలో మాకిరెడ్డి అక్కయ్య, కొండమ్మలకు జన్మించిన తొలి సంతానం నేను. మేం ఐదుగురు అన్నదమ్ములం. గ్రామంలోనే ప్రాథమిక విద్య పూర్తి చేసుకొన్న నేను పట్టుబట్టి నర్సీపట్నం బోర్డు హైస్కూల్‌లో చేరి ఎస్ఎస్ఎల్‌సీ పాసయ్యాను. అనంతరం పై చదువుల కోసం అనకాపల్లి ఏఎంఏఎల్ కాలేజిలో మొదటి బ్యాచ్‌గా చేరాను. రెండేళ్ళు పూర్తి చేసిన తర్వాత భోజన సదుపాయం సరిగాలేక అనారోగ్యానికి గురి కావడంతో ఇంటికి తీసుకువచ్చారు. అయితే కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవడం అలవాటుగా మారింది. ఖాళీ దొరికితే సైకిల్‌పై మాడుగుల, అనకాపల్లి, నర్సీపట్నం వెళ్లి గ్రంథాలయాల్లోనే గడిపేవాడిని. ఒక రోజు అనకాపల్లి శారదా గ్రంథాలయంలో రాత్రి సమయంలో పుస్తక పఠనం చేస్తున్న నన్ను గ్రంథాలయ సిబ్బంది గమనించక గదికి తాళం వేసి వెళ్లిపోయారు. రాత్రంతా ఆ గ్రంథాలయంలోనే ఉండి అనేక పుస్తకాలతోపాటు వామపక్ష భావజాలం ఉన్న పుస్తకాలను చదివాను. మరుసటి రోజు గది తాళం తీసిన సిబ్బంది నన్ను చూసి ఆశ్చర్యపోయారు. తదనంతరం జనసంఘ్, సోషలిస్టు, స్వతంత్ర పార్టీల్లో చురుకైన కార్యకర్తగా పనిచేశాను. సర్దార్ గౌతు లచ్చన్నకు సన్నిహితుడుగా తొలుత స్వతంత్ర పార్టీలో, అనంతరం ఎన్‌జి రంగా, రాజగోపాలాచారి, రామచంద్రారెడ్డి, ప్రస్తుత మంత్రి అయ్యన్నపాత్రుడు తాత రుత్తల లత్సాపాత్రుడుతో కలిసి పనిచేశాను. చివరకు ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ విధానాలకు ఆకర్షితుడనై 1966లో సీపీఐలో చేరాను. పార్టీలో నాకు మేకా సూరిబాబు, ఆచంట లక్ష్మణరావు, కోమాకుల నారాయణమూర్తి, కోయిలాడ రామానాయుడుతో సాన్నిహిత్యం ఏర్పడింది. తరువాత గిరిప్రసాద్, చంద్ర రాజేశ్వరరావు, ఎన్.విజయ్‌కుమార్, దాసరి నాగభూషణరావు, వీవీ రామారావు, మానం ఆంజనేయులు వంటి సీనియర్ నాయకులతో కలిసి పనిచేశాను.

భూమిశిస్తుకు వ్యతిరేకంగా ఉద్యమించాం

ఆ రోజుల్లో రైతులు పంటలు లేక, సాగునీరు అందక, ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతుంటే తహశీల్దార్లు గ్రామాలపై పడి భూమిశిస్తు వసూళ్లకు బలవంతపు ప్రయత్నాలు చేసేవారు. కమ్యూనిస్టు గ్రామంగా ఉన్న గబ్బాడ నుంచే వసూళ్లను ప్రారంభించే వారు. పార్టీ పిలుపులో భాగంగా మేమంతా భూమిశిస్తు కట్టవద్దంటూ నినాదాలు చేస్తూ అధికారులకు ఎదురు వెళ్లేవాళ్లం. గ్రామాల్లో శిస్తు కట్టని వారి తలుపుచెక్కలు పట్టుకుపోతుంటే అడ్డుకునే వాళ్లం. ఓసారి తహశీల్దార్‌తో గొడవ జరిగింది. మరోసారి తహశీల్దార్‌పై దౌర్జన్యం చేశామంటూ కేసులు కూడా బనాయించారు.

సర్పంచ్‌గా 30 ఏళ్లు

1970 నుంచి 30 ఏళ్లు గబ్బాడ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికలు లేకుండా ప్రజలు నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో 90 శాతం మంది కమ్యూనిస్టు పార్టీ వాళ్లు ఉండగా పది శాతం మంది కాంగ్రెస్ వాళ్లు ఉండేవారు. గ్రామానికి అవసరమైన ఉన్నత పాఠశాలను ప్రభుత్వంపై పోరాడి గబ్బాడలో నెలకొల్పేలా చూశాను. తొలి నుంచి చదువు అంటే నాకెంతో మక్కువ. 5వ తరగతి వరకే మాఊరిలో చదువుకోవడానికి అవకాశం ఉంది. 6వ తరగతి నుండి నర్సీపట్నం వెళ్లాల్సి వచ్చేది. దీంతో అనేకమంది చదువులకు స్వస్తి చెప్పాల్సిన పరిస్థితి ఎదురైంది. నన్ను ఎంతగానో కలచివేసిన ఈ పరిస్థితుల ప్రభావంతోనే గ్రామంలో ఉన్నత చదువులకై పోరాటాలు చేశాను. నీళ్ల లేక కటకటలాడుతున్న ప్రజలను చూసి గ్రామానికి నీళ్ల ట్యాంకు కట్టించాను. పాలకేంద్రం ఏర్పాటుతో పాటు గ్రామంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాను. అలాగే రోడ్డు ప్రమాదాల బాధితులకు పరిహారం అందించడంలో అలుపెరగని పోరాటం చేశాం.

120 నుంచి 12 ఎకరాలకు

మా పెదనాన్న మాకిరెడ్డి ఎర్రం నాయుడు, రాజులమ్మలకు పిల్లలు లేరు. దాంతో వారే నన్ను దత్తత తీసుకున్నారు. దీంతో తండ్రి ఆస్తిలో వాటా, పెంచిన తండ్రి ఇచ్చిన వాటా.. రెండూ కలిపి 120 ఎకరాలు భూమి వచ్చింది. అయితే నేను వ్యవసాయంపై దృష్టిపెట్టకపోవడం, పార్టీ అభివృద్ధికి, ప్రజాసమస్యలపై పోరాటాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో క్రమేపీ ఆస్తి తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం 12 ఎకరాల పొలం మిగిలింది. ఆస్తి పోయినా గబ్బాడ గ్రామం పార్టీ శిక్షణా కేంద్రాలకు నిలయంగా మారడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది.

ఊరు మధ్యలో దళితులకు ఇళ్లు

ఆనాడు గ్రామంలో దళితులంటే అంటరానివాళ్లుగా తీవ్రమైన వివక్ష ఉండేది. కమ్యూనిస్టు పార్టీ పిలుపులో భాగంగా గబ్బాడ నుంచే అంటరానితనాన్ని రూపుమాపేందుకు ఊరు చివర ఉన్న దళితులను ఊరు మధ్యకు తీసుకువచ్చా. ఊరు మధ్యలో నా సొంత భూమిలో వారికి ఇళ్లు కట్టించా. దళితులు నీటి కోసం ఉదయం కుండలు పట్టుకొని నిలబడితే మధ్యాహ్నం వేళకు గానీ అవి నిండేవి కాదు. ఆ పరిస్థితిని మార్చేందుకు వారి కోసం ప్రత్యేక బావిని తవ్వించాను. చివరకు ఊరిలో బావులన్నీ ఎండిపోతే దళితుల కోసం ఏర్పాటు చేసిన ఆ బావి నీళ్లే గ్రామానికి ఆధారమైంది. రామాలయం ప్రవేశంతోపాటు ఒక దళితుడ్ని నా ఇంట్లో పెట్టుకోవడం ద్వారా అనేక సాంఘిక దురాచారాలను పారదోలడంలో పాలుపంచుకున్నాను.

పార్టీకి గబ్బాడ శిక్షణా కేంద్రం

రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో పార్టీ ఎలాంటి శిక్షణా తరగతులు నిర్వహించాలన్నా గబ్బాడను ఎంచుకొనేవారు. జాతీయ, రాష్ట్ర నాయకులు తరచూ గబ్బాడను సందర్శించేవారు. గబ్బాడలో పార్టీ శిక్షణా తరగతులు, రాజకీయ శిక్షణా తరగతులు, ప్రజానాట్యమండలి శిబిరాలు నిర్వహించేవాళ్లం. ఎంతమంది వచ్చినా ఉండడానికి వసతి, భోజన ఏర్పాట్లు సమృద్ధిగా చేసేవాళ్లం. దీంతో గబ్బాడ ఒక శిక్షణా కేంద్రంగా మారింది.

– జి.ఎస్.ఎన్, రామకృష్ణ.
విశాఖపట్నం

పోరాటాల కేంద్రం గబ్బాడ

40వేల ఎకరాలను సాగులోకి తీసుకురావడం కోసం అటవీ శాఖాధికారులతో పెద్దఎత్తున భూపోరాటం చేశాం. ఈ పోరాటానికి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు మార్గనిర్దేశం చేయడంతో పాటు పాల్గొన్నారు. శ్రీకాకుళంలో మందస భూపోరాటం దాసరి నాగభూషణరావుగారి సారథ్యంలో సాగితే, గబ్బాడలో నా సారథ్యంలో భూపోరాటం పెద్దఎత్తున జరిగింది. రాచకొండ విశ్వనాథశాస్త్రి తండ్రి నారాయణమూర్తితో మొఖాస పెత్తందార్లకు వ్యతిరేకంగా గిరిజన రైతులను చైతన్యపరిచి వెయ్యి ఎకరాల అటవీభూములను గిరిజనులకు పంచాం. కోనాం భూపోరాటం, గదపుపాలెం పడాల్‌కు, ముఠాదారులకు వ్యతిరేకంగా 120 ఎకరాల భూమిని ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ పంచింది. రావణాపల్లి రిజర్వాయర్ కాలువ కోసం పోరాడి 10 గ్రామాలకు సాగునీరు అందించాం. సహకార రుణాల రద్దుకు పెద్దఎత్తున ప్రజలను సమీకరించి ఉద్యమించాం. విజయం సాధించాం. ఇదంతా నా ఘనత కాదు, కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితం. దానిలో నేను ప్రముఖ పాత్ర పోషించాను.



చిల్లంగి, బాణామతిపై రాజీలేని పోరు

ఆ రోజుల్లో మూఢాచారాలు ఎక్కువగా ఉండేవి. చెడుపులు, చిల్లంగి, బాణామతి ఉందంటూ గ్రామాల్లో అనేకమందిని వేధించిన సంఘటనలు కోకొల్లలు. అటువంటి ప్రజలను చైతన్యపరిచి వాటికి వ్యతిరేకంగా పోరాడి ప్రజల్లో అపోహలు, మూఢనమ్మకాలు తొలగిపోయేలా పనిచేశాం. ఊరిలో ఒక్క సారా కొట్టు కూడా లేకపోగా, ఊరిలో అసలు మద్యం తాగేవాళ్లనే లేకుండా చేశాం. గబ్బాడ గ్రామం చుట్టుపక్కల గ్రామాలకేగాక జిల్లాకు ఆదర్శంగా ఉండేది. కమ్యూనిస్టు పార్టీ పాలన ఎలా ఉంటుందో ప్రజలు 30 ఏళ్ల పాటు చవిచూశారు. తరువాత గబ్బాడ మహిళలకు కేటాయించడంతో నా పెద్దకుమార్తె గంగా భవాని ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేసింది.





ఇంటిని శుభ్రంగా ఉంచే తేలికైన అలవాట్లు

ఇంటిపనులను రోజూ అన్నీ చేయటం అంత సులభమేమీ కాదు, కానీ అవే మీ సమయం మొత్తం తినేయాలనే రూలు కూడా లేదు. మీ ఇల్లు పరిశుభ్రంగా ఉండటమే కాదు, మీ సమయం కూడా కేవలం ఈ పనులతోనే నిండిపోకూడదు. ఇంటి కోసం మంచి అలవాట్లను సృష్టించి వాటినే కుటుంబసభ్యులు కూడా పాటించేట్లా చూడండి. మీరు రోజూ ఇల్లును శుభ్రపర్చలేకపోవచ్చు. కానీ ఇల్లు నీటుగా, శుభ్రంగా ముఖ్యంగా ఆరోగ్యవంతంగా ఉండాలి. మీ ఇల్లు శుభ్రంగా ఉంచుకోడానికి ఈ కింది అలవాట్లను పాటించండి....

ఎప్పుడూ మీ పక్కబట్టలు మడతపెట్టుకోవడంతో మొదలుపెట్టండి

మీ పక్కదుప్పట్లు మడతపెట్టుకోవడం సమయం వృథాచేసే పనేం కాదు. నేలను వ్యాక్యూమ్ క్లీనర్‌తో ఎలా శుభ్రం చేస్తారో ఇది కూడా అంత ముఖ్యమే. పడకగదులు విశ్రాంతి కోసం ఉండేవి. రోజంతా పనిచేశాక వచ్చి మీ పడకగది చిరాగ్గా ఉండటం చూస్తే మీకు అస్సలు బాగా అన్పించదు.

దుస్తులు ఉతుక్కోవడం

మొత్తం ఉతకాల్సిన బట్టలను గ్రూపులుగా విడగొట్టి ఒక్కోదాన్ని ఉతకండి. ఒకేసారి మొత్తం దుస్తులు ఉతకాలంటే మీకు కూడా అలసట వచ్చేస్తుంది, పైగా ఎక్కువ సమయం కూడా పడుతుంది. ఒక్కో రకాన్ని బట్టి ఉతికితే సులభంగా, పని వత్తిడి లేకుండా ఉంటుంది.

ప్రాధాన్యతలు నిర్ణయించుకోండి

మీరు ఏవేవి ఎలా శుభ్రం చేయాలనుకుంటున్నారో జాబితా తయారుచేసుకుని మొదట ఏవి చేయాలనుకున్నారో వాటితో మొదలుపెట్టండి. ఇది మీరు శ్రద్ధగా పని చేయటానికే కాదు, పనులను కూడా సులువు చేసేస్తుంది.

కుటుంబసభ్యులు కూడా పాల్గొనేలా చేయండి

ఈ ఇల్లు మీ ఒక్కరిదే కాదు మీ ఇంట్లో వాళ్లందరిది కూడా అని గుర్తుంచుకోండి. అందుకే వారికి కూడా ఈ శుభ్రత అలవాట్లు నేర్పడం ముఖ్యం. మీరు ఒక్కరే అన్ని పనులు చేసి ఒత్తిడికి గురవడం కన్నా, మీ కుటుంబంతో పంచుకుని చేస్తే చాలా బావుంటుంది.

రాత్రిపూట శుభ్రం చేయటం

మీరు ప్రతి రాత్రి పడుకునే ముందు మంచిగా అన్నీ శుభ్రం చేసే అలవాటు పెట్టుకోండి. పిల్లలకు వాళ్ల వస్తువులను సర్దేసి, వారి గదులను శుభ్రం చేసుకుని పడుకునేలా తర్ఫీదు ఇవ్వండి. వంటగదిని కూడా శుభ్రం చేసి పడుకోటం నేర్చుకోండి.

శుభ్రం చేసే వస్తువులు అందుబాటులో ఉంచుకోటం

శుభ్రతకి కావాల్సిన వస్తువులన్నీ దగ్గరలోనే ఉంచుకోటం గుర్తుంచుకోండి. తీరా మీరు క్లీనింగ్ మొదలుపెట్టాక శుభ్రం చేసే వస్తువులు ఎక్కడో పెట్టామని మర్చిపోతే, మీకే చిరాకు వస్తుంది. ఇంకా కావాల్సిన వస్తువులను బజారు నుంచి ముందే తెచ్చిపెట్టుకోండి.

అనవసర వస్తువులు తీసిపారేయటం

అనవసర వస్తువులు వెతికి పారేయడం చాలా సమయం తీసుకుంటుంది. కానీ ముఖ్యం. అప్పుడప్పుడు ఇంటిలో అనవసర వస్తువులు తీసి అన్నిటినీ సర్దటం మంచిది. ఈ అలవాటు అందరూ తప్పక పాటించాలి. వాడే వస్తువులు అన్నీ అందుబాటులో ఉండేలా సర్దుకోవాలి. టేబుల్స్ లేదా బల్లలపై తక్కువ వస్తువులుంటే వాటిని శుభ్రపర్చటం సులువవుతుంది.

వస్తువులు ఎక్కువగా ఉండే ప్రదేశాలు

మీ ఇంట్లో వస్తువులన్నీ కుప్పగా ఉండే ప్రదేశాలను ప్రతిరోజూ కనిపెట్టి రెగ్యులర్‌గా శుభ్రపర్చండి. దానివల్ల మురికిని, దుమ్మును ఇంటి మొత్తానికి పాకకుండా చేయవచ్చు. ఇంటి వాకిలి దగ్గర ఉంచే షూ ర్యాక్ కూడా శుభ్రపర్చటం చాలా ముఖ్యం.

వరుసగా శుభ్రం చేస్తూ పోవటం

మీకేదన్నా సరిగా సర్దిలేదు, దాని స్థానంలో లేదు అన్పిస్తే, మళ్ళీ చేద్దాంలే అని వదిలేయకండి. అప్పటికప్పుడు చేయటం వల్ల సమయం ఆదా అవటమే కాదు, తర్వాత మీ పని భారం కూడా తగ్గుతుంది.

మీ ఇంటిని శుభ్రంగా, నీటుగా ఉంచుకోడానికి, పరిశుభ్రత అలవాట్లు చాలా ముఖ్యం







జరిగిన కథ

ఈ సమన్వయం దేశానికే గాదు, వ్యక్తి జీవితంలో కూడా ఒక పెద్ద సమస్యే! భాష - వేషం - ఆశయాలు - ఆలోచనలు - చివరికి భోజనంకూడా మారిపోతుంది. జాతీయత అంటూ ఒకటి రాజకీయంగా రావడంచేత - ఇంగ్లీషువాడికి పోటీగా మనవాళ్ళు హిందూధర్మం, హిందూ సాంప్రదాయం అంటూ వీట్లని ముందుకు నెట్టుకు వస్తు న్నారు కాని, మనకి ఎప్పుడు స్వతంత్ర్యం వచ్చి ఇంగ్లీషు వాడిని మనం పంపించేసినవాడు దైనందిన జీవితంలోనేం - వేష భాషల్లోనేం - చివరికి నైతిక జీవనంలో కూడా పూర్తిగా పాశ్చాత్య నాగరికత అవలంబించేస్తాం.

ఉత్త రాజకీయంగా జాతీయత వుంటుంది కాని - సాంఘికంగా - ఇంగ్లీషు అమెరికా దొరల్లాగైపోతాం. ఇంగ్లీషు వాళ్ళంటే నాకంత అభిమానం.

(నిన్నటి సంచిక తరువాయి)

అంచేత అదీ మన బాగుకేనూ. మనం ముందుకు రావాలంటే - ఇంగ్లీషువాడిని అనుసరించి తీరాలి. ఇంగ్లీషు వాడిని ఆశ్రయించి తీరాలి. వాడికీ మనకీ పుస్తెముడే. ఈవేళ యిది బ్రహ్మముడి. రేపు ఏ విప్లవమో వచ్చి అది జారుముడి కావచ్చు. కాని బ్రాహ్మడి వివాహం అయినా, గంధర్వ వివాహం అయినా ఆముడి ముడిలాగే వుంటుంది. దాన్నెవ్వడూ విప్పడు. మనమే విప్పనీయంకూడా. అది మన మెడకే ముడి అని మన కుర్రాళ్ళు కొంతమంది అరచినా ఇంగ్లీషువాడికీ, మనకీ ఆ కొంగుముడి ఆచంద్రార్కం స్థిరం. శాంతం ఎదురుగా మాత్రం ఇలా వాదించడానికి నాకు ధైర్యం చాలలేదు.

క్లబ్బునుంచి ఇంటికి వస్తూన్నంతసేపూ - బ్లాకు స్టోన్, చిమ్మన్ లాల్ వాళ్ళ మాటలే చెవులో వినిపిస్తున్నాయి! లండనులోనూ, బొంబాయిలోనూ లాయర్లుండగా - నాకే వకాల్తీ ఇవ్వడం చూస్తే-బాగా పైకి వచ్చేస్తున్నా నన్నమాట. సాయిబాబా కుసుమహరనాథు కృపవుండి నాకా రెండు వరాలు లభిస్తే - మరి నాకు కోర్కెలు లేవు.

...ఒక ఆలోచన తట్టుతూంది. శాంతం అందుకు తగిన దోహదం యిచ్చిందంటే, ఇక చెప్పేదేముంది? రేపు బెంగుళూరు వెళ్ళేముందు చెపుతాను - ఉపోద్ఘాతం - చిలవలు పలవలు - లేకుండా - టక్కని చెపుతాను. శాంతానికి ఆశ్చర్యం - సంతోషం కలిగేటట్టు!

73 ఆమె

మనసులో చాలా కుమిలిపోతున్నాను. పది సంవత్సరాలు కష్టంలోను సుఖంలోను - మంచి లోను చెడ్డలోను కలిసివున్న శాస్త్రినా అనిపించింది! స్వార్థం కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. - మరి కొంతవరకూ సహించొచ్చు. అంతకు మీరితే - ఎవరితరం? బెంగుళూరు వెళ్లడానికి కారు ఎక్కుతూ నవ్వుతూ అన్నాడు:

"శాంతం! రాబోయే ఎన్నికల్లో నాక్కూడా అందరితోబాటూ కాంగ్రెసు తరపున నిలబడాలని ఆశ పుట్టింది. నువ్వు కనక నాయకులతో నా గురించి గట్టిగా సిఫార్సులు చేస్తివా - వాళ్ళు నీ మాట తోసివెయ్యలేక నన్ను నిలబెడతారు - నువ్వు తల్చుకుంటే అవుతుంది! నేను బెంగుళూరునుంచి అవతలెల్లుండి వచ్చేటప్పటికి-నువ్వు నీ శిబిరం స్నేహితులతో మాట్లాడి - అంతా సిద్ధం చెయ్యాలి" అంటూ ముద్దు పెట్టుకొని వెళ్ళిపోయాడు...

ఎప్పుడూలేని భక్తి యీవేళ యెలా కుదిరింది కాంగ్రెసుమీద? ఈ నాటకం ఏమిటి? మీదుమిక్కిలి నన్ను సిఫార్సు చేయమనడం ఏమిటి? సత్యాగ్రహం రోజుల్లో తను కాంగ్రెసుని ఆడిపొయ్యని రోజులేదు - గవర్నమెంటుని పొగడని రోజులేదు. ఇప్పుడు తనని సిఫార్సు చెయ్యడానికి - నా నాలుక ఎలా తిరుగుతుంది? నా ఆత్మగౌరవం ఏంగాను? నేను మొదలు దగ్గిరనుంచీ చెబుతూనే వున్నాను -దేశానికి దూరం అయిపోతున్నావు-మన ప్రజలకి దూరం



అయిపోతున్నావు-నీ వృత్తిలోవుండే బీదలకి - హరిజనులకి - కూలివాళ్ళకి-రైతులకి-సాయంచెయ్యి- అని. గవర్నరుల వెంట - రాజాలవెంట - కోటీశ్వరులవెంట తిరిగేడు.

నిన్నకాక మొన్న - ఆ మైదవోలు నీటి తీరువా అప్పీల్లో - జమీందారు తరపున కేసుపట్టి - ఎప్పటిదో - 1773 సం॥ నాటి ఈస్టిండియా కంపెనీ ఇచ్చిన సగదు ఆధారం చేసుకుని - మూడువేల హరిజన రైతులని, వాళ్ళ కుటుంబాలని జమీందారుకు బలి యిచ్చేశాడు - ఎనిమిది వేలు ఫీజు గుంజుకున్నాడు. అటువంటిది - ఏమని తను



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

ప్రజలపక్షం నిలబడతానంటాడు? ఉత్త దగా-ఆత్మవంచన - కాకపోతే ఏమిటి? మధ్యని నామీద పెట్టాడేమిటి?

.....నేనేదో రెండేళ్ళకిందట లాఠీ ఛార్జీలో దెబ్బలుతింటే - అందుకిప్పుడు వాళ్ళతో బేరమా - మా వారిని ఎన్నికకు నిలబెట్టించండని? నేను తిన్న దెబ్బలు - నేను పడిన బాధ - లంచమా ఏమిటి కాంగ్రెసుకి? దేశభక్తులని మనం పూజిస్తూన్న వాళ్ళందరూ మాత్రం మడి కట్టుకున్నారా-అంటే అది వాళ్ళకీ నాయకులకీ సంబంధించినది. అలాగని - ఎప్పుడూ దేశం కోసం త్యాగం అన్నదే తలపెట్టని మనిషిని - నా పెనిమిటి కదా అని చెప్పి - నేనేమొహంతో వాళ్ళ దగ్గిరకెళ్ళను?

ఇలాంటి వాళ్ళు పదిమంది కనక కాంగ్రెసులోకి పెరటిదారిన ప్రవేశిస్తే - ఇక సత్యాగ్రహం యొక్క పవిత్రతే పోతుందే! ప్రజా ఉద్యమం అయాక - మంచివాళ్ళూ - చెడ్డవాళ్ళూ - అందరూ వస్తారు. కాశీకి వెళ్ళిన వారందరూ పండితులేనా? చూస్తూ తెలిసి అలాంటి వాళ్ళని గౌరవస్థానాల్లో ఎలా కూచోపెట్టగలం? ఎడ్వకేట్ జనరల్ గిరీకి - ఇదొకమెట్టుఅనా? ఏకంగా "లా" మంత్రే అయిపోదాం అనా? తెలివితేటలు గలవాడు - అవినీతిపరుడు కాదు - పెళ్ళాం పిల్లలు అంటే ప్రేమ - దుర్మార్గుడు కాదు. అయితే - ఇంత స్వార్థం వుందే - ప్రజాద్రోహం దేశాన్ని అమ్మేయడం క్రిందకే వస్తుందేమో?...

నాకేం తోచడంలేదు. శాస్త్రి మాటలు - అతని ఆశ తల్చుకుంటే - కడుపులో చెయ్యిపెట్టి కెలికేసినట్టు అవుతుంది. అతని మొహం చూడడానికే నాకు బుద్ధి పుట్టడంలేదు. పరాయి వాళ్ళయితే సహించొచ్చును - నా వాడవడం చేత మరీ అసహ్యంగా వుంది... సరే - ఇక్కడనుంచి వెళ్ళిపోయి - కొన్ని నెలలపాటు దేశాటనం చేస్తాను - అప్పటికికాని మనసు కుదుట పడదు. కొంత తిరుగుతే - శాంతి కుదురుతుంది...

...శాస్త్రి పేర వుత్తరంరాసి అతని బల్లమీద వుంచుతాను; నా మనస్సు అతను గ్రహించాలి అంతేకాని - ఏ చిలిపి కయ్యానికో - అలిగి తనను వదిలేసి వెళ్ళిపోయాననుకోకూడదు. నా మనస్సులో - ఎంతో బాధపడి - విపరీతమైన ఆందోళనపడి వెళ్ళిపోతున్నానని రాస్తాను. మనస్సు కుదుటపడగానే ఇంటికి వచ్చేస్తాను.

కొన్నాళ్ళపాటు - కొంతదూరంపాటు - అఖండ గౌతమీ, వశిష్ఠ గోదావరీ చీలిపోయి - దేనిదారిని అది ప్రవహించాలి.

74 అతడు

రైలునుంచి కారుదిగి ఇంటికొచ్చాను. అలవాటు చొప్పున రాగానే కచేరీ చావిడిలోకి వెళ్ళాను. బల వుత్తరం వుంది. తీసి చదువుకునేసరికి - ఇంకేముంది - శాంతం వుత్తరం! మొదట నాకేం అర్థంకాలేదు. కళ్ళతో అక్షరాలు చూశాను - పెదవులతో చదివేను - బుర్రలోకి మాత్రం వెళ్ళలేదు. మళ్ళీ చదివేను. మూడు రావులు వ్రాసింది. అక్షరం అక్షరం కూడబలుక్కుని చదివేను. లక్ష్మినీ, సుభనీ తీసుకుని వెళ్ళిపోయానని వ్రాసింది.

"ఏం గాభరా పడొద్దు - నేను అన్ని ఏర్పాట్లు చేసుకున్నాను. నా దగ్గిర డబ్బు పుష్కలంగా వుంది. నా క్షేమం గురించి నువ్వేమీ ఆదుర్దా పడకు. పుట్టింటికి వెళుతున్నానని-నువ్వు నేను ఇదివరకే దీనిగురించి అనుకున్నాం అనీ - నెల్లాళ్ళలో మళ్ళీవస్తావనీ- తాయారుతోనూ, డ్రైవరుతోనూ చెప్పాను - నువ్వూ అలాగే చెప్పు...." అని వ్రాసింది.

వుత్తరం మళ్ళీ చదువుకున్నాను. కోపోద్రేకం మీద రాసినట్టు లేదు. జాగ్రత్తగా ఆలోచించినమీదటే రాసి వుండాలి. మాటలన్నీ తూచి వేసింది. ఎన్నికలకు నిలబడాలని నాకుంది - నువ్వు కాంగ్రెసు వారితో సిఫార్సు చెయ్యి - అని నేననడం తన మనసుకు చాలా బాధ కలిగించిందట. నాది రుజుప్రవర్తన కాదంది.

"నేను సత్యాగ్రహం రోజుల్లో తిన్న దెబ్బలు - కాంగ్రెసు స్నేహితులకు నామీద ఉండే గౌరవం - ఇవి నువ్వు నీ సొంత మూలధనంగా చేసుకొని జూదం ఆడి - లాభం గడించాలని - నువ్వు వొక యెత్తు వేశావు. నలుడు - దమయంతి అయింది నా పని...

"ఈ మధ్య నువ్వు ఒక పట్టాన్ని సనాతన హిందువయి పోయావు. లక్ష దీపానికి తిరుత్తణి వెళ్ళావు. నెల్లూరు సంతాన గోపాలస్వామిగారికి బంగారు కిరీటం చేయించావు. క్లబ్బులో దొరలతో షాంపేను విందులు - ఇంటికొచ్చి వీభూది పూసుకొని తులసిమాల లేసుకుని శాయిబాబా భజన - కాషాయి బట్టలు ధరించి - దండకి బంగారు తావీజు కట్టుకుని-గౌరాంగపూజ! ఎందుకీ పూజలూ పునస్కారాలూ? దేవుడి కీకానుకలెందుకు? కాంగ్రెసుకీ లంచం ఏల?...సర్కసులో హాస్యగాడు పరుగెడుతున్న గుర్రంమీద నిలబడి నిమిషానికోదుస్తు మారుస్తుంటాడు. నీ ప్రవర్తన అలాగే వుంది. ఎందుకీ మొగ్గలూ పల్టీలున్నూ?...

- ఇంకా వుంది.

కనుల పండువగా గణతంత్ర వేడుకలు

69వ గణతంత్ర దినోత్సవాన్ని భారత్ ఈనెల 26న ఘనంగా జరుపుకుంది. ఢిల్లీలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఒకేసారి పది దేశాల నాయకులు పాల్గొనడం విశేషం. రాజ్‌పథ్‌లో జరిగిన ఉత్సవాన్ని వీక్షించేందుకు ప్రముఖులతో పాటు వేలాదిమంది ప్రజలు తరలివచ్చారు. ఆనవాయితీగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గణతంత్ర దినోత్సవ కవాతుకు లెఫ్టినెంట్ జనరల్ అసిత్ మిస్త్రీ నేతృత్వం వహించగా, త్రివిధ దళాల అధిపతిగా రాష్ట్రపతి కోవింద్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన



సైనిక కవాతు, విన్యాసాలు కనువిందు చేశాయి. వేడుక ఆరంభానికి ముందుగా ఇండియా గేట్ వద్ద అమరజవాన్ జ్యోతి వద్ద అమర వీరులైన సైనికులకు ప్రధాని నరేంద్రమోడీ అంజలి ఘటించారు.

జాతీయ వార్తలు వీక్లీ రౌండప్



36000 పాయింట్ల పైకి సెన్సెక్స్

స్టాక్ సూచీలు ఈనెల 23వ తేదీన కొత్త మైలురాళ్లను దాటాయి. వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్‌లోనూ స్టాక్ సూచీలు కొత్త రికార్డులకు చేరాయి. బీఎస్ఈ సెన్సెక్స్ తొలిసారిగా 36000 పాయింట్లు, నిఫ్టీ 11000 పాయింట్ల పైకి ఎగబాకాయి.

85 మందికి పద్మ పురస్కారాలు

రిపబ్లిక్ డే పురస్కరించుకుని వివిధ రంగాలకు చెందిన 85 మందికి కేంద్ర ప్రభుత్వం ఈనెల 24 రాత్రి పద్మ పురస్కారాలను ప్రకటించింది. ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా, హిందుస్థానీ గాయకుడు గులాం ముస్తఫా ఖాన్, కన్యాకుమారిలోని వివేకానంద కేంద్రం అధ్యక్షుడు పరమేశ్వరన్‌లకు పద్మ విభూషణ్‌ను ప్రకటించింది. ఎం.ఎస్.ధోని సహా 9 మందికి పద్మభూషణ్, తెలుగు తేజం కిడాంబి శ్రీకాంత్ (బ్యాడ్మింటన్ ఆటగాడు) సహా వేర్వేరు సామాజిక రంగాలకు చెందిన 74 మంది పద్మశ్రీ పురస్కారాలను అందుకోనున్నారు. గ్రహీతల్లో 14 మంది మహిళలు ఉన్నారు.

పౌష్టికాహారం ఓ సవాల్ : రాష్ట్రపతి



రాష్ట్రపతి ఈనెల 25వ తేదీ రాత్రి జాతినుద్దేశించి రిపబ్లిక్ డే సందేశం ఇచ్చారు. దేశంలో ఇప్పటికీ సరైన పోషక పదార్థాలు లేని ఆహారాన్ని పిల్లలకు అందిస్తున్నామని, ఈ సమస్య పరిష్కారం జాతికి ఒక సవాలని ఆయన అన్నారు. వ్యవస్థలన్నీ క్రమశిక్షణతో వ్యవహరిస్తూ నైతిక రుజువర్తనతో మెలగాలని ఆయన హితవు చెప్పారు.



రికార్డు స్థాయిలో పెట్రో ధరలు

పెట్రోలు, డీజిల్ ధరలు ఈనెల 23వ తేదీన రికార్డు స్థాయికి చేరుకున్నాయి. రోజువారీ ధరలు మారుతున్న క్రమంలో లీటరుకు పెట్రోలుపై 15 పైసలు, డీజిల్‌పై 19 పైసలు పెరిగింది. 2014లో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెట్రోలు ధర గరిష్ట స్థాయికి చేరింది.

జడ్జి లోయా కేసు విచారణ సీజేఐ ధర్మాసనంలోనే..

సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి లోయా మృతిపై దాఖలైన కేసుల్ని విచారించే ముగ్గురు న్యాయమూర్తుల నూతన ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు ఈనెల 20న ప్రకటించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈనెల 24న విచారణ చేపట్టనుంది. తొలుత విచారణ నిర్వహించిన జస్టిస్ అరుణ్ మిశ్రాకు నూతన ధర్మాసనంలో చోటు లభించలేదు.

20 మంది 'ఆప్' ఎమ్మెల్యేలపై రాష్ట్రపతి అనర్హత వేటు

లాభదాయక పదవులను నిర్వహించినందుకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి చెందిన ఒక మంత్రితో సహా 20 మంది ఎమ్మెల్యేలపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అనర్హత వేటు వేశారు. ఎన్నికల సంఘం ఈ మేరకు చేసిన సిఫారసుపై ఆయన ఈనెల 20న సంతకం చేసినట్లు న్యాయశాఖ నుంచి 21న ప్రకటన వెలువడింది. 'ఆప్' శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటిస్తూ కేంద్రం జారీచేసిన ప్రకటనపై స్టే విధించేందుకు ఢిల్లీ హైకోర్టు ఈనెల 24న నిరాకరించింది. అయితే ఆయా స్థానాలకు



ఉప ఎన్నికల తేదీలు ప్రకటించడం వంటి చర్యలేవీ ఈనెల 29 వరకు చేపట్టరాదని ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించింది.

'పద్మావత్' వ్యతిరేక ప్రదర్శనలు హింసాత్మకం

వివాదాస్పద చిత్రం 'పద్మావత్' విడుదలకు రెండురోజుల ముందు దేశంలోని పలు రాష్ట్రాల్లో నిరసనలు ఉధృత రూపం దాల్చాయి. ఈ సినిమా విడుదలను వ్యతిరేకిస్తూ ఈనెల 24న కర్ణిసేన, రాజ్‌పుత్‌ల మద్దతుదారులు రహదారుల దిగ్బంధనం, విధ్వంసానికి పాల్పడ్డారు. తీవ్ర ఆందోళన నేపథ్యంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లోని మల్టీప్లెక్స్‌ల యజమానులు ఈ చిత్రాన్ని థియేటర్లలో ప్రదర్శించబోమని ప్రకటించారు. ఈ చిత్రం ఈనెల 25న గుజరాత్, మధ్యప్రదేశ్ మినహా దేశవ్యాప్తంగా విడుదలైంది. ఆ రోజున కూడా




కర్ణిసేన, రాజ్‌పుత్‌ల ఆందోళన కొనసాగింది.

సహద్దుల్లో పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘన

పాకిస్థాన్ సైన్యం ఈనెల 18 నుంచి వరుసగా నాలుగు రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి సరిహద్దు రేఖ వెంబడి నౌషెరా, రాజౌరి, అఖ్నూర్ సెక్టార్లలో భారీఎత్తున కాల్పులు జరిపింది.

పాక్ సైన్యానికి భారత సైన్యం దీటుగా జవాబిస్తోందని మనదేశ అధికారులు తెలిపారు. పాక్ కాల్పుల కారణంగా భారత సరిహద్దులోని గ్రామాల్లో సుమారు 40 వేల మంది ఇళ్లు వదిలి వెళ్లిపోయారు. ఈనెల 18 నుంచి పాక్ జరిపిన కాల్పుల్లో మరణించిన భారత పౌరులు, సైనికుల సంఖ్య ఈనెల 21కి 11కు చేరుకుంది.



చలికి వణుకుతున్న ఉత్తరాది రాష్ట్రాలు

చలిగాలులతో ఉత్తరాది రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలు ఒణుకుతున్నాయి. జమ్మూ-కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో ఈనెల 20న సున్నా డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జమ్మూ-కాశ్మీర్‌లోని లడఖ్ ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఇక్కడ ప్రజా జీవనం స్తంభించిపోయింది. ఈనెల 22వ తేదీన కూడా పరిస్థితి ఇదేవిధంగా ఉంది. కార్గిల్‌లో అతి తక్కువగా - 20.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు జమ్మూ-కాశ్మీర్‌లో 15 జిల్లాలకు మంచుతుపాను ముప్పు ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు



స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) ఈనెల 23న ప్రారంభమైంది. ప్రారంభ సదస్సును ఉద్దేశించి భారత ప్రధాని నరేంద్ర మోడీ కీలకోపన్యాసం చేశారు. అభివృద్ధి చెందిన దేశాలు తమ స్వార్థాన్ని చూసుకొంటూ అభివృద్ధి చెందుతున్న దేశాలను పట్టించుకోవడం లేదని అమెరికాను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు చేశారు. భారత్‌లో వ్యాపార అనుకూల వాతావరణం ఉందని, తమ దేశంలో పెట్టుబడులు పెట్టాలని ప్రపంచ దేశాలను కోరారు.

అమెరికా 'షట్‌డౌన్'కు తెర

అమెరికాలో మూడురోజులు కొనసాగిన 'షట్‌డౌన్'కు ఈనెల 23వ తేదీతో తెరపడింది. ప్రభుత్వ వ్యయానికి స్వల్పకాలిక నిధులందించే బిల్లుకు ప్రతిపక్ష డెమొక్రాట్లు ఆమోదం తెలపడంతో సంక్షోభం సమసిపోయింది. ఈ బిల్లుపై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేయడంతో ఈనెల 23 నుంచి రోజువారీ కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. అంతకు ముందు బడ్జెట్ ప్రతిష్టంభనతో లక్షలాదిమంది ఫెడరల్ ఉద్యోగులు ఎలాంటి వేతనం లేకుండా ఇంటికే పరిమితమయ్యే పరిస్థితిని నివారించడానికి అమెరికా చట్టసభ సభ్యులు ప్రయత్నాలు చేశారు. ఈనెల 19వ తేదీ రాత్రి మొదలైన ప్రతిష్టంభన 22 వరకు పరిమిత ప్రభావాన్నే చూపింది. జనవరి 20 వరకు తాత్కాలిక బడ్జెట్‌కు ఆమోదం లభించకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది.



అంతర్జాతీయ వార్తలు

డ్రీమర్లకు ట్రంప్ ఊరట

అమెరికాలో డ్రీమర్లకు 10, 12 ఏళ్లలో అమెరికా పౌరసత్వం ఇచ్చేందుకు సిద్ధమని దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈనెల 25న ప్రకటించారు. ట్రంప్ తాజా నిర్ణయంతో వేలాదిమంది భారతీయులకు లబ్ధి చేకూరనుంది. ధ్రువపత్రాలు లేకుండా అమెరికాలో నివశిస్తున్న వీరికోసం 2001లో రిపబ్లికన్లు, డెమోక్రాట్లు 'డ్రీమ్' బిల్లును రూపొందించారు. ఇదిలా ఉండగా, హెచ్1-బీ వీసాలపై వార్షిక పరిమితిని పెంచడానికి ఉద్దేశించిన బిల్లును రిపబ్లికన్ సెనేటర్లు సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఇమ్మిగ్రేషన్ ఇన్నోవేషన్(ఐ-స్క్వేర్డ్) పేరుతో రూపొందించిన బిల్లును ఒరిన్ హ్యాచ్, జెఫ్ ఫ్లేక్ ప్రవేశపెట్టారు. వీసాల జారీలో ఇకపై లాటరీ పద్ధతిని ఉపసంహరించాని కూడా ట్రంప్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనతో దేశీయ ఐటీ ఉద్యోగులతోపాటు కొన్ని దశాబ్దాలుగా గ్రీన్ కార్డు కోసం వేచి చూస్తున్న భారతీయ ఐటీ నిపుణులకు భారీగా లబ్ధి చేకూరనుంది.

కాబూల్‌లో తాలిబన్ల కాల్పులు.. 43 మంది మృతి

ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆరంతస్థుల ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌ను ఈనెల 20వ తేదీ రాత్రి తాలిబన్ తీవ్రవాదులు స్వాధీనం చేసుకుని మారణహోమం సృష్టించారు. ఈ దుర్ఘటనలో 43మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒక మహిళ సహా 14 మంది విదేశీయులు ఉన్నారు. 41 మంది విదేశీయులు సహా దాదాపు 150 మంది గాయపడ్డారు.

అలస్కా, జకార్తాలో తీవ్ర భూకంపం

అలస్కా తీరం వద్ద అత్యంత భారీస్థాయి.. ఇండోనేషియా ద్వీపం జకార్తాలో ఓ మోస్తరు తీవ్రమైన భూకంపాలు ఈనెల 23వ తేదీన సంభవించాయి. అలస్కా కెనడా తీరాలకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. అదేరోజు జపాన్‌లో అగ్నిపర్వతం విస్ఫోటనం సంభవించింది. మంచుక్రీడలకు కేంద్రమైన ఓ స్కీయింగ్ రిసార్ట్ సమీపంలో సంభవించిన ఈ విస్ఫోటనం మంచు తుపానుకు కారణమైంది. మంచుతుపాను ధాటికి పలువురు గాయపడగా.. పెద్దసంఖ్యలో ప్రజలు ఓ పర్వతంపై చిక్కుకుపోయారు.

దక్షిణ కొరియాలో ఘోర అగ్నిప్రమాదం.. 41 మంది మృతి

దక్షిణ కొరియాలోని మిర్యాంగ్ నగరం లోగల సెజాంగ్ ఆసుపత్రిలో ఈనెల 26న ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 41 మంది మరణించారు. 80 మందికి పైగా గాయపడ్డారు. ఐసీయూ గదుల్లో ముందుగా మంటలు చెలరేగి శరవేగంగా భవనం అంతా వ్యాపించాయి. ప్రమాదం జరిగినప్పుడు అందులో 200 మంది వరకు ఉన్నారు.

భోగాపురం విమానాశ్రయం టెండర్లు రద్దు

భోగాపురం విమానాశ్రయం నిర్మాణ టెండర్లను రద్దు చేయాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. మంత్రిమండలి సమావేశం ఈనెల 22న అమరావతిలో జరిగింది. ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యం (పీపీపీ) కింద తిరిగి పిలవాలని నిర్ణయించింది. గతంలో కేవలం విమానాశ్రయ నిర్మాణానికే టెండర్లు పిలవగా, ఈ సారి మాత్రం దీనికి అను బంధంగా నివాసాలు, వాణిజ్యపరమైన సదు పాయాలు, హోటళ్లు వంటివాటిని కేంద్రం నిర్మించేలా టెండర్లు పిలవాలని మంత్రిమండలి నిర్ణయించింది.

సినీనటి కృష్ణకుమారి ఇక లేరు

రాష్ట్ర వార్తలు

నాటితరం ప్రముఖ కథానాయిక, బహుభాషా నటి కృష్ణకుమారి (85) ఈనెల 25న బెంగళూరులోని తన స్వగృహంలో కన్నుమూశారు. కొన్ని నెలలుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. వివిధ భాషల్లో సుమారు 110 చిత్రాల్లో నటించారు. అలనాటి అందాల నటిగా, ఏ పాత్రలోనైనా ఇమిడిపోయే సత్తాగల కళాకారిణిగా గుర్తింపు ఉంది.



ఫైనల్‌లో రోజర్ ఫెదరర్, సిలిచ్

క్రీడా వార్తలు

మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మాజీ నెంబర్‌వన్ జకోవిచ్ ఈనెల 22న జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో కొరియాకు చెందిన జంగ్ చేతిలో పరాజయం పొందాడు. స్విస్ మాస్టర్ రోజర్ ఫెదరర్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు.

ఈనెల 23న పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ ఆడుతున్న ప్రపంచ నంబర్‌వన్ రఫెల్ నాదల్ గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలిగాడు. మూడో సీడ్ దిమిత్రోవ్ కూడా పరాజయంతో వెనుదిరిగాడు. ఈనెల 24న జరిగిన క్వార్టర్స్‌లో రెండో సీడ్ ఫెదరర్ గెలిచి సెమీస్‌లోకి అడుగు పెట్టాడు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ హలెప్, మాజీ నెంబర్ వన్ కెర్బర్, పురుషుల డబుల్స్‌లో బొప్పన్న- బాబోస్ జోడీ కూడా సెమీస్‌కు చేరారు. ఈనెల 25న జరిగిన సెమీస్‌లో క్రోయేషియాకు చెందిన ఆరోసీడ్ మారిన్ సిలిచ్ విజయం సాధించి ఫైనల్‌లోకి ప్రవేశించాడు. 26న జరిగిన మరో సెమీఫైనల్‌లో యువ సంచలనం హుయాన్ చంగ్ గాయం కారణంగా వైదొలగడంతో ఫెదరర్ ఫైనల్‌కు చేరుకున్నాడు.

అంధుల ప్రపంచకప్ విజేత భారత్

షార్జాలో ఈనెల 22న పాకిస్థాన్ జట్టుతో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత అంధుల జట్టు రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 308 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ 10 బంతులు మిగిలుండగానే ఎనిమిది వికెట్లు కోల్పోయి ఛేదించింది. అంధుల క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్‌లో భారత జట్టు విజయం సాధించడం వరుసగా ఇది రెండోసారి.

కాబూల్‌లో ఆత్మాహుతి దాడి : 95 మంది మృతి

- 158 మందికి పైగా గాయాలు
- ప్రభుత్వ కార్యాలయాలే లక్ష్యం



కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్ రాజధాని నగరం కాబూల్‌లో తాలిబన్లు మరోసారి ఘాతుకానికి ఒడిగట్టారు. విదేశీ రాయబార కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సమీపాన నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో అంబులెన్స్‌లో అమర్చిన శక్తిమంతమైన బాంబు పేలింది. ఈ ఘటనలో 40 మందికిపైగా మృతి చెందగా, మరో 140మందికి పైగా తీవ్రంగా గాయపడినట్లు ఆఫ్ఘన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది. "దాడిచేసిన వ్యక్తి ఒక అబులెన్స్‌ను వినియోగించాడు. ఒక భద్రతా చెక్‌పోస్టును దాటే సందర్భంలో అక్కడి పోలీసులకు తాను ఓ రోగిని దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకువెళుతున్నట్లు చెప్పాడు. రెండో చెక్‌పోస్టు వద్ద పేలుడు పదార్థాలతో పేల్చుకున్నాడు." అని ఆఫ్ఘన్ హోంమంత్రిత్వ శాఖ డిప్యూటీ అధికార ప్రతినిధి తెలిపారు. గతంలో హోంమంత్రిత్వశాఖ భవనం ఉన్న ప్రదేశానికి సమీపంలో ఈ ఘటన జరిగింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం వున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. ప్రభుత్వ వర్గాలే లక్ష్యంగా తాలిబన్లు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా ఈ దాడికి తమదే బాధ్యత అంటూ తాలిబన్ ప్రతినిధి ముజాహిద్ నుంచి ప్రకటన వెలువడింది. సరిగ్గా వారం రోజుల క్రితం కాబుల్‌లోని ప్రముఖ హోటల్ ఇంటర్ కాంటినెంటల్‌లో చొరబడిన తాలిబన్ ఉగ్రవాదులు భారీ విధ్వంసం సృష్టించి 22 మందిని పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో అత్యధికులు విదేశీయులే. ఐసిస్ తీవ్రవాదులు కొద్ది నెలలుగా నగరంలో విదేశీయులు ఎక్కువగా రాకపోకలు సాగించే సూపర్‌మార్కెట్లు, షాపులు, హోటళ్లే లక్ష్యంగా దాడులు చేసేందుకు పథకం వేశారని, అప్రమత్తంగా ఉండాలని భద్రతా విభాగం శనివారం ఉదయం హెచ్చరిక చేసింది.

ఆరోగ్యం...ఆహ్లాదం

సైకిల్ సవారీ

- పెరుగుతున్న సైకిల్ ప్రేమికులు
- అన్ని విధాలా మేలంటున్న వైద్యులు
- ఆరోగ్యంకాపాడే వాహనం
- కొత్త మోడళ్లు బెటర్

విశాలాంధ్ర-జనరల్ డెస్క్ : ఒకప్పుడు ప్రతి ఇంట్లోనూ తప్పనిసరిగా ఉండే వస్తువు సైకిల్. మారిన జీవన ప్రమాణాలు, అధునాతన ద్విచక్ర వాహనాల కారణంగా సైకిల్ దాని ప్రాభవాన్ని కోల్పోయింది. సైకిల్ కేవలం చిన్నపిల్లలు తొక్కుకునే ఆట బొమ్మగా లేదా ఇంట్లో అలంకరణ వస్తువుగా మిగిలిపోయింది. అయితే ఎక్కువమంది వాహనాలకు అలవాటుపడి శారీరక శ్రమలోపించి అనారోగ్యం దిశగా వెడుతూ బీపీ,సుగర్, కండరాల నొప్పులు వంటి వ్యాధులను వెంట తెచ్చుకుంటు న్నారు. అయితే జరిగిన పొరపాటును ఈ తరం గుర్తించి, మళ్లీ సైకిల్ సవారి చేస్తున్నది. అదే మేలనీ, మహాభాగ్యమైన ఆరోగ్యానికి అదే శ్రీరామరక్ష అన్న భావనకు వచ్చేసింది.

ఇప్పుడు ధనిక,పేద తారతమ్యం లేకుండా అనేకమంది సైకిళ్లను ఆశ్రయిస్తున్నారు. తెల్లవారు ఘామున 4 గంటలనుండి ప్రారంభమై ఉదయం 7గంటల వరకు సైకిళ్లపై వెడుతున్న వారి సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. ఉదయం పూట వ్యక్తిగత పనులు చక్కబెట్టుకోవడంతోపాటు చల్లటి గాలిని పీలుస్తూ ఆరోగ్యంకోసం సైకిళ్లు తొక్కేవారి సంఖ్య బాగా పెరిగిపోయింది. వయసుతో సంబంధంలేకుండా 30 నుండి 60 సంవత్సరాల వారు కూడా సైకిళ్లు తొక్కుతున్నారంటే అది ఆరోగ్య మహత్యమే... సైకిళ్ల వినియోగం పెరగడం గమనించిన పలు కంపెనీలు కొత్త కొత్త మోడళ్ల సైకిళ్లను మార్కెట్‌లో విడుదల చేస్తున్నాయి. అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతోపాటు సైకిళ్ల బరువు తగ్గించడం, గేర్ల వంటి సదుపాయాలు కల్పించడంలో వినియోగదారులకు సౌకర్యవంతమైన మోడల్లు అందుబాటులోకి వస్తున్నాయి. యువత ఈ తరహా సైకిళ్లపై మక్కువ చూపిస్తుంటే వ్యాయామం కోసం చేసేవారు మాత్రం మూలపడేసిన సైకిళ్ళను



బయటకు తీస్తున్నారు. అయితే కొత్తగా వస్తున్న మోడళ్లను వినియోగించడం వల్ల సౌకర్యవంతంగా ఉంటుందని, వెన్నుపూసపై ఒత్తిడిలేకుండా ఉంటుందని నిపుణులు అంటున్నారు.

ఇలా మొదలైన సైకిళ్ల సంస్కృతి మార్నింగ్ వాకర్స్ మాదిరిగా బృందాలుగా ఏర్పడేవరకు వచ్చింది. ఇటువంటి బృందాలులో 200 నుండి 400 మంది వరకు సభ్యులుగా ఉంటున్నారు. ఇటువంటి బృందాలకు డాక్టర్లే స్ఫూర్తిగా నిలవడం, వారే నేతృత్వం వహించడం గమనార్హం. ఇటువంటి బృందాలు ఏర్పాటు కావడమే కాదు... సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను దాని ఆవశ్యకతపై అవగాహన పెంచేశారు. అందుకు సంబంధించిన కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. ఈ బృందం సభ్యులు రోజూ సైకిళ్లు తొక్కడంతోపాటు సెలవుది నాల్లో 50 నుండి 100 మైళ్ల వరకు సైకిల్ తొక్కే మారథన్‌ను కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

ఎన్ని ప్రయోజనాలో...

సైకిల్ తొక్కడం వల్ల నూరుశాతం ప్రయోజనాలే తప్ప అపకారాలు ఏవీ ఉండవని ఫిజియోథెరపిస్టులు చెబుతున్నారు. సైకిల్ తొక్కడం వల్ల జీవితకాలమంతా మోకాలు సమస్యల నుండి పూర్తిస్థాయిలో బయట పడవచ్చునని ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు సలహా ఇస్తున్నారు. ఇదిలాఉంటే ఫిజియోథెరపిస్టు చెప్పే విషయాలు ఇంకా ఉత్తేజ భరితంగా ఉన్నాయి. ప్రతి మనిషికి తొడ వద్ద నాలుగు క్వాడ్రిసప్స్ కండరాలు ఉంటాయి. సైకిల్ తొక్కడం వల్ల ఇవి బలం పొంది సంబంధిత ఎముకకు రక్షణగా మారతాయి. మోకాలువద్ద ఫ్లెక్సిబిలిటీని పెంచి అరుగుదల నుంచే కాకుండా 50శాతం వరకు అరిగిఉన్నవారికి కూడా ఎంతో ఉపశమనం కనిపిస్తుందని అంటున్నారు. అలా కాకుండా గుండె వద్ద ఉండే కార్డియో రెస్పిరో మజిల్స్ సైకిల్ తొక్కడంవల్ల బలపడతాయని అంటున్నారు. సరాసరిన 180 ఎల్‌బిలు ఉన్న మనిషి ఒక మోస్తరుగా సైకిల్ తొక్కితే గంటకు సుమారు 650 కేలరీలు ఖర్చు అవుతాయి. సైకిల్ తొక్కడంపై సామాన్య జనాల్లో ఉండే అపోహలు ఏ మాత్రం నిజంకావనీ, రోజుకు కనీసం 20 నిమిషాల సైకిల్ తొక్కితే ఆరోగ్యాన్ని అద్భుతంగా కాపాడవచ్చని డాక్టర్లు, ఫిజియోథెరపిస్టులు చెబుతు న్నారు. 20నిమిషాలు అత్యంత వేగంగా సైకిల్ తొక్కేవారితో పోల్చి చూసుకుంటే గంటకు 10 మైళ్లు సైకిల్ తొక్కే వారిలోనే కేలరీలు ఎక్కువగా ఖర్చుఅవుతాయి. 160పౌండ్లు (72కేజీలు) ఉన్న మనిషి గంటకు నిలకడగా ఉన్న సైకిల్‌ను తొక్కడం వల్ల 509కేలరీలు ఖర్చు అవుతుండగా, అదే వేగంగా సైకిల్ తొక్కడం వల్ల గంటకు 826 కేలరీలు ఖర్చు అవుతాయి. ప్రస్తుతం వస్తున్న మోడళ్లు సౌకర్యవం తంగా ఉంటాయని ఇది తేలికగా ఉండడంతోపాటు గేర్ సిస్టమ్, ఉండడం వల్ల వెన్నుపై భారం పడదనీ అయితే మంచి రోడ్లపైనే సైకిల్‌తొక్కడం మంచిదని వారు సలహా ఇస్తున్నారు.

స్ట్రావా మాప్

సైకిల్ తొక్కడంపై ఏమైనా దురభిప్రాయాలు, అనుమానాలున్న వాళ్లు లేదా వివరాలు కావలసిన వాళ్లు 'స్ట్రావా' యాప్‌లోకి వెడితే పూర్తి వివరాలు లభిస్తాయి.ఇంకెందుకు ఆలస్యం...మనం కూడా ఒక మోడ్రన్ సైకిల్ కొనుక్కొని జామ్...జామ్... అంటూ తొక్కేసి ఆరోగ్యాన్ని కాపాడుకుందామా....!

Sunday Special

బట్టీయంతో.... భ్రష్టు

- పర్సంటేజీలకే ప్రాముఖ్యం
- విద్యార్థుల్లో లోపిస్తున్న సృజనాత్మకత
- ఆచరణలో నిరుపయోగం
- మన విద్యావిధానం నైజీరియా, ఉగాండాల కంటే అధ్వానం



విశాలాంధ్ర-జనరల్ డెస్క్ : ఏ దేశమైనా విద్యవల్లే వేగంగా అభివృద్ధి సాధించ గలుగుతుంది. అలాంటి విద్యను విద్యార్థులకు అందించడంలో అధ్యాపకులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. కానీ అధ్యాపకులకే నిర్బంధం ఎదురైతే.... ఎనిమిదేళ్ల పాఠశాల విద్యలో 14-18 ఏళ్ల విద్యార్థుల్లో కేవలం 43శాతం మాత్రమే సాధారణ విభజన చేయగలిగారు. సగంమంది బరువును కిలోగ్రాముల్లోకి మార్చలేకపోగా 40శాతానికి ఎక్కువమంది గడియారం చూసి గంటలు, నిమిషాలను చెప్పలేకపోవడం, 46శాతం మంది విద్యార్థులు అయితే దేశంలోని రాష్ట్రాల రాజధానుల పేర్లు కూడా చెప్పలేకపోవడం చూస్తే మన విద్యా వ్యవస్థ ఎటు పయనిస్తోందోనని ఆందోళన కలుగుతోంది. పట్టణాల్లోని సంపన్నవర్గానికి చెందిన 5శాతం మంది,మధ్యతరగతి వర్గాలతో పోల్చి చూసుకుంటే 29రెట్లు విద్యకోసం ఖర్చుపెడుతున్నారు. 2017, డిసెంబరులో రీసెర్చి ఆన్ ఇంప్రూవింగ్ సిస్టమ్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ చేపట్టిన సర్వేలో మన పరీక్షా విధానం నైజీరియా, ఉగాండాల దేశాలకన్నా దారుణంగా ఉన్నట్లు తేలింది. గ్రేడ్ 2కి చెందిన విద్యార్థులు కనీసం ఒక పదాన్ని సరిగా చదవలేకపోవడం, రెండెంకల తీసివేతను కూడా చేయలేకపోవడం మన విద్యావ్యవస్థను సమూలంగా మార్చవలసిన అవసరంఉంది. కాలానుగుణ మార్పులతో కూడిన విద్యావిధానాలు ఎప్పటకప్పుడు వేగంగా ప్రవేశపెట్టినప్పుడే పల్లెలు, పట్టణ విద్యార్థులు అన్ని రంగాల్లో సమానంగా రాణించగలుగుతారని పలువురు విశ్వవిద్యాలయాల అధ్యాపకులు అభిప్రాయాలను వెల్లడించారు. ఇంజినీరింగ్ ఇతర సాంకేతిక విద్య పాఠ్యప్రణాళికలో ఏఐసీటీఈ థియరీకన్నా ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం కల్పించడం మంచి పరిణామమే.. దేశాభివృద్ధికి తోడ్పడేలా విద్యార్థులకు విద్యాలయాలు విజ్ఞానాన్ని అందచేయాలిగానీ పోటీతత్వాన్ని, ర్యాంకుల ప్రాతిపదికన విద్యార్థుల మేధస్సును కొలవడంతో భవిష్యత్తు మానసిక వికాసం అనేదిలేకుండా జీవితంలో ఆటుపోట్లను తట్టుకోలేకుండా మానసికవ్యాధులకు గురికావలసిన రోజులు వచ్చాయనే చెప్పవచ్చు. బాల్యం నుండే సామాజిక విలువలను, కలివిడితనాన్ని, ఒంటరిగా గదుల్లోనే కూర్చొనే సంస్కారానికి తల్లిదండ్రులే అడ్డుకట్ట వేయాలి. సంస్కారాన్ని అలవరచాలి. ఇప్పటి విద్యావ్యవస్థలో ఇలాంటి స్పృహ ఉండాలి. ఆటలకు చోటులేకుండా, గ్రంథాలయాలు లేని వసతులతో పేరుకు ప్రయోగశాలలైనా దానిలో ఏ ఒక్కరోజు కూడా శిక్షణ పొందిన జ్ఞాపకాలు లేవన్న కొంతమంది విద్యా విద్యావంతుల అభిప్రాయాలను వారి మాటల్లో.....

ట్రిపుల్‌ఐతో బీటెక్ చేసిన సాయికళ్యాణ్ మాట్లా డుతూ, ఇంజినీరింగ్ కూడా అంతా బట్టీ విధానం లోనే ఉంటుంది కరెక్షన్‌కూడా ఆ విధంగానే ఉంటుందన్నారు. టీచింగ్ విషయానికొస్తే కూడా లేబరేటరీలో మాన్యు వల్స్ చూసి ఫాలో అవ్వడం తప్ప ప్రాక్టిక ల్‌గా



నూతన ఇన్నోవేషన్‌కు అవకాశం ఉండదు. మాతృభాషలో చదివేందుకు విద్యార్థులు కష్టంగా ఫీలవుతున్నారు. ఒక్కోపదాన్ని కూడాబలు క్కొని చదవడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ఇన్ని పరిస్థితులు ఎదురవుతున్నా తల్లిదండ్రులు మాత్రం ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో చదివించేం దుకు మొగ్గు చూపుతున్నారన్నారు.

సన్‌ఫ్లవర్ స్కూలులో 10 ఏళ్లు దీర్ఘకాలం టీచరుగా పని చేసిన నిర్మల విద్యా విధానంపై మాట్లాడుతూ... ప్రైవేటుయాజమాన్యంలో టీచర్లకు నిర్బంధం విధించడంతో ఆ పరిధిలోనే సిలబస్‌ను అవజేయాలన్న ఆలోచనతో ఆత్రుతతో సిలబస్‌మీద దృష్టి కేంద్రీకరించడంతో విద్యార్థిపై దృష్టి కేటాయించలేక పోతున్నామనీ తాను విద్యార్థులకు న్యాయం చేయలేకపోవడంతో ఆ ఫీల్డ్‌నే వదులు కోవలసి వచ్చిందన్నారు. మా రోజుల్లో విద్య అనేది ఫ్రీగా నేర్చుకున్నామనీ, ఆరోజుల్లోనే చాలా ఆహ్లాదంగా ఉండేదనీ, ఈ రోజుల్లో



కొనుక్కుంటున్నా కూడా చదువనేది నిర్బం ధంగా తయారైంది. ఇది భవిష్యత్తు తరాలకు పెను ప్రమాదంగా తయారవు తుందని అన్నారు. ఎక్కువ సమయం స్కూలులోనే గడపడంతో వారికి కుటుంబ సభ్యులమధ్య సమన్వయం కొరవడుతోందన్నారు. 'ఒత్తిళ్లతో కూడిన విద్యా విధానంతో పిల్లలు మానసికంగా అలసిపోతున్నారు. ఆటలకు ఎంతసమయం కేటాయించారో, చదువుకు కూడా అంతే సమయం కేటాయిస్తే తప్ప పిల్లలో నైపుణ్యత మెరుగవదు'' అని చెప్పారు.



సెయింట్ జాన్స్‌లో రెండేళ్ల నుండి టీచరుగా పనిచేస్తున్న మాధురి మాటల్లో విద్యను కొనుక్కుం టున్నాంతప్ప విద్యార్థులకు అభ్యసన కొరవడుతోందన్నారు. కేవలం బట్టీకే సమయం సరిపోతోందనీ, ప్రాక్టికల్ వర్కు బహు తక్కువైపోయి పిల్లలో సృజనాత్మకత లోపిస్తోంది. సరైన గైడెన్స్ లేకపోవ డం ప్రధాన సమస్యగా ఉంది. ప్రయోగాత్మకమైన విద్యావిధానం లోపించడంతో చదువు కేవలం కాగితాలకే పరిమితమవుతోందన్నారు.



బ్యాంకు ఉద్యోగిని కె.ఉష మాట్లాడుతూ, ప్రస్తుతం పిల్లలు ఎక్కువగా రికార్డు వర్కుకు ప్రాధాన్యత ఇస్తున్నారు గానీ, ఆఖరికి టేబుల్స్‌ని కూడా షార్ట్‌కట్‌లో బట్టీపట్టించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎక్కువకాలం గుర్తుండే విధానంతో పిల్లలకు పాఠాలు నేర్పా లుగానీ, కాన్సెప్ట్ ఓరియంటేషన్ కొరవడుతోం దన్నారు. పిల్లలు ఏం నేర్చుకుంటున్నారనేదానిపై కాకుండా సిలబస్ కంప్లీట్ చేయాలనేదానిపైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నారని చెప్పారు.

ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్ చేసిన ఒబులేసు మాట్లాడుతూ, నేను కూడా మెకానికల్‌గా చదివానేగానీ కాన్సెప్ట్



ఓరియంటేషన్ లేదని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. మెటీరియ ల్‌ను బట్టీ పట్టమని ప్రొఫెసర్లు చెప్పిన సందర్భం కూడా ఉందనీ, చదువుకుదగ్గ ఉద్యోగాలులేవని వాపోయారు. ఎకనామిక్స్ చేసినా మాకు భవిష్యత్తు అగమ్యంగా ఉందని తాము చదివిన సబ్జెక్ట్ అంతా ప్రాక్టికాలిటీ లేకపోవడంతో మరుగున పడిపోతోం దన్నారు. పెద్దపెద్ద సర్టిఫికేట్లు ఇచ్చి ఆ బ్యాచ్‌ను ఫుల్ పర్సంటేజ్‌తో పంపిస్తున్నారుగానీ బైటకు వెళ్లి ఏం చేయాలా అనే దానిపై అగమ్యంగా ఉన్నామన్నారు. పరిశోధనలకు అవకాశమే లేదన్నారు.

డిగ్రీ చదివి జర్నలిజంలో శిక్షణ పొందుతున్న జ్యోతి మాట్లాడుతూ, 'నేను చదువుకునే కాలంలో రోజూ



గేమ్స్ పిరియడ్ ఉండేదనీ ఇప్పటి పాఠ్య ప్రణాళికలో గేమ్స్ పిరియడ్ అనేదే లేదని లాభార్జనే ధ్యేయంగా పిల్లల చదువులు ఉన్నాయనీ, దీనివల్ల ఎవరికి లాభమని' ప్రశ్నించారు. ఎగ్జామ్స్ ముందే ప్రశ్నాపత్రం ఇచ్చి బట్టీపట్టించడంతో మార్కులు సంవత్సరానికి వచ్చే ఆదాయం కన్నా పిల్లల ఫీజులే ఎక్కువవుతున్నాయని, కట్టక తప్పట్లేదనీ, పిల్లల భవిష్యత్తు తమకు ప్రధానమనీ, పిల్లలకు జీవిత పాఠాలను నేర్పడం తక్కువవు తోందనీ, మోరల్ వాల్యూస్‌గానీ, దేశంలో, ప్రపంచంలో జరిగే పరిణామాల అవగాహన తక్కువగా ఉంటోందన్నారు.

విశాలాంధ్ర బిజినెస్

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఐసీఐసీఐ బ్యాంక్	362.70	1.60
కోల్ ఇండియా	302.70	1.56
కొటాక్ మహీంద్ర	1,097.00	0.99
ఏక్సిస్ బ్యాంక్	617.00	0.96
లార్సెన్	1,425.00	0.90

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)		
కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్‌బీఐ	334.80	-4.96
అదానీ పోర్ట్స్	450.00	-2.37
డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్	2,594.95	-2.26
హీరో మోటోకార్ప్	3,656.20	-1.95
టీసీఎస్	3,181.00	-1.79

విదేశీమారకం విలువ (ఫారెక్స్)		
కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.54	63.54
యూరో	79.08	79.93
పౌండ్	90.54	90.05
ఆస్ట్రేలియా డాలర్	51.36	51.52
సింగపూర్ డాలర్	48.62	48.60

బులియన్		
బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,270	31,304
చెన్నై	29,220	31,251
బెంగళూరు	28,650	30,642
ముంబై	29,950	32,032
విజయవాడ	29,100	31,500
విశాఖపట్నం	29,270	31,931
ప్రొద్దుటూరు	28,900	31,200
ముడి చమురు		70.52

పోషకాల గని

గ్రీన్ యాపిల్

- జీవక్రియ రేటు మెరుగు
- బరువు తగ్గించే టానిక్
- చర్మానికి సంరక్షణ

రోజుకో యాపిల్ పండును తింటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదు... అనే మాటను మనం ఎప్పటి నుంచో వింటున్నాం. నిజానికి యాపిల్‌ను రోజూ తింటే మనకు కలిగే అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చు. అందుకే యాపిల్‌ను తింటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన పని ఉండదు అని చెబుతారు. అయితే ఇది కేవలం సాధారణ యాపిల్‌కే కాదు, గ్రీన్ యాపిల్‌కు కూడా వర్తిస్తుంది. దీన్ని తరచూ తినడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

1. గ్రీన్ యాపిల్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది శరీర జీవక్రియ రేటును మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని పోగొడుతుంది. జీర్ణవ్యవస్థ, ప్రధానంగా పేగులు శుభ్రమవుతాయి. ఐరన్, జింక్, కాపర్, మాంగనీస్, పొటాషియం వంటి మినరల్స్ వీటిలో అధికంగా ఉన్నాయి. ఇవి రక్తానికి అందే ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరుస్తాయి. మెటబాలిక్ రేటును పెంచుతాయి.

2. బరువు తగ్గాలనుకునే వారి కోసం గ్రీన్ యాపిల్ బాగా పనిచేస్తుంది. నిత్యం వ్యాయామం చేసే వారు రోజుకో గ్రీన్ యాపిల్‌ను తింటే మంచి ఫలితాలను సాధించవచ్చు. వీటిలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి.

3. గ్రీన్ యాపిల్స్‌లో ఉండే విటమిన్ సి చర్మానికి రక్షణనిస్తుంది. శరీరంలోని కణాల వినాశనానికి కారణమయ్యే ఫ్రీర్యాడికల్స్ ప్రభావాన్ని ఇది తగ్గిస్తుంది. చర్మ క్యాన్సర్ రాకుండా చూస్తుంది. వృద్ధాప్య లక్షణాలను దరిచేరనీయని యాంటీ ఏజింగ్ గుణాలు గ్రీన్ యాపిల్స్‌లో ఉన్నాయి. చర్మానికి కాంతిని, ప్రకాశాన్ని ఇస్తాయి.

4. శరీరంలో నాశనమైన కణాలను పునరుద్దరించే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు గ్రీన్ యాపిల్స్‌లో ఉన్నాయి. లివర్ సమస్యలకు ఇవి విరుగుడుగా పనిచేస్తాయి. ఎముకలకు దృఢత్వాన్ని చేకూరుస్తాయి. థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పనిచేసేలా చేస్తాయి. అల్జీమర్స్ రాకుండా కాపాడుతాయి.

5. ఆస్తమాను తగ్గించే గుణాలు గ్రీన్ యాపిల్స్‌లో ఉన్నాయి. యాపిల్స్ లాగే గ్రీన్ యాపిల్స్ కూడా మధుమేహాన్ని తగ్గిస్తాయి.

6. గ్రీన్ యాపిల్ జ్యూస్‌ను జుట్టు కుదుళ్లకు తగిలేలా మర్దనా చేసి తలస్నానం చేస్తే చుండ్రు సమస్య తొలగిపోతుంది. ఇది జుట్టు పెరుగుదలను కూడా ప్రోత్సహిస్తుంది.



టీవీఎస్ మోటార్ బ్రాండ్ ప్రొటెక్షన్ కార్యక్రమం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : టీవీఎస్ మోటార్ కంపెనీ, నకిలీ ఆటోమోటివ్ స్పేర్ పార్ట్స్‌పై పోరాడేందుకు బ్రాండ్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్ చేపట్టింది. టీవీఎస్ మోటార్ కంపెనీ 4000కు పైగా టచ్ పాయింట్ల ద్వారా వినియోగదారులకి అసలైన విడిభాగాలని అందుబాటులోకి తీసుకురావడాన్ని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ తెలిపింది. నకిలీ విడిభాగాలు, అసలైన విడిభాగాల ప్రమాణాలతో తయారైనవికాదని, అందువల్ల అవి వాహనాలకి, ప్రయాణికులకు ముప్పు అని పేర్కొంది. అసలు, నకిలీ విడిభాగాల మధ్య తేడాని వినియోగదారులు గుర్తించడానికి వీలుగా ఉత్పత్తుల మీద ప్రత్యేకమైన, హై-సెక్యూరిటీ లేబల్ ప్రవేశపెట్టారు. నగర పోలీసులతో కలిసి, అనుమానాస్పద నకిలీదారులపై (తయారీదారులు, హోల్‌సేలర్లు, రిటైలర్లు మొదలైనవారు) రెయిడ్స్ నిర్వహించడంతో నకిలీ/కాపీరైట్‌ని ఉల్లంఘించిన విడిభాగాలను సీజ్ చేసినట్టు సంస్థ వెల్లడించింది. అసలు, నకిలీ విడిభాగాల మధ్య తేడాని గుర్తించే వీలుగా వినియోగదారులు, గరాజ్ మెకానిక్స్‌కి అవుట్రీచ్ కార్యక్రమాలను నిర్వహించినట్టు పేర్కొంది. ప్రింటర్స్, సీలింగ్ మెషీన్లు, ప్యాకేజింగ్ సామాగ్రి, నకిలీ లేబుల్స్ దొరికాయని తెలిపింది.

అమెజాన్.ఇన్ గ్రేట్ ఇండియన్ సేల్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: బ్లాక్ బస్టర్ గ్రేట్ ఇండియన్ సేల్ 2018 పేరుతో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు అమెజాన్.ఇన్ నిర్వహించిన ఆన్‌లైన్ షాపింగ్ అంచనాలను మించి జరిగిందని అమెజాన్ ఇండియా కేటగిరి మేనేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ మనీశ్ తివారీ ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణ రోజులతో పోలిస్తే స్మార్ట్‌ఫోన్ల ఆర్డర్లు ఆరింతల పెరిగాయని, సామ్‌సంగ్ మాల్‌తో సామ్‌సంగ్ ఆన్7 ప్రైమ్, సామ్‌సంగ్ ఎ8+లకు ఎక్కువగా ఆర్డర్లు వచ్చాయన్నారు. ఎల్‌జీ, బాష్, వర్ల్‌పూల్, బీపీఎల్ అత్యంత ప్రాధాన బ్రాండ్లు ఉన్నాయని, ఇవి 6 నుంచి 8 రెట్లు వృద్ధిని చవిచూశామన్నారు. నూతన కొనుగోలుదారుల్లో 85 శాతం మంది ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలకు చెందినవారని, అమెజాన్.ఇన్‌పై కొనుగోలుదారుల విశ్వాసాన్ని ఇది స్పష్టం చేసిందని తివారీ తెలిపారు. వినియోగదారులు ప్రీమియం ఉత్పాదనలను కొనడాన్ని కూడా ఎంతో సౌకర్యవంతంగా భావిస్తున్నారన్నారు.

-111.20 ▼	-16.35 ▼	-160 ▼	బంగారం (విశాఖపట్నం) 29,270	-1,200 ▼	వెండి (విశాఖపట్నం) 42,200	డాలరు Vs రూపాయి
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	ప్రొద్దుటూరు	వెండి (విజయవాడ)	ప్రొద్దుటూరు	
36,050.44	11,069.00	29,100	28,900	41,000	41,000	63.54
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

దీర్ఘకాలిక పొదుపు కోసం

పీపీఎఫ్ ఖాతాను ఉపయోగించండి ఇలా..

సంఘటిత రంగాల్లోని కార్మికులకు ఉద్యోగ భవిష్య నిధి(ఈపీఎఫ్) ఉంటుంది. అదే రీతిన అసంఘటిత రంగ కార్మికులకు దీర్ఘకాలంలో ఆర్థిక రక్షణ కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్) సదుపాయాన్ని కల్పించారు. ఇందులో సాధారణ ప్రజలు సైతం భాగస్వాములుగా చేరవచ్చు. ప్రజలు ఎక్కువగా దీనిని పన్ను మినహాయింపు సాధనంగానే భావిస్తున్నారు. అయితే వీటిపై వడ్డీని ప్రభుత్వాలే నిర్ణయిస్తాయి. ప్రస్తుతం చాలా పెట్టుబడి సాధనాలపై వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. అయినప్పటికీ పీపీఎఫ్ ఆకర్షణీయంగానే ఉంది. ఈ క్రమంలో పీపీఎఫ్‌లో పెట్టుబడుల గురించి సమగ్రంగా తెలుసుకుందాం.

నెలవారీ పొదుపు

ప్రతి నెలా రూ.1000 చొప్పున పొదుపు చేస్తూ పోతే 20 ఏళ్ల తర్వాత కనీసం 8 శాతం వడ్డీ వస్తుందని భావిస్తే ఆ సొమ్ము చివరకు దాదాపు రూ.6 లక్షలు అవుతుంది. నెలవారీ ఖాతా నుంచి ఆటో డెబిట్ అయ్యే ఆప్షన్ ఎంచుకుంటే మంచిది. మొదట పొదుపు, తర్వాతే ఖర్చులు అనే సూత్రానికి ఇది బాగుంటుంది.

ఎంత పెట్టుబడి పెట్టొచ్చు?

మీరు మొదట రూ.100తోనే పీపీఎఫ్ ఖాతాను ప్రారంభించవచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో కనిష్ట పెట్టుబడి రూ.500, గరిష్ట పెట్టుబడి రూ. 1లక్షా యాభై వేలు. వ్యాపార వర్గాల వారు పెద్ద మొత్తంలో ఏడాదికి ఒకసారి పెట్టుబడి పెడితే మంచిది. ఎక్కువ రాబడుల కోసం ఏప్రిల్ 1 నుంచి పొదుపు ప్రారంభించాలి. పీపీఎఫ్ ఖాతా తెరిచేందుకు పీపీఎఫ్ ఖాతా తెరిచేందుకు దేశంలో నివసించే ఏ వ్యక్తులైనా తమ పేరుతో ఈ ఖాతాను ప్రారంభించవచ్చు. మైనర్ పేరిట కావాలంటే తండ్రి లేదా తల్లి పీపీఎఫ్ ఖాతాను తెరవొచ్చు. ఒక వ్యక్తి జీవిత కాలంలో ఒక ఖాతాను మాత్రమే తెరిచే వీలుంది. బ్యాంకు లేదా పోస్టాఫీసులో పీపీఎఫ్ ఖాతా తెరిచే సౌలభ్యం ఉంది.

ఖాతా బదిలీ

స్టేట్ బ్యాంకుల్లోని మెజారిటీ బ్రాంచీలు, దాదాపు అన్ని షెడ్యూల్డ్ బ్యాంకులు, ప్రధాన పోస్టాఫీసు కార్యాలయాల్లో పీపీఎఫ్ ఖాతాను ప్రారంభించే సదుపాయం ఉంది. ఒక బ్యాంకు శాఖ నుంచి మరో శాఖకు లేదా పోస్టాఫీసుకు పీపీఎఫ్ ఖాతాను బదిలీ చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ సౌకర్యాన్ని కల్పిస్తున్న బ్యాంకులు

ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంకు, ఐడీబీఐ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా. ప్రైవేటులో హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ మహీంద్రా బ్యాంకు పీపీఎఫ్ సదుపాయాన్ని అందించడం లేదు.

ఎలా డిపాజిట్ చేయాలి?

పీపీఎఫ్‌లో పెట్టుబడికి నగదు, చెక్కు, డీడీ ద్వారా చేసే సదుపాయాలు ఉన్నాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు ఆన్‌లైన్ ద్వారా పీపీఎఫ్ ఖాతాకు బదిలీ చేసే సదుపాయాన్ని సైతం అందిస్తున్నాయి. మీరు పెట్టుబడులను 12 వాయిదాల్లో కానీ లేదా ఒకేసారి మొత్తాన్ని కానీ డిపాజిట్ చేయవచ్చు.

ముందస్తు ఖాతా ముగింపు (ప్రీమెచ్యూర్ క్లోజర్)

గతేడాది నుంచి పీపీఎఫ్‌ను ముందే క్లోజ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఆర్థిక శాఖ సర్క్యులర్ ప్రకారం ఖాతా తెరిచిన ఐదేళ్ల తర్వాత నుంచి పీపీఎఫ్ ఖాతాను మూసివేసేందుకు అవకాశం కల్పించారు. అయితే ఉన్నత విద్య, ఆరోగ్య ఖర్చుల నిమిత్తం మాత్రమే దీన్ని తీసుకోవచ్చు. నామినీ నామినీ ఖాతా తెరిచిన సమయంలో కానీ తర్వాత అయినా మన ఖాతాకు నామినీని నియమించుకోవచ్చు. పెద్దల(మేజర్) ఖాతాల విషయంలో ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా పేర్కొనవచ్చు. ఎవరికి ఎంత వాటా చెందాలో కూడా ముందుగానే నిర్ణయించి అందులో పొందుపరుచుకోవచ్చు.





భద్రత

పీపీఎఫ్ ఒక సామాజిక భద్రతా పథకం. పీపీఎఫ్ ఖాతా కలిగిన వ్యక్తి అప్పుల్లో కూరుకుపోయి ఉన్నా ఎవరైనా అతడి ఆస్తులు జప్తు చేయాల్సి వస్తే అది పీపీఎఫ్‌లో పెట్టిన సొమ్ముకు వర్తించకుండా చట్టం ఉంది. కాబట్టి మీ ఆస్తులన్నీ జప్తు అయినప్పటికీ ఈ సొమ్ము మిగిలే ఉంటుంది. ఆర్థిక ప్రణాళికలో భాగంగా ఆర్థిక ప్రణాళికలో భాగంగా పీపీఎఫ్ అనేది దీర్ఘకాల ఆర్థిక ప్రణాళికలో భాగం. ఇక్కడ డిపాజిట్ చేసే సొమ్ముకు సుదీర్ఘ కాలవ్యవధితో పాటు చక్రవడ్డీ వస్తుంది. ప్రభుత్వ గ్యారెంటీ మూలంగా నష్ట భయం ఉండదు. దీంతో పదవీ విరమణ ప్రణాళికలో దీన్ని భాగం చేసుకోవచ్చు. ఎక్కువ రిస్క్ తీసుకోకుండా మధ్యస్థ స్థాయి రాబడులు కావాలనుకునేవారు దీన్ని ఆశ్రయించవచ్చు.

పన్ను ప్రయోజనాలు

పీపీఎఫ్‌లో అన్నిటికంటే ఉత్తమమైన విషయం ఏంటంటే మీ పెట్టుబడిపై ఆర్జించిన వడ్డీకి పన్ను ఉండదు. విత్‌డ్రాయల్స్‌ను సంపద పన్ను నుంచి మినహాయించారు. సంపాదనపరుడి వైపు నుంచే కాకుండా జీవిత భాగస్వామి లేదా పిల్లల పీపీఎఫ్ ఖాతాల్లో పెట్టిన పెట్టుబడులు సైతం పన్ను మినహాయింపుల కోసం అర్హత సాధిస్తాయి.

ఇతర అంశాలు

ఉమ్మడి ఖాతా తెరిచేందుకు అవకాశం లేదు. 3వ ఏట నుంచి 6వ సంవత్సరం చివరి వరకూ పీపీఎఫ్‌పై రుణాన్ని పొందొచ్చు. మైనర్ పేరిట సైతం ఖాతాను తెరవొచ్చు. ప్రస్తుతం పీపీఎఫ్ వడ్డీ రేటు 8.0%

ఎటువంటి రిస్క్(నష్ట భయం) లేకుండా స్థిరమైన ఆదాయం కావాలని భావించే వారికి పీపీఎఫ్ ఎంతో అనుకూలమైన పెట్టుబడి మార్గం. ఇది 15 ఏళ్ల దీర్ఘకాలిక మదుపు సాధనం. 15 సంవత్సరాల గడువు పూర్తయిన తర్వాత సైతం కావాలనుకుంటే మరో 5 ఏళ్లు పొడిగించుకోవచ్చు.

వంశపారంపర్య ఆస్తులు కొనేముందు

తీసుకోవలసిన జాగ్రత్తలు..



వంశపారంపర్యంగా వచ్చిన ఆస్తుల్లోంచి ఓ వ్యక్తి తన వాటాను అమ్మదలుచుకున్నప్పుడు కొనే వ్యక్తి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఉమ్మడి ఆస్తుల పంపకానికి సంబంధిం చిన దస్తావేజులను (పార్టిషన్ డీడ్) కచ్చితంగా పరిశీలించాలి. దానిలో ఎవరి వాటాను వారికి క్లియర్‌గా డీమార్కేషన్ చేశారా, లేదా... నిబం ధనల ప్రకారమే వాటాల విభజన జరి గిందా లేదా అన్నదీ సరి చూసుకోవాలి. నిబంధనలకు అనుగుణంగానే పంపిణీ జరిగినప్పటికీ వంశపారంపర్యంగా వచ్చే ఆస్తుల్లో పిల్లలకు పుట్టుకతోనే హక్కు ఉంటుంది. 1985 తర్వాత ఆడపిల్లలకు కూడా మన రాష్ట్రంలో ఆస్తి హక్కు కల్పించారు. 2005 తర్వాత దేశ వ్యాప్తంగా పురుషులతో సమానంగా స్త్రీలకు ఆస్తిలో సమాన ఆస్తి హక్కును అమలు చేస్తున్నారు. అందువల్ల ఇలాంటి ఆస్తులను కొనుగోలు చేస్తున్నప్పుడు అమ్మేవాళ్లకు ఇంకా భాగస్వాములుగానీ... మైనర్ హక్కులకు సంబంధించి ఏమైనా సమస్యలు గానీ వున్నాయేమో తెలుసుకోవడం మంచిది. పిల్లలు మైనర్లుగా వున్నప్పుడు ఉమ్మడి ఆస్తులను తండ్రి అమ్మే ప్రయత్నం చేసినప్పుడు కూడా వాటిని కొనడం మంచిది కాదు. ఉమ్మడి ఆస్తులను అమ్మేప్పుడు ఆ వ్యక్తికి అన్‌డివైడెడ్ షేర్‌లో హక్కు మాత్రమే ఉంటుంది తప్ప మొత్తం ఆస్తి అమ్మే హక్కు వుండదు.

పన్ను రాయితీతో కూడిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు

దీర్ఘకాల ఫిక్స్‌డ్ డిపాజిట్లు భద్రతతోబాటు, పన్ను రాయితీ పొందే అవకాశాన్నీ కల్పిస్తాయి.

పన్ను రాయితీని కల్పించే ఫిక్స్‌డ్ డిపాజిట్లు స్థిర ఆదాయంతోబాటు, పన్ను మినహాయింపు పొందాల నుకునే వారికి అనుకూలమైనవి. ఈ పథకంలో పెట్టు బడులు పూర్తి సురక్షితం. ఈ రకమైన ఫిక్స్‌డ్ డిపా జిట్లు చేసినవారికి ఒక ఆర్థిక సంవత్సరంలో ఆదా యపు పన్ను చట్టం సెక్షన్ 80సీ కింద రూ. 1.50 లక్షల వరకూ పన్ను మినహాయింపు వర్తిస్తుంది.

ముఖ్యమైన లక్షణాలు

- పాన్‌కార్డు కలిగి ఆదాయపు పన్ను చెల్లించే వ్యక్తులు పన్ను రాయితీతో కూడిన ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులు పెట్టేందుకు అర్హులు .
- పెట్టుబడులను ఒకరి పేరు మీద లేదా ఉమ్మడిగా చేయవచ్చు. ఉమ్మడి ఖాతాలో మొదటి వ్యక్తి ఆదాయానికి మాత్రమే పన్ను రాయితీ ఉంటుంది.
- ఈ డిపాజిట్ల కాలపరిమితి 5 ఏళ్లు.
- కనీస డిపాజిట్ విలువ రూ.100 ఆ పై గుణాంకాల్లో పెట్టుబడి పెట్టొచ్చు.
- గరిష్ట డిపాజిట్ విలువ రూ.1.5లక్షలు .
- పెట్టుబడి పెట్టే తేదీకి ఉన్న వడ్డీరేటును 5 ఏళ్ల కాలానికి అమలుచేస్తారు.
- వడ్డీ ఆదాయంపై టీడీఎస్ లేదు.



- ఈ పెట్టుబడులపై రుణసౌకర్యం ఉండదు.
- ఈ డిపాజిట్ ఖాతాలను కాలపరిమితికి ముందుగా మూసివేసే అవకాశం లేదు.

పెట్టుబడిపై మినహాయింపు ఉన్నప్పటికీ మెచ్యూరిటీ సమయానికి వచ్చే వడ్డీపై పన్ను విధి స్తారు. మెచ్యూరిటీ నాటికి పెట్టుబడిదారు ఆదా యపు పన్ను శ్లాబు ఎంత ఎక్కువ ఉంటే అంత తక్కువ నికర రాబడి (పన్ను తర్వాత రాబడి) ఉంటుంది.

ఉదాహరణ : ఒక వ్యక్తి 8.5 శాతం వడ్డీ చెల్లించే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో పెట్టుబడి పెట్టి, అతని ఆదాయపు పన్ను 30.9 శాతం అయితే ఫిక్స్‌డ్ డిపాజిట్ ద్వారా అతని నికర రాబడి 5.87 శాతం మాత్రమే ఉంటుంది.

రాబడి నుంచి ద్రవ్యోల్బణం, ఆదాయ పన్ను పోగా నికరంగా వచ్చే ఆదాయం తెలుసుకోండి.



'భరత్ అనే నేను' చిత్రంలో మహేష్‌బాబు

'ఇంటిలిజెంట్' టీజర్ విడుదల



సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ హీరోగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం టీజర్‌ను నటసింహ నందమూరి బాలకృష్ణ శనివారం విడుదల చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో హీరో సాయిధరమ్ తేజ్, దర్శకుడు వి.వి.వినాయక్, నిర్మాత సి.కళ్యాణ్, రచయిత శివ ఆకుల పాల్గొన్నారు. సహనిర్మాతల్లో ఒకరైన సి.వి.రావు బొకేలతో స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా నటసింహ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ "సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌లో మా సి.కళ్యాణ్‌గారు వి.వి.వినాయక్ దర్శకత్వంలో నిర్మిస్తున్న నాలుగో సినిమా ఇది. వినాయక్ కాంబినేషన్‌లో ఇంతకుముందు 'చెన్నకేశవరెడ్డి' సినిమా చేశాం. మన కాంబినేషన్‌లో సినిమా ఎప్పుడు అని అడుగుతుంటాను. సినిమా విషయంలో ఆయన ఇన్‌వాల్వ్‌మెంట్, కలుపుగోలుతనం, ఆర్టిస్టు నుంచి సరైన పెర్‌ఫార్మెన్స్ రాబట్టుకోవడం ఆయనకు తెలుసు. ఇండస్ట్రీ గర్వించదగ్గ దర్శకుడు వి.వి.వినాయక్. ఆయన దర్శకత్వంలో మెగా ఫ్యామిలీ నుంచి మరో నటవారసుడు సాయిధరమ్ తేజ్ హీరోగా రూపొందిన చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ సినిమా టీజర్‌ని నా చేతుల మీదుగా రిలీజ్ చేయడం చాలా సంతోషంగా వుంది. ఎందుకంటే సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ నా సొంత బేనర్‌తో సమానం. కళ్యాణ్‌గారు పెద్ద హీరోలతో, చిన్న హీరోలతో ఇంకా సినిమా చేయాలి. ఈ సినిమా విషయానికి వస్తే వినాయక్, శివ కాంబినేషన్‌లో ఎన్నో అద్భుతమైన సినిమాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ చాలా బాగుంది. మిస్టీరియస్‌గా వుంది. టీజర్ చూసిన తర్వాత సినిమా ఎప్పుడు చూడాలా అనిపిస్తుంది. టైటిల్ కూడా చాలా బాగుంది. మెగా అభిమానులకు, ఇది నా బేనర్ కాబట్టి నా అభిమానులకు, ముఖ్యంగా యూత్‌కి ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. సినిమా ఘనవిజయం సాధిస్తుంది" అన్నారు.



నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ "మా నందమూరి అభిమానులకు, మెగాస్టార్ చిరంజీవిగారి ఫ్యామిలీ హీరో సాయిధరమ్‌తేజ్ అభిమానులకు, ప్రేక్షకులకు నమస్కారం. ఇదొక సెన్సేషన్. నాకు చాలా పెద్ద హిట్ ఇచ్చిన మా హీరో బాలకృష్ణగారు. అలాగే గురువుగారి 150వ సినిమాకి నిర్మాతనయ్యే అవకాశం ఆరోజు నాకు ఇచ్చారు. అది చాలా గ్రేట్. ఈ పొంగల్‌కి 'జైసింహా' పెద్ద హిట్ ఇచ్చారు. చాలా తక్కువ టైమ్‌లో రాత్రింబగళ్ళు కష్టపడి పనిచేసి సక్సెస్ కొట్టాం. అవన్నీ ఒక ఎత్తయితే వినాయక్ నాన్నగారు కృష్ణ కోరిక వినయ్ నాతో ఒక సినిమా చెయ్యాలని. చెన్నకేశవరెడ్డి ఫస్ట్ ప్రొజెక్షన్ ప్రసాద్ ల్యాబ్‌లో జరుగుతోంది. అప్పుడు వినయ్ నాన్నగారితో విషయం చెపితే నాకు వదిలెయ్ నేను చూసుకుంటాను అన్నారు. ఇప్పుడు నాతో సినిమా చేయడం ద్వారా వినయ్ నా కోరికను నెరవేర్చాడు. తేజు ఈ సినిమా ఎంతో కష్టపడి చేశారు. మా తండ్రిగారు దాసరి నారాయణరావుగారి దీవెనలు, అన్నయ్య కృష్ణ దీవెనలు మాకు ఉంటాయి. వీటన్నింటిని మించి మా బాలయ్యబాబు మాకు ఆశీస్సులు అందించేందుకు రావడం.. నేను చాలాచాలా పెద్ద సెన్సేషన్ హిట్ కొట్టినట్టు భావిస్తున్నాను. 2018 ప్రారంభంలో బాలకృష్ణగారు నాకు మంచి ఎనర్జీ ఇచ్చారు. ఫిబ్రవరిలో కూడా సూపర్‌హిట్ కొట్టి సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్ వుందని నిరూపిస్తాను" అన్నారు.

సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ "మేం అడగ్గానే బాలకృష్ణగారు రావడంతో ఈ సినిమా సూపర్‌హిట్ అయిపోయిందన్న ఫీలింగ్ వచ్చేసింది. మేమంతా ఆనందంతో ఉద్వేగంగా ఉన్నాం. యూనిట్‌లోని ప్రతి ఒక్కరి తరఫున బాలకృష్ణగారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అన్నారు.

హీరో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ "ముందుగా బాలకృష్ణగారికి థాంక్స్. కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చెయ్యడంలో బాలకృష్ణగారు ముందుంటారని అందరూ అంటారు. మా సినిమాకి ఆశీస్సులు అందించడానికి రావడంతో మరోసారి అది ప్రూవ్ అయ్యింది" అన్నారు.

రచయిత శివ ఆకుల మాట్లాడుతూ "భారతం, భాగవతాలను అవపోసన పట్టిన మా నందమూరి బాలకృష్ణగారి చేతుల మీదుగా ఈ టీజర్ రిలీజ్ అవడం ఆనందంగా వుంది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జరిగిన ఒక యదార్థ సంఘటన ఇన్‌స్పిరేషన్‌తో ఈ సినిమా కథ రూపొందించడం జరిగింది. సమస్యనైనా, సందేశాన్నయినా సరదాగా చెప్పాలని మా మామ వినాయక్ ఎప్పుడూ అంటూ వుంటారు. అలా ఎంటర్‌టైన్‌మెంట్ వేలో మా అన్న సి.కళ్యాణ్‌గారి బేనర్‌లో ఈ సినిమాకి కథ, మాటలు అందించడం నాకెంతో సంతృప్తిని కలిగించింది. తప్పకుండా ఈ సినిమా విజయం సాధిస్తుంది" అన్నారు.

సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి, నాజర్, బ్రహ్మానందం, పోసాని కృష్ణ మురళి, ఆకుల శివ, కాశీ విశ్వనాథ్, ఆశిష్ విద్యార్థి, షాయాజీ షిండే, రాహుల్‌దేవ్, దేవ్‌గిల్, వినీత్‌కుమార్, జె.పి. పృథ్వీ, రుబాబు, కాదంబరి కిరణ్, విద్యుల్లేఖా రామన్, సప్తగిరి, తాగుబోతు రమేష్, భద్రం, నల్ల వేణు, రాహుల్ రామకృష్ణ, వెంకీ మంకీ, రాజేశ్వరి నాయర్, సంధ్యా జనక్, ఫిష్ వెంకట్, శ్రీహర్ష, శివమ్ మల్హోత్రా, రవిరామ్ తేజ, తేజారెడ్డి నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: శివ ఆకుల, సినిమాటోగ్రఫీ: ఎస్.వి. విశ్వేశ్వర్, సంగీతం: థమన్, ఎడిటింగ్: గౌతంరాజు, ఆర్ట్: బ్రహ్మ కడలి, ఫైట్స్: వెంకట్, డాన్స్: శేఖర్, జాని, సహనిర్మాతలు: సి.వి.రావు, నాగరాజ పత్సా, నిర్మాత: సి.కళ్యాణ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.వి.వినాయక్.

అందుకే ఏ సినిమా ఒప్పుకోలేదు



అగ్ర కథానాయిక అనుష్క 'బాహుబలి: ది కన్‌క్లూజన్' తర్వాత ఏ సినిమాకు సంతకం చేయలేదు. శుక్రవారం విడుదలైన 'భాగమతి' కూడా ఆమె ఈ చిత్రం విడుదలకు ముందు ఒప్పుకున్నదే. ఆమె కొత్త ప్రాజెక్టుల గురించి వెల్లడించకపోవడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు. అయితే ఎందుకు సినిమాలకు సంతకం చేయలేదన్న విషయాన్ని అనుష్క ఓ ప్రముఖ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 'బాహుబలి' విజయం గురించి ప్రస్తావించారు. 'ఇంకా చిత్ర బృందం మొత్తం 'బాహుబలి' విజయాన్ని, ప్రశంసల్ని ఆస్వాదిస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం చాలా రోజులు కేటాయించాం, కష్టపడ్డాం. దాని ప్రతిఫలం దక్కింది. నాకు సినీ పరిశ్రమలో ఎంతో గుర్తింపు లభించడానికి కారణమైన 'బాహుబలి'కి ధన్యవాదాలు'. 'నేను చీర, ఆభరణాలతో కనిపిస్తే ప్రేక్షకులు వెంటనే 'అరుంధతి' సినిమాను గుర్తు చేసుకుంటారని నాకు తెలుసు. కానీ 'భాగమతి' అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో కూడిన ప్రత్యేకమైన థ్రిల్లర్ కథ. ఇది కాంప్లెక్స్ సినిమా కాదు.. కానీ ఇందులో అనేక మలుపులు ఉన్నాయి' అని ఆమె అన్నారు. అనంతరం కొత్త సినిమాల గురించి మాట్లాడుతూ.. 'ప్రస్తుతం నేను కొన్ని గాయాల నుంచి కోలుకుంటున్నా. కాబట్టి నెమ్మదిగా కెరీర్‌ను తీసుకెళ్తున్నా. మరోపక్క బరువు తగ్గే పనిలో కూడా ఉన్నా.. దీనికి చాలా రోజులు పడుతుంది. ఇటీవల కొన్ని కథలు విన్నా.. కానీ అవేవీ నన్ను ఆకట్టుకోలేదు' అని అనుష్క పేర్కొన్నారు.

కాజల్ స్థానంలో శ్రీదేవి కుమార్తె



తెలుగు సూపర్ హిట్ 'టెంపర్'ను హిందీలో రీమేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ పాత్రలో బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్నారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. 'సింబా' అనే టైటిల్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. ఇందులో కాజల్ అగర్వాల్ పాత్రలో ఎవరు నటిస్తారనే విషయంపై ఆసక్తి నెలకొంది. అయితే శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ ఇందులో నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. హిందీ రీమేక్ కథలో కొన్ని మార్పులు చేస్తున్నారట. మాతృకతో పోల్చితే ఇందులో కథానాయిక పాత్ర ప్రాముఖ్యాన్ని మరింత పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు కరణ్‌జోహార్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. జాన్వీని 'సింబా' కోసం తీసుకోవాలన్నది ఆయన ఆలోచనే అని చెబుతున్నారు. జాన్వీ కథానాయికగా బాలీవుడ్‌కు పరిచయం అవుతున్న తొలి సినిమా 'ధడక్'. మరాఠీ బ్లాక్‌బస్టర్ 'సైరాత్'కు హిందీ రీమేక్‌గా వస్తోన్న చిత్రమిది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కరణ్ జోహార్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

శ్రీకాంత్ 'ఆపరేషన్ 2019'



సీనియర్ నటుడు శ్రీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ 2019'. 'బీవేర్ ఆఫ్ పబ్లిక్' అనేది ఉపశీర్షిక. కరణం బాబ్జీ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అలివేలమ్మ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకాంత్ సమర్పిస్తున్నారు. గణతంత్ర దినోత్సవ శు భాకాంక్షలు చెబుతూ శుక్రవారం సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. కాగా టీజర్‌ను శనివారం ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. దీన్ని శ్రీకాంత్ ట్విటర్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. శ్రీకాంత్ గాయాలతో నేలపై కూర్చొని, ఉక్రోషంగా చూస్తూ కనిపించారు. టీజర్‌లో ఒక డైలాగ్ కూడా లేదు. రాజకీయ నేపథ్యంలో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో శ్రీకాంత్ రాజకీయ నాయకుడిగా కనిపించనున్నారట. ఈ ప్రచార చిత్రం సినిమాపై అంచనాలను పెంచింది.

పర్యావరణ చట్టాలను బలహీనపరుస్తున్నారు



కోల్‌కతా : బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పర్యావరణ చట్టాలను పరిశ్రమలకు అనుకూలంగా బలహీనపరుస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జైరాం రమేష్ విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యావరణ పరిరక్షణ కోసం ఏమి చెపుతున్నారో ఆచరణలో దానిని అమలు చేయడంలేదని దుయ్యబట్టారు. యూపీఏ-2 ప్రభుత్వంలో 2009 నుంచి 2011 వరకు రమేష్ పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు శాఖ మంత్రిగా పనిచేశారు. శనివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ, "పర్యావరణ చట్టాలను రోజురోజుకి బలహీనపరుస్తున్నారు. పర్యావరణ మంత్రిత్వ శాఖ రబ్బరు స్టాంప్‌గా మారిపోయింది. వాణిజ్యాన్ని సరళతరం చేసే పేరుతో పరిశ్రమల వర్గానికి అనుకూలంగా పర్యావరణ చట్టాలను నీరుగారుస్తున్నారు" అని విమర్శించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ తీసుకున్న చర్యలను జైరాం రమేష్ ప్రశంసించారు. ప్రధానమంత్రిగా ఆమె పర్యావరణ పరిరక్షణ కోసమే మాట్లాడేది, నడిచేదని అన్నారు. రోజువారీ పాలనలో ఈ అంశాన్ని చేర్చారని చెప్పారు. "పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పు గురించి ఇందిరాగాంధీ 1972లోనే మాట్లాడారు.. ప్రస్తుత ప్రధానమంత్రి మోడీ పర్యావరణం గురించి నోరుమెదపడంలేదు, కాలుకదపడంలేదు" అని రమేష్ ఎద్దేవా చేశారు.

అతి త్వరలో జీఎస్టీ స్థిరీకరణ : జైట్లీ



న్యూఢిల్లీ : వస్తుసేవల పన్ను (జీఎస్టీ)ని త్వరలో స్థిరీకరించనున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. సమీప భవిష్యత్‌లో పన్ను రేట్లు మరింత తగ్గుతాయని చెప్పారు. తన పరిధిని విస్తృతపరుచుకునేవిధంగా జీఎస్టీని త్వరలో స్థిరీకరిస్తామని, భవిష్యత్‌లో పన్ను రేట్లు మరింత సహేతుకమవుతాయని తెలిపారు. దేశంలో పరోక్ష పన్నుల వ్యవస్థలో జీఎస్టీ సమూల మార్పులు తీసుకువచ్చిందని జైట్లీ తెలిపారు. ఇతర వివిధ దేశాలతో పోలిస్తే దేశంలో జీఎస్టీని త్వరలో స్థిరీకరిస్తామని చెప్పారు. అంతర్జాతీయ కస్టమ్స్ డే సందర్భంగా జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం నాలుగు అంచెలలో జీఎస్టీ రేటు 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతంగా ఉన్నది. నవంబరులో జరిగిన జీఎస్టీ సమావేశంలో 178 సరుకులను అత్యధికంగా ఉన్న 28 శాతం నుంచి తగ్గించి 18 శాతం అంచెలో కలిపారు. 13 సరుకులను 18 శాతం నుంచి 12 శాతంలో, 8 సరుకులను 12 శాతం నుంచి 5 శాతంలో, 6 సరుకులను 5 శాతం నుంచి 0 శాతం స్లాబ్‌లోకి మార్చారు.

జైలు బద్దలు కొట్టిన గ్యాంగ్‌స్టర్ హతం

ఛండీగఢ్: పంజాబ్‌లో మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ అయిన విక్కీ గౌండర్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో నభా జైలు బద్దలు కొట్టిన ఘటనకు సంబంధించి కీలక సూత్రధారి ప్రేమా లోహారియా కూడా మరణించాడు. గతంలో విక్కీ ఫేస్‌బుక్‌లో యాక్టివ్‌గా ఉండేవాడు. పోలీసులు తనపై చేసిన ఆరోపణలపై సోషల్‌మీడియా వేదికగా సవాలు చేసేవాడు. జైలు నుంచే ఫేస్‌బుక్‌లో పోస్టులు చేసేవాడు. అంతేకాకుండా తాను జైల్లో ఉండే హత్యలు చేయించానని వాటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా గతంలో సోషల్‌మీడియాలో పోస్ట్ చేసి సంచలనం సృష్టించాడు. 2016 నవం బరులో డజను మంది నభా జైలుపై దాడిచేసి అక్కడి నుంచి విక్కీ తప్పించు కునేలా చేశారు. అప్పుడు జైలు నుంచి ఇద్దరు ఉగ్రవాదులు, నలుగురు గ్యాంగ్‌స్టర్లు తప్పించుకుని పారిపోయారు. విక్కీ అసలు పేరు హర్జిందర్ భుల్లర్. పంజాబ్‌లోని లంబి ప్రాంతంలో సరావన్ బోధ్లా అతడి స్వగ్రామం. శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఈ గ్యాంగ్‌స్టర్లు చనిపోవడంతో పాటు మరో క్రిమినల్ గాయపడ్డాడు. మరొకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరు పోలీసులు కూడా గాయాల పాలయ్యారు. విక్కీని, అతడి అనుచరుడు లోయారియాను ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టడంపై పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ హర్షం వ్యక్తంచేశారు. డీజీ సహా ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసు అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి బడ్జెట్ సమావేశాలు

- పార్లమెంట్‌వాడీవేడిగా జరిగే అవకాశం
- విమర్శనాస్త్రాలు వెలికితీస్తున్న ప్రతిపక్షం
- నేడు సభానాయకులతో స్పీకర్
- పార్టీల నేతలతో ప్రభుత్వం సమావేశం



న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29వ తేదీ (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. పాలక, ప్రతిపక్షాలు అనేక అంశాలపై విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నందున సమావేశాలు వాడీవేడీగా జరిగే అవకాశాలు ఉన్నాయి. ట్రిపుల్ తలాక్ బిల్లుతో సహా అనేక అంశాలపై పాలక, ప్రతిపక్షాల వైఖరులు భిన్నంగా ఉన్నాయి. దీనితో సమావేశాలు సజావుగా సాగేందుకు తీసుకునే చర్యలలో భాగంగా లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ రేపు (ఆదివారం) వివిధ పార్టీల సభా నాయకుల సమావేశాన్ని నిర్వహించనున్నారు. మరో పక్క ప్రభుత్వం కూడా రేపే ఇటువంటి సమావేశాన్ని నిర్వహించనున్నది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ప్రతిపక్ష అగ్ర నాయకులు ఈ సమావేశానికి హాజరై సంబంధిత అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడిస్తారని భావిస్తున్నారు. బడ్జెట్ సమావేశాలలో సభ చేపట్టే అంశాలపై ప్రధానంగా ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. సమావేశాల మొదటి రోజునే ప్రభుత్వం ఆర్థిక సర్వేని సభ ముందు ఉంచుతుంది. ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రతిపాదనలను సభకు సమర్పించనున్నారు. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగించనున్నారు. పార్లమెంట్ ఉభయ సభల నుద్దేశించి కోవింద్ చేసే మొట్టమొదటి ప్రసంగం ఇది. అభివృద్ధిపై ప్రభుత్వ విధానం, ప్రత్యేకించి వెనుకబడిన, బలహీన వర్గాల వారికి ప్రజాసాధికారత తదితర అంశాలను రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించవచ్చునని అధికారవర్గాలు తెలిపాయి. లోక్‌సభ తదుపరి ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం 2019లో జరగవలసి ఉన్నది. అందువల్ల కేంద్రంలో ఎన్డీయే నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వానికి ఇదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్. కాబట్టి బడ్జెట్ రాజకీయంగా ఉంటుందని, భారాలు ఎక్కువగా ఉండకపోవచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు.

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి విడత జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు జరుగుతాయి. రెండో విడత సమావేశాలు మార్చి 5 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు జరుగుతాయి. ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదించుకునేందుకు ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావచ్చునని భావిస్తున్నారు. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించే బిల్లు కూడా సభ ఈ సమావేశాలలో చేపట్టే అవకాశం ఉన్నది. ఈ రెండు బిల్లులూ కూడా బీజేపీకి సంబంధించి ప్రాముఖ్యత కలిగినవి. ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్‌ను అనుసరిస్తే ముస్లిం పురుషులకు జైలుశిక్ష విధించేందుకు వీలుకల్పించే ఈ బిల్లుకు లోక్‌సభ సులువుగా ఆమోదించే అవకాశం ఉన్నది. ఇక్కడ అధికారపక్షానికి తగినంత మెజారిటీ ఉన్నది, ఇక సమస్యల్లా రాజ్యసభలోనే. ఇక్కడ పాలక పక్షానికి మెజారిటీ లేదు. ప్రతిపక్షాలు రాజ్యసభను స్తంభింపచేసే అవకాశం ఉన్నది. ఓబీసీ కమిషన్‌కి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పిస్తే వెనుకబడిన తరగతుల వారు కుప్పలుతెప్పలుగా తనకు మద్దతు ఇస్తారన్న ఆశాభావంతో ప్రభుత్వం ఉన్నదని విశ్లేషకులు భావిస్తున్నారు.

మహారాష్ట్రలో నదిలోపడ్డ మినీబస్సు

ఏడుగురు చిన్నారులతో సహా 13 మంది మృతి

ముంబై : పశ్చిమ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో గత రాత్రి పొద్దుపోయిన తరువాత 17 మంది ప్రయాణీకులను తీసుకువెళుతున్న మినీబస్సు పంచగంగ నదిలో పడిపోయిన దుర్ఘటనలో దాదాపు 13 మంది ప్రాణాలు కోల్పోయారని పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి 11.45 గంటల తరువాత ఈ ప్రమాదం చోటుచేసుకున్నదని పోలీసు అధికారి ఒకరు శనివారం తెలిపారు. కొంకణ్ తీరంలోని గణపతిపూలే నుండి మూడు కుటుంబాలతో కూడిన మినీ బస్సు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. మృతులలో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు, తొమ్మిది నెలల చిన్నారితో సహా ఏడుగురు పిల్లలు ఉన్నారని ఆయన తెలిపారు. పంచగంగ నదిపై శివాజీ బ్రిడ్జిపై నుండి మినీ బస్సు వేగంగా వెళుతుండగా డ్రైవర్ అదుపుతప్పిందని, తరువాత బస్సు నదిలో పడిపోయిందని ఆ అధికారి చెప్పారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించారు. దానితో ఆ రెండు దళాల వారు రంగంలోకి దిగారు. ప్రమాదానికి గురైన బస్సులోని 16 మంది ప్రయాణీకులను సహాయక బృందాలు గుర్తించాయి. అందులో 13 మంది అప్పటికే విగతజీవులయ్యారు. చికిత్స కోసం ముగ్గురు వ్యక్తులను ఆస్పత్రిలో చేర్పించారు. బాధితులంతా పూణేలోని బలేవాడికి చెందిన వారని పోలీసులు తెలిపారు. సహాయ చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

బిజూపట్నాయక్ ఆత్మకథ పుస్తకావిష్కరణ

భువనేశ్వర్ : బిజూపట్నాయక్ చిత్రాలతో ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరిలు పాల్గొన్నారు. నవీన్‌పట్నాయక్ వారిని శనివారం విమానాశ్రయంలో ఆహ్వానించారని అధికారులు తెలిపారు. బిజూపట్నాయక్ శతజయంతి సందర్భంగా రచయిత సుందర్ గణేషన్ ఈ పుస్తకాన్ని రచించారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులు, సీనియర్ జర్నలిస్టు ప్రభుచావ్లా హాజరయ్యారు.

ఈ ఏడాది మొదటి స్వైన్‌ఫ్లూ మృతి

ఇండోర్ : ఈ ఏడాది మొదటి స్వైన్‌ఫ్లూ మృతి ఇండోర్‌లో నమోదైందని అధికారులు వెల్లడించారు. హెచ్1ఎన్1 వైరస్‌కు చికిత్స తీసుకుంటున్న 35 ఏళ్ల మహిళ మరణించిందని సమగ్ర రోగ నివారణా కార్యక్రమం (ఐడీఎస్పీ) ఇన్‌చార్జ్ ఆశా పండిట్ తెలిపారు. 20 రోజులుగా చికిత్స తీసుకుంటున్న ఆమెకు ఆర్థ్రైటిస్, డయాబెటిస్‌కూడా ఉన్నాయన్నారు. జనవరి 1 నుంచి ఇప్పటివరకు 18 మంది స్వైన్‌ఫ్లూ చికిత్స పొందారని ఆమె వెల్లడించారు.

పంజాబ్, హర్యానాలో చలిగాలులు

చండీఘర్ : పంజాబ్, హర్యానాల్లో చలిగాలుల తీవ్రత కొనసాగుతోంది. మందపాటి మంచుతో వాహనాల రాకపోకలు కనిపించడం లేదు. రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధాని అయిన చండీఘర్‌లో 8.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణశాఖాధికారులు తెలిపారు. పంజాబ్‌లోని గురుదాస్ పూర్‌లో 4 డిగ్రీల సెల్సియస్ , లూథియాన, పాటియాలల్లో 9.1 డిగ్రీ లు నమోదయ్యాయి. హర్యానాలోని అంబాలాలో 8.6 డిగ్రీలు, హిసార్, కర్నల్‌లో 6.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రాయితీ ధృవీకరణలో 'దివ్యాంగ్'

న్యూఢిల్లీ : ఇకపై రాయితీ ధృవీకరణ పత్రాల్లో వికలాంగులు పదానికి బదులుగా దివ్యాంగులు అని ఉండే విధంగా రైల్వే అధికారులు మార్పులు చేశారు. రెండేళ్ల క్రిందట ప్రధాని వికలాంగులను దివ్యాంగులు అని సంబోధించాలని సూచించిన విషయం తెలిసిందే. పూర్తిగా చూపు కోల్పోయిన వారిని 'గుడ్డి' బదులుగా దృష్టిలోపంగల వారిగా, చెవిటి మూగవారిని వినికిడి, మాట్లాడే లోపంగలవారిగా, వికలాంగులను దివ్యాంగులుగా పిలుస్తారు. రైల్వేల్లో 53 రకాల రాయితీలను దివ్యాంగులకు కేటాయిస్తోంది.

ఆరుగురు మహిళలపై కేసు నమోదు

థానే : చీటింగ్ కేసులో వ్యక్తిని అరెస్టు చేయడానికి వెళ్లిన పోలీసులుపై మూకుమ్మడిగా దాడిజరిపిన ఆరుగురు మహిళలపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన భివాండిలోని పిరాని పదాలో జరిగిందని పోలీసులు అధికార ప్రతినిధి తెలిపారు. అధికారినని తప్పుడు సమాచారం ఇచ్చి కమర్‌అలి అనే వ్యక్తి మోసం చేయగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లగానే మహిళలంతా పోలీసులపై దాడిచేసి రాళ్లతో కొట్టి వారి యూనిఫాం చింపివేశారన్నారు.

ఉపఎన్నిక జాప్యంపై వివరణకోరిన కోర్టు

న్యూఢిలీ: ఒడిశాలోని బీజేపూర్ ఉప ఎన్నిక నిర్వహణపై ఎలక్షన్ కమిషన్ అలసత్వాన్ని ప్రశ్నిస్తూ హైకోర్టు వివరణ కోరింది. ఎన్నిక నిర్వహణకు సమయాన్ని నిర్దేశించాలని జస్టిస్ రేఖపల్లి ఆదేశించారు. ఉప ఎన్నికను నిర్వహించాలని ఆదేశించాల్సిందిగా సివిల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పిటిషన్ దాఖలు చేయడంతో కోర్టు విచారణకు చేపట్టింది. ఆగస్టు 22న స్థానిక ఎమ్మెల్యే సుబాల సాహు మృతితో ఈ ఖాళీ ఏర్పడింది.

గుర్గాం వ్యాపార కూడలిలో అగ్నిప్రమాదం

ముంబై : గుర్గాంలోని వ్యాపారకూడలిలో శనివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. కామ ఎస్టేట్‌లో ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ విపత్తు నివారణా శాఖ అధికారి తెలిపారు. 8 అగ్నిమాపక దళ శకటాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని, ప్రమాదానికి కారణంపై దర్యాప్తు జరుపుతామని పోలీసులు వెల్లడించారు.

ఏఐఏడీఎంకే నుంచి 140 మంది బహిష్కరణ

చెన్నై : ఏఐఏడీఎంకే నుంచి 140 మంది ఆఫీసు బేరర్లను ఏఐఏడీఎంకే నాయకులు పన్నీర్‌సెల్వం, పళనీ స్వామిలు బహిష్కరించారు. ఏఐడీఎంకేకు చెందిన 144 మందిని ఇప్పటివరకు తొలిగించాలన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినందుకు వారిపై వేటువేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ఎవరూ బహిష్కృతులతో సంబంధాలు పెట్టుకోరాదన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినందువల్లే ఆర్కేనగర్‌లో టీటీవీ దినకరన్ విజయం సాధించారని వారు నమ్ముతున్నారు.

త్రిపురలో రైల్వే ట్రాక్‌ల విధ్వంసం

అగర్తలా : రాష్ట్రంలో నూతనంగా విస్తరించిన రైల్వే ట్రాక్‌లు విధ్వంసానికి గురవుతున్నాయని ఆరాష్ట్ర గవర్నర్ తథాగత రాయ్ ట్వీట్ చేశారు. నైరుతి రైల్వే జనరల్ మేనేజర్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ విషయంలో ఎప్పటికప్పుడు సమాచారం స్వీకరిస్తున్నానన్నారు. రైల్వే ట్రాకుల నుంచి ఫిష్ ప్లేట్లను పదునైన ఆయుధాలతో తొలగిస్తున్నారన్నారు. నెలన్నర క్రితం తొలగించిన వాటిని రైల్వే ఇంజనీర్లు పునరుద్ధరిస్తున్నారని ఎస్పీ నాగేంద్ర దెబర్మా వెల్లడించారు.

సీఎస్‌సీల్లో స్థానికులకే ప్రాధాన్యం : రవిశంకర్

న్యూఢిల్లీ: గ్రామాల్లో ఏర్పాటుచేసిన సాధారణ సేవల కేంద్రాలు (సీఎస్‌సీ) స్థానికులకు సాధికారత కల్పించడమే గాక, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు అందిస్తున్నాయని కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. సీఎస్‌ఈలో భాగంగా మహిళల ఆరోగ్యం కోసం 'స్త్రీ స్వాభిమానం' పేరుతో సేవల ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్, బ్యాం కింగ్, బీమా, డిజిటల్ సేవలు అందిస్తున్న గ్రామస్థాయి ఉద్యోగులను ప్రశంసించారు.

ఐపీఎల్‌కు తాగు నీరు వాడం : ఎంసీఏ

ముంబై: ఐపీఎల్ సమయంలో గ్రౌండ్ నిర్వహణ కోసం తాగునీటిని ఉపయోగించబోమని ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎంసీఏ) ముంబై హైకోర్టుకు తెలిపింది. బీఎంసీ నుంచి వచ్చే నీటిని, ప్రైవేటుగా విక్రయించిన నీటిని పిచ్ కోసం ఉపయోగించబోము అని ఎంసీఏ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాంఖడే స్టేడియంలో నిర్మించిన వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థ ద్వారా నిల్వ చేసుకున్న నీటిని మాత్రమే పిచ్‌కు ఉపయోగిస్తామని వెల్లడించారు. మరుగుదొడ్లకు, ఇతర శుభ్రం చేసే అవసరాలకు ఈ నీటినే ఉపయోగిస్తామని వెల్లడించారు.

మీరు నేర్పిన విద్యయే...

రాహుల్‌కు ఆరో వరుస సీటు కేటాయింపుపై బీజేపీ


న్యూఢిల్లీ : 'మీరు అధికారంలో ఉండగా బీజేపీ నాయకులనూ అంతే చూశారుగా..అప్పుడు మేము దీనిని పెద్ద సమస్యగా చూడలేదు. ఇప్పుడెందుకు గొంతు చించుకుంటున్నారు' అని కాంగ్రెస్‌పై బీజేపీ ఎదురు దాడికి దిగింది. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా తమ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఆరో వరుసలో సీటు కేటాయించడంపై కాంగ్రెస్ విమర్శలకు దిగింది. దీనికి బీజేపీ తీవ్రంగానే ప్రతిస్పందించింది. కాంగ్రెస్ ఆరోపణలపై ఎదురుదాడి చేసింది. రాహుల్‌గాంధీ తనకుతాను సూపర్ వీవీఐపీగా భావిస్తున్నారని, ఎవరి కన్నా ఆయన గొప్పేమీకాదని వ్యాఖ్యానించింది. ప్రొటో కాల్ ప్రకారమే రాహుల్‌కు సీటు కేటాయించామని, కాంగ్రెస్ అధికారంలో ఉండగా తమ నాయకులనూ అలాగే వేధించిందని పేర్కొన్నది. అయినా తాము ఏనాడు దీనిని సమస్యగా చెప్పుకోలేదని తెలిపింది. రాహుల్‌గాంధీకి ఆరో సీటు కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. సంప్రదాయాలను మోడీ ప్రభుత్వం పక్కనపెట్టిందని విమర్శించింది. చౌకబారు రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడింది. కాంగ్రెస్ ఆరోపణలపై బీజేపీ జాతీయ ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు శనివారం స్పందిస్తూ 133 సంవత్సరాల చరిత్ర గలిగిన పార్టీగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ఇలాంటి విషయాలను రాద్ధాంతం చేయడం సిగ్గుచేటన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు, రాజ్‌నాథ్‌సింగ్ వంటి సీనియర్ నేతలను కాంగ్రెస్ ఇలాగే అవమానించిందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో తాము పనిచేశామన్నారు. గొప్ప చరిత్ర ఉందని చెప్పుకుంటున్న కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్యంపై ఉన్న గౌరవం ఇదేనా? అసలు కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్యం స్ఫూర్తి ఉందా అని అడిగారు. ఇది కాంగ్రెస్ పార్టీకే సిగ్గుచేటని అన్నారు.

ప్రజా మేనిఫెస్టోకు రూపకల్పన

కన్నడ కాంగ్రెస్ నేతలకు రాహుల్ ఆదేశం



న్యూఢిల్లీ : ప్రజల మేనిఫెస్టోను రూపొందించాల్సిందిగా కర్నాటక కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కోరారు. గుజరాత్ ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రజావసరాలు ప్రాతిపదికగా ఎన్నికల ప్రణాళిక ఉండాలని అన్నారు. ఈ ఏడాది చివరిలో కర్నాటక అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ, ఇతర పార్టీలు అప్పుడే ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. తిరిగి అధికారం నిలుపుకోవడానికి కాంగ్రెస్ విశ్వప్రయత్నం చేస్తుండగా కన్నడ రాష్ట్రంలో పాగా కోసం బీజేపీ తహతహలాడుతోంది. 'కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరప్ప మొయిలీ నాయకత్వంలోని బృందం ప్రజా మేనిఫెస్టో రూపకల్పనలో నిమగ్నమైంది. త్వరలో ప్రజాకర్షక మేనిఫెస్టో రూపొందిస్తాం' అని సీనియర్ నేత ఒకరు చెప్పారు. కర్నాటక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిజమైన మేనిఫెస్టో రూపొందించాలని రాహుల్ ఆదేశించినట్టు ఏఐసీసీ కార్యదర్శి, కర్నాటక ఇన్‌చార్జి మధుయాష్కీ పీటీఐకి చెప్పారు. భాగస్వాము లందరి అభిప్రాయాలు తీసుకుంటున్నామన్నారు. గుజరాత్‌లోనూ ఇదే తరహా కసరత్తు జరిగింది. గుజరాత్‌లోని నాలుగు ప్రధాన నగరాల ప్రజలను టెలికాం దిగ్గజం శ్యామ్ పెట్రోడా కలిసి వారి అభిప్రాయాలకు అనుగుణంగా మేనిఫెస్టో రూపొందించారు. విద్య, ఆరోగ్యం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ఉపాధి కల్పన, పర్యావరణ పరిరక్షణపై మేనిఫెస్టో దృష్టి కేంద్రీకరించింది. ప్రజలు ఏమి కోరుకుం టున్నారో తెలుసుకోవడానికి వారితో సంప్రదింపులు జరుపుతున్నామని మరో నేత అన్నారు.



కేరళలో తొలి ముస్లిం మహిళా ఇమామ్ శుక్రవారం ప్రార్థనలు

తిరువనంతపురం : మొట్టమొదటిసారి ఓ ముస్లిం మహిళా ఇమామ్ శుక్రవారం ప్రార్థనలకు నేతృత్వం వహించిన ఘటన కేరళలో చోటుచేసుకుంది. ఖురాన్ సున్నత్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి 34 ఏళ్ల జమిదా టీచర్ మలప్పురం జిల్లా చెరుకోడ్‌లోని సొసైటీ ప్రధాన కార్యాలయంలో జుమాహ్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలు సాధారణంగా పురుషుల ఆధ్వర్యంలోనే నిర్వహించబడతాయి. ఓ మహిళ ఈ విధంగా చేయడం దేశంలోనే మొదటిసారిగా భావిస్తున్నారు. మహిళలు ఇటువంటి స్థానాల్లో ఉండటం, శక్తిమంతులవడం ఇష్టంలేని కొంతమంది పురుషులు సహించలేరని, ఇలా చేసినందుకు వివిధ గ్రూపులకు చాలామంది పెద్దల నుంచి తాను తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానని జమీదా టీచర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అయితే మతపరమైన హక్కులకు సంబంధించి స్త్రీ, పురుషుల మధ్య ఎటువంటి భేదాలు లేవని అందరూ సమానులేనని ఖురాన్‌లో స్పష్టంగా ఉందని వివరించారు. పురుష ముస్లిం మేధావులే ఇటువంటివి సృష్టించారని విమర్శించారు. కాగా కొన్నేళ్ల క్రితం తిరువనంతపురంలో కొంతమంది జమిదాను బహిష్కరించారు. ఇస్లాంలో పద్ధతులను ప్రశ్నించినందుకు చంపుతామని బెదిరించారు కూడా. 2016లో ఆమె నగరం విడిచిపెట్టి బంధువుల ఇంటి వద్ద ఆశ్రయం పొందవలసి వచ్చింది. అయితే ఖురాన్ సున్నత్ సొసైటీ జమిదాను స్వాగతించింది. ఇస్లాం కేవలం పురుషుల సొంతం కాదని సున్నత్ సొసైటీ విశ్వసిస్తున్నది. ఖురాన్ ప్రకారం పురుషులతో పాటు స్త్రీలకు మతపరంగా సమాన హక్కులు ఉన్నాయని చెబుతున్నది.

ఢిల్లీకి పాకిన 'టిప్పు సుల్తాన్' నిరసనలు

చిత్రపటం ఆవిష్కరణపై బీజేపీ-ఆప్ మాటల యుద్ధం



న్యూఢిల్లీ : కర్ణాటక వ్యాప్తంగా రెండేళ్లుగా ప్రతిధ్వనిస్తున్న 'టిప్పు సుల్తాన్' నిరసనలు ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీకి చేరాయి. 69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్వాతంత్ర్యసమరయోధులు, విప్లవయోధులు సహా 69 ప్రముఖ వ్యక్తులతోపాటు 18వ శతాబ్దపు పాలకుడు టిప్పు సుల్తాన్ చిత్ర పటాన్ని ఢిల్లీ అసెంబ్లీలో ఆవిష్కరించిన తర్వాత ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రతిపక్ష బీజేపీ దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది. "వివాదాస్పద వ్యక్తి" చిత్రపటం అసెంబ్లీలో ఉంచడాన్ని నిరోధించాల్సిందేనని ఆ పార్టీ ఎంఎల్‌ఏ ప్రకాష్ శర్మ అన్నారు. రాజౌరీ బీజేపీ-ఎస్ఏడి ఎంఎల్‌ఏ మజీందర్ సిర్సా మాట్లాడుతూ.. ఢిల్లీకి లేదా దాని చరిత్రకు సంబంధంలేని ఎవరివో చిత్రపటాలు అసెంబ్లీలో పెట్టే బదులు ఢిల్లీకి సేవలందించిన వ్యక్తులు ఎందుకు పెట్టకూడదని ఆప్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాగా బీజేపీ నాయకులు "ఎల్లప్పుడూ వివాదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తుంటారు" అని ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్‌నివాస్ గోయల్ వ్యాఖ్యానించారు. చౌకబారు రాజకీయాలు చేయడం మాని అభివృద్ధి రాజకీయాలపై దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు. "అసెంబ్లీ గ్యాలరీలో టిప్పు సుల్తాన్ చిత్రపటాన్ని చేర్చడాన్ని ఇప్పుడు వారు వ్యతిరేకిస్తున్నారు కానీ రాజ్యాంగంలోని 144 పేజీలో టిప్పు సుల్తాన్ ఫొటో ఉందని నేను వారికి చెబుతున్నా. అందువల్ల దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకులపై పోరాడిన వారు, ఈ రాజ్యాంగాన్ని రచించినవారు వారికి ద్రోహులుగానే కనిపిస్తున్నారు." అని గోయల్ అన్నారు. చిత్రపటం అవిష్కరణ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ప్రజలు సాధారణ జీవితం గడపటానికి వీల్లేని పరిస్థితి కల్పిస్తూ ప్రతిచోటా హింసాత్మక వాతావరణం సృష్టించబడుతోందన్నారు. ప్రజలకు సరైన విద్య, ఆరోగ్య రక్షణ సౌకర్యాల ఏర్పాటుకు మరిన్ని పాఠశాలలు, ఆస్పత్రులు తెరవడం, ధనిక-పేద వర్గాల మధ్య వ్యత్యాసాన్ని పూడ్చడం, మౌలిక వసతులు కల్పించడమే అసలైన దేశభక్తి అని కేజ్రీవాల్ అన్నారు. ఆప్ అధికార ప్రతినిధి, ఎంఎల్‌ఏ సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ... "ఆర్ఎస్ఎస్ లేదా తమ పార్టీ నుంచి స్వాతంత్ర్య ఉద్యమంలో పని చేసిన వారి పేర్లను సూచించాల్సిందిగా మేము బీజేపీని అడిగితే.. వారి ఏ ఒక్కరి పేర్లతో ముందుకు రాలేదు" అన్నారు. కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2015లో టిప్పు సుల్తాన్ జయంతిని నిర్వహించాలని నిర్ణయించడంతో టిప్పు సుల్తాన్‌పై ఆ రాష్ట్రంలో వివాదం ప్రారంభమైంది. బెంగళూరుకు 250 కి.మీ. దూరంలో బీజేపీకి పట్టున్న కొడాగులో వివిధ గ్రూపులు నిర్వహించిన ఆందోళనల్లో ఇద్దరు మృతి చెందారు. గట్టి భద్రతా చర్యలు చేపట్టడంతో తదుపరి రెండేళ్లు రాష్ట్రంలో నిర్వహించిన టిప్పు సుల్తాన్ జయంతి కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి. కానీ ఈ ఏడాది రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో గత సంవత్సరం ఈ అంశం బీజేపీ-కాంగ్రెస్‌ల మధ్య రాజకీయ యుద్ధంగా మారింది. పలువురు బీజేపీ నాయకులు టిప్పు సుల్తాన్ ను హిందూ వ్యతిరేకి , నర హంతకుడని అభివర్ణించగా, దేశంలోని గొప్ప పాలకుల్లో ఒకరిగా, బ్రిటిష్ వారిపై పోరాడిన స్వాతంత్ర్య సమరయోధునిగా కాంగ్రెస్ పార్టీ నమ్ముతున్నది.

నీటి కేటాయింపులు లేకుండా నిధులా



విశాలాంధ్ర-రాయదుర్గం : పేరూరు, బీటీప్రాజెక్టుకు నీటి కేటాయింపులు లేకుండా కేవలం నిధులు కేటాయిస్తే ప్రయోజనం ఏమిటని వైఎస్ఆర్‌సీపీ నేతలు ప్రశ్నించారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలోని వైసీపీ కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డితో కలిసి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. హంద్రీనీవా నుంచి పేరూరు, బీటీ ప్రాజెక్టులకు నీరు తరలింపునకు నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ప్రస్తుతానికి 40 టీఎంసీలు మాత్రమే హంద్రీనీవా నుంచి మనకు వస్తున్నాయని, 70 టీఎంసీలు కేటాయిస్తే తప్ప హంద్రీనీవా నుంచి 6లక్షల ఎకరాలకు నీరు అందే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం హంద్రీనీవా ద్వారా 3,850 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోందని, 7వేల క్యూసెక్కుల నీరు వస్తే తప్ప లక్షలాది ఎకరాలకు నీరు అందే అవకాశం లేదన్నారు. జిల్లాపై చిత్తశుద్ధి ఉంటే కాలువల కెపాసిటీని పెంచాలన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు విజ్ఞతతో ఆలోచించకపోతే పేరూరు, బీటీప్రాజెక్టుకు కేటాయించిన నిధులు నిరుపయోగమయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో వైసీపీ పట్టణ కన్వీనర్ నవీన్, గుమ్మఘట్ట, రాయదుర్గం మండల కన్వీనర్లు కాంతరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

ఏసీబీ వలలో మున్సిపల్ కార్పొరేషన్ డీఈఈ



విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నగరపాలక సంస్థలో డ్రాయింగ్ బ్రాంచ్ డీఈఈ బాల సుబ్రమణ్యం ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా శనివారం ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. 2016 మార్చిలో కాంట్రాక్టర్ అబుబకర్ బాషా టెలికాంనగర్‌లో రూ.45 లక్షల సివిల్ వర్క్సను వేలం పాటలో దక్కించుకున్నారు. ఒప్పందం ప్రకారం పనులను పూర్తి చేసిన ఆయన బిల్లుల మంజూరు కోసం డీఈఈ చుట్టూ తిరుగుతున్నాడు. చిన్నచిన్న కారణాలతో బిల్లులకు క్లియరెన్స్ ఇవ్వకుండా డీఈఈ సాగదీస్తూ లంచం డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో డీఈఈకి రూ.20 వేలు లంచం ఇచ్చేందుకు కాంట్రాక్టర్ ఒప్పుకున్నాడు. ఒప్పందం మేరకు లంచం ఇవ్వాలని డీఈఈ ఒత్తిడి చేస్తున్నాడు. బిల్లులు ఫ్రీజ్ అయ్యాయని, ఏ బిల్లులు కావడంలేదని, చెక్కులు చేతికి అందిన వెంటనే డబ్బు ఇస్తానని చెప్పినా వినకుండా వేధింపులు కొనసాగించడంతో కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ డీఈఈ ఛాంబర్‌లో బాలసుబ్రహ్మణ్యం రూ.15వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ జయరామిరెడ్డి, సీఐలు ఖాదర్‌బాషా, నాగభూషణం కలిసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ దాడిలో ఏసీబీ కానిస్టేబుళ్లు సుల్తాన్‌బాషా, హనుమంతు, బాలరాజు, రంగ పాల్గొన్నారు.



పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : దేశ వ్యాప్తంగా రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వారికి రుణ విమోచన కలిగించాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలోని రాములోరి కళ్యాణ మండపంలో రైతాంగ ప్రయోజనాల పరిరక్షణ సదస్సు శనివారం జరిగింది. మాజీ మంత్రి, రైతాంగ రక్షణ వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడారు. నవంబర్ 20న దేశ వ్యాప్తంగా 146 రైతుసంఘాలు పాల్గొన్న కిసాన్ ముక్తి యాత్ర, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రైతుల (వ్యవసాయ ఉత్పత్తికి గిట్టుబాటు ధర హక్కుగా అందడం) బిల్లు-2017పై దేశ వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. తద్వారా రైతాంగంలో చైతన్యాన్ని తీసుకువచ్చి ఈ బిల్లును ఆమోదించేలా కేంద్రంపై వత్తిడి తీసుకురావాలన్నారు. కాల్పులతో రైతుల ఉద్యమాన్ని అణచివేయాలని ఒకవైపు ప్రభుత్వం చూస్తుంటే, మరో వైపు పంట నష్టపోయి రైతాంగం ఆత్మహత్యల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలకు కంపెనీల ప్రయోజనాలు తప్ప రైతాంగ ప్రయోజనాలు పట్టడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి పి.లక్ష్మణరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీప్రసాదు, హైకోర్టు న్యాయవాదులు పొన్నవోలు సుధాకరరెడ్డి, సీహెచ్.రవికుమార్, రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షుడు ఎర్నేని నాగేంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు ఎంవీఎస్.నాగిరెడ్డి, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పూల పెద్దిరెడ్డి, అధ్యక్షులు కేశవరావు, రైతు కూలీ సంఘం నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఏపీ రాజధాని రైతు-రైతు కూలీ సంఘం హక్కుల సమితి నాయకులు అనుమోలు గాంధీ, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముసునూరు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోనే ధాన్యం రాశులు

- ప్రభుత్వ కొనుగోళ్లలో గందరగోళం
- కృష్ణా అన్నదాతల్లో అయోమయం
- పొలాల్లోకి వెళ్లాలంటూ అధికారులకు కలెక్టర్ అదేశాలు



విశాలాంధ్ర - విజయవాడ : అన్నదాతలను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం విక్రయించుకోవడానికి తిప్పలు తప్పడం లేదు. ధాన్యం కొనుగోళ్లలోని ఇబ్బందులను తొలగించాలంటూ స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాలేదు. అయోమయంలో చిక్కుకున్న రైతులు ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచి కాపలా కాచుకోవాల్సిన దుస్థితి కృష్ణాజిల్లాలో నెలకొంది. ధాన్యం కొనుగోలు వ్యవహారం ఎప్పటికి సరళతరమవుతుందనే అంశం రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. గత 15 రోజులుగా జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను మిల్లర్లు, వ్యాపారులు నిలిపివేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వింత పరిస్థితి తలెత్తడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ-క్రాప్‌లో భూమి వివరాలు నమోదు అయి ఉంటేనే ధాన్యం కొనుగోలు చేస్తామని, నగదు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నిబంధన కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు చేసినా రైతులకు నగదు చెల్లింపులు నిలిచిపోయాయి.

4.80 లక్షల టన్నులే కొనుగోలు

ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 5.11 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 13.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. డిసెంబరులో వరి కుప్పల నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. జనవరి మొదటివారం వరకు ధాన్యం కొనుగోళ్లు సక్రమంగానే సాగాయి. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల ద్వారా 8.56 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం నిర్దేశించుకుంది. ఇప్పటివరకు 4.80 లక్షల టన్నులు కొనుగోలు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ధాన్యం కొనుగోలు చేసిన మిల్లర్లు, వ్యాపారులు ఈ-క్రాప్ ఆధారంగా కాకుండా తమ చిత్తానుసారం రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో పెట్టి విక్రయించినట్లు చూపారు. ఆన్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు వివరాల్లో తప్పులు ఉండటంతో గమనించిన అధికారులు మిల్లర్లపై 50కి పైగా కేసులు నమోదు చేశారు. దీంతో తాము కొనుగోలు చేయబోమని మిల్లర్లు భీష్మించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి నేరుగా స్పందిస్తూ పరిస్థితిని చక్కదిద్దాలంటూ ఆదేశించినా ఆన్‌లైన్‌లో ఈ- క్రాప్ నిబంధనలు సడలించకపోవడంతో పరిస్థితి యథాతథంగానే కొనసాగుతోంది. ధాన్యం కొనుగోలు చేసినా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కాకుండా జాప్యమవుతోంది.

వీఆర్వో ధ్రువీకరణ పత్రాన్ని పరిగణనలోకి తీసుకోండి

ఈ-క్రాప్‌లో అసైన్డ్ భూముల వివరాలు నమోదు కాకపోవడంతో ఆయా రైతులు పండించిన పంట కొనుగోలుకు, నగదు చెల్లింపులకు ఆన్‌లైన్‌లో నిబంధనలు అడ్డుగా మారాయి. కౌలు రైతు ధాన్యం విక్రయిస్తే నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమకాకపోవడం సమస్యగా మారింది. జిల్లాలో 1.64 లక్షల మంది కౌలు రైతులు 3.50 లక్షల ఎకరాలను సాగుచేస్తున్నారు. కౌలు రైతుల ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వీఆర్వో అసైన్డ్ భూముల రైతులు, కౌలు రైతుల భూముల వివరాలతో కూడిన ధ్రువీకరణ పత్రాన్ని పరిగణనలోకి తీసుకుని ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పొలాల్లోకి వెళ్లండి - కలెక్టర్ బి. లక్ష్మీకాంతం

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రత్యేక అధికారులు పొలంలోకి వెళ్లి కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బి.లక్ష్మీకాంతం శనివారం ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని సూచించారు. నగదు జమలో జాప్యం జరిగితే వెంటనే అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు రూ. 633 కోట్లు చెల్లించినట్టు వివరించారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు

విశాలాంధ్ర- అనంతపురం టౌన్ : సమాజంలో అభివృద్ధి చెందిన వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రక్రియను ఉపసంహరించు కోవాలని గిరిజన సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం గిరిజన శంఖారావం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన గిరిజన సంఘం నేత వడిత్య శంకర్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులకు దక్కాల్సిన సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నీరుగారుస్తున్నారన్నారు. కుల, మత రాజకీయాలు చేస్తూ వారి మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది గిరిజనుల స్థితిగతులు, జీవన విధానంపై దృష్టి సారించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన 25 హామీల్లో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. గిరిజన ఓట్లతో గెలిచిన మంత్రి కాలవ శ్రీనివాసులు వారికే వెన్నుపోటు పొడిచారన్నారు. మళ్లీ ఓట్ల కోసం ఇళ్ల వద్దకు వస్తే బట్టలు ఊడదీసి కొడతామని హెచ్చరించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. నగర డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, బంజారా నాయకులు కేశవ నాయక్, పీవీరమణ, మాజీ వైస్ చైర్మన్ వెంకటరాముడు, పారిశ్రామిక వేత్త రమేష్‌నాయక్, జీవీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున నాయక్, జీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు శివశంకర్ నాయక్ పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌హెచ్ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షునిగా అచ్చిరెడ్డి



విశాలాంధ్ర-విజయనగరం మున్సిపాలిటీ : జాతీయ మానవహక్కుల సంస్థ (ఎన్ఎఫ్‌హెచ్ఆర్‌సీ) ఏపీ రాష్ట్ర అధ్యక్షునిగా సత్తి అచ్చిరెడ్డి నియమితులయ్యారు. విశాఖలోని రేసపువాని పాలెంలో సంస్థ కార్యాలయంలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి కోర్ కమిటీ సభ్యుల సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ బీజీఎం రెడ్డి నుంచి ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం అచ్చిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత రెండేళ్లుగా విజయనగరం జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించిన తన హయాంలో 300 కేసులు పరిష్కరిం చినట్లు చెప్పారు. మానవహక్కులకు ఎక్కడ భంగం వాటిల్లినా బాధితు లకు అండగా నిలబడి, అధికారుల సహాయంతో వారికి న్యాయం జరిగేవరకు పోరా డుతున్నామన్నారు. రాష్ట్రంలో ఎవరికి, ఎక్కడ అన్యాయం జరిగినా తమ దృష్టికి తీసుకువస్తే బాధితులకు న్యాయం జరిగేవరకూ ఉచితంగా సేవలందిస్తామని అచ్చిరెడ్డి చెప్పారు.

జాతీయ వైద్య విద్యలో సమూల మార్పులు

గీతంలో మెడికల్ ఎడ్యుకేషన్ ఏడీజీ వెల్లడి



విశాలాంధ్ర-విశాఖపట్నం : జాతీయ వైద్య విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకొస్తున్నట్లు భారత ప్రభుత్వ వైద్య విద్యా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్, నీట్ ప్రవేశ పరీక్షల ప్రధాన అధికారి డాక్టర్ బి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలోని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చి ఆధ్వర్యంలో శనివారం వైద్య కళాశాల వార్షిక వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్య విద్యార్థులనుద్దేశించి శ్రీనివాస్ ప్రసంగిస్తూ వైద్య విద్యలో థియరీ కంటే క్లినికల్ శిక్షణకు అధిక ప్రాధాన్యత ఇచ్చేలా సిలబస్‌ను మార్పుచేస్తున్నామన్నారు. యువతరం వైద్యవృత్తిలో నిపుణతను పెంచుకోవడంతోపాటు సామాజిక బాధ్యతగా వృత్తిని చేపట్టడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో జాతీయ వైద్యామండలి (నేషనల్ మెడికల్ కౌన్సిల్) ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలను ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ వైద్యవిద్యా విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.బాబ్జి, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎంఎస్ ప్రసాదరావు వైద్యరంగంలో రోజురోజుకు మారుతున్న సాంకేతిక అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో గీతం వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్పీ రావు, గీతం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయప్రకాష్ బాబు, కార్యక్రమ నిర్వాహకకార్యదర్శి ప్రొఫెసర్ జి.సుబ్బారావు, గైనకాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఎస్వీ వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. వైద్యవిద్యార్థులు ప్రదర్శించిన మహాభారతంలోని పలు ఘట్టాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



31న శ్రీవారి ఆలయం మూసివేత

విశాలాంధ్ర - తిరుమల : చంద్రగ్రహణం నేపథ్యంలో ఈ నెల 31వ తేదీ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఆలయ తలుపులు మూసివేయడంతో శ్రీవారి దర్శనం ఉండదని టీటీడీ జేఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనవరి 31న సాయంత్రం 5.18 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై రాత్రి 8.41 గంటలకు పూర్తవుతుందన్నారు. గ్రహణ సమయానికి 6 గంటలు ముందుగా ఆలయ తలుపులు మూసివేస్తామన్నారు. రాత్రి 9.30 గంటలకు తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం, రాత్రి కైంకర్యాలు నిర్వహిస్తారన్నారు. ఆ తరువాత రాత్రి 10.30 నుంచి 12 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం ఉంటుందన్నారు. వీఐపీ బ్రేక్ దర్శనాన్ని ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేస్తామన్నారు. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు, దివ్యదర్శనం టోకెన్ల జారీని నిలిపివేస్తామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేసినట్టు వెల్లడించారు. ఆర్జితసేవలైన సహస్ర కలశాభిషేకం, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను రద్దు చేశామన్నారు. భక్తులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకోవాలని జేఈవో కోరారు.



కనుల పండువగా బైబిల్ మిషను మహోత్సవాలు

విశాలాంధ్ర-పెదకాకాని : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురు ప్రాంగణంలో బైబిల్ మిషను 80వ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే ఉత్సవాలకు మిషన్ అధ్యక్షులు రెవ డాక్టర్ ఎస్.సత్యానందం అధ్యక్షత వహించారు. శామ్యేల్ కిరణ్ మాట్లాడుతూ విశ్వాసులతో వేడుకగా కొనసాగుతాయన్నారు. తొలి రోజు కె.రవీంద్ర, వీవీఐటి విద్యాసంస్థల అధినేత వి.విద్యాసాగర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి 8 లక్షల మంది తరలి వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

జానపద కళలతోనే తెలుగు భాషా వికాసం



విశాలాంధ్ర-తెనాలి : ప్రాచీన జానపద కళలతోనే తెలుగు భాషా వికాసం సాధ్యమని, నాటి జానపద కళలు కనుమరుగయ్యే పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వాలు కృషి చేయా లని సాహితీవేత్త కర్నాటి లక్ష్మీనరసయ్య వివరించారు. గుంటూరుజిల్లా తెనాలిలో రామకృష్ణ కవి కళాక్షేత్రం వేదికపై తెలుగు సాహిత్య మహోత్సవాల్లో రెండవ రోజు శనివారం 'భాషా వికాసం, సాహితీ ప్రక్రియలు' అంశంపై సదస్సు నిర్వహించారు. కె.ఆదెయ్య సభా పరిచయం చేయగా కె.శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో టి లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ వెయ్యి ఉపన్యాసాల కంటే ఒక జానపద కళారూపం ద్వారా తెలుగు భాష అవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్ళడం సులభమన్నారు. కోలాట పాటలు, జానపద కళల వికాసంలో భాగమని, జానపద కళల ఉద్ధరణకు పెద్దలు పూనుకోవాలన్నారు. తెలుగు నవలలు అంశంపై సీవెస్ రావు మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యం కృష్ణా, గోదావరి జిల్లాల్లో వెలివిరిసిందన్నారు. పాలక భాషగా ప్రభావితం చేసిందన్నారు.ఆధునిక కవితా ధోరణులు అంశంపై నగ్నముని మాట్లాడుతూ ఆంగ్ల భాషలో విమర్శకు కూడా ఒక కోర్సు ద్వారా కొంత మంది నిష్ణాతులు ఉంటారని, ఆ లోటు వలనే తెలుగు భాష వికాసం లోపిస్తుందన్నారు. తెలుగు సినిమా నాడు నేడు అంశంపై సినీ దర్శకులు ధవళ సత్యం మాట్లాడుతూ తన జీవిత ప్రస్థానం ప్రజానాట్య మండలి నుండి ప్రారంభమైందని, సమాజ చైతన్యం ప్రజానాట్య మండలి లక్ష్యంగా వివరించారు. అభ్యుదయ సినిమా అతి కొద్ది కాలంలో తన ఉనికి చాటుకోగలిందన్నారు. నేటి సినిమా ద్వారా పొందే సామాజిక ప్రయోజనం ఏమీ లేదన్నారు.తెలుగు నాటకం పూర్వాపరాలు అనే అంశంపై కందిమళ్ళ సాంబశివరావు విశ్లేషించారు. జాతిని జాగృతం చేసేది, ప్రతిబింబించేదని నాటకం అని, చిటికెడు వినోదం, పిడికెడు విషాదం, దోసెడు సందేశం వెరశి నాటకమన్నారు.

తెలుగు సాహితీ కళా చారిత్రక వైభవం అంశంపై డాక్టర్ మొదలి నాగభూషణశర్మ అధ్యక్షతన వల్లభనేని అశ్వినీకుమార్, కాండ్రేవుల నాగేశ్వరరావు, ఈమని శివనాగిరెడ్డిలు ప్రసంగించారు. తెలుగు చారిత్రక వైభవం గ్రంథావిష్కరణ గావించారు. ముత్తేవి రవీంద్రనాథ్ కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్.తపస్వి, చిలువూరి సురేష్, రమేష్, వెనిగళ్ళ నారాయణ, నేతిపరమేశ్వరశర్మ తదితర ప్రముఖులను ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ సత్కరించారు. ఆహ్వాన కమిటీ నిర్వాహకులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

డిసెంబర్ నాటికి తారకరామ తీర్థసాగరం



విశాలాంధ్ర-నెల్లిమర్ల : వచ్చే డిసెంబరు నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టును పూర్తిచేసి విజయనగరం జిల్లా రైతుల కల నెరవేరుస్తామని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహే శ్వర రావు చెప్పారు. ఈ ప్రాజెక్టుతో విజయనగరం పట్టణానికి ఇరవై నాలుగు గంటలూ నీరు అం దిస్తామన్నారు. విజయనగరం జిల్లాలో శనివారం పర్యటించిన ఆయన నెల్లిమర్ల మండలం సారిపల్లి వద్ద తారకరామ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు, కె.ఎ.నాయుడు, మీసాల గీత, కలెక్టర్ వివేక్ యాదవ్‌తో కలిసి పనుల పురోగతి, ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల ప్రజలకు సహాయం తదితర అంశాలపై జలవనరులశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా ఈ ప్రాజెక్టు కోసం రూ.250 కోట్ల ఆర్థిక సాయం అందిస్తోం దన్నారు. నిధుల సమస్య ఇక లేదన్నారు. జిల్లాకు గుండెకాయ వంటి ఈ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. నిర్మాణ సంస్థలు తమ ఇష్టారాజ్యంగా పనులు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. తాను ప్రాజెక్టు సందర్శనకు వస్తే సంస్థ యాజమాన్యం నుంచి ఉన్నతస్థాయి వ్యక్తులు హాజరుకాకుండా కిందిస్థాయి ప్రతినిధులను పంపించడంపై ఆగ్రహించారు. ని. ఈ నెల 29న అమరావతిలో చీఫ్ ఇంజనీర్ వద్ద సంబంధిత ఇంజనీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు చర్చించనున్నామన్నారు. ఇకపై ప్రతివారం తారకరామ తీర్థసాగరంపై సమీక్ష వుంటుం దన్నారు. తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా ఈ ఏడాది రెండోపంటకు నీరిచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ ఆర్.పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ సీజ్‌పై న్యాయపోరాటం

- జర్నలిస్టుల భారీ ప్రదర్శన, మానవహారం
- విజయనగరం కలెక్టర్ చర్య అప్రజాస్వామికం

ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నేతలు



విశాలాంధ్ర-విజయనగరం మున్సిపాలిటీ : విజయనగరం ప్రెస్‌క్లబ్ విషయంలో జిల్లా కలెక్టర్, డీపీఆర్వోలు అత్యుత్సాహంతో అప్రజాస్వామికంగా వ్యవహరించారని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నల్లి ధర్మారావు, ఐవీ సుబ్బారావు, ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కలెక్టర్ ఆదేశాలతో సీజ్‌చేసిన ప్రెస్‌క్లబ్‌ను తిరిగి తెరిపించి యూనియన్‌కు అప్పగించాలని కోరుతూ శనివారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం నుండి కలెక్టరేట్ వరకూ ప్రదర్శనగా వచ్చి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ ఒక జర్నలిస్టు కాల్వ శ్రీనివాసులు రాష్ట్ర సమాచారశాఖ మంత్రిగా జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడుతుంటే వారికే చెడ్డపేరు తెచ్చేలా కలెక్టర్ యత్నించడం శోచనీయమన్నారు. ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఐజేయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నాటి నుంచి సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏపీయూడబ్ల్యూజే కార్మిక సంస్థ అని, చట్టపరంగా నడుస్తున్న యూనియన్ పట్ల జిల్లా అధికారుల వ్యవహారశైలి దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలోని ప్రెస్‌క్లబ్‌లన్నీ ఏపీయూడబ్ల్యూజే ఆస్తులేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవాలని సూచించారు. ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ దశాబ్దాలుగా జర్నలిస్టులకు సేవలు అందిస్తూ ఏపీయూడబ్ల్యూజే ప్రాయోజితమైన ప్రెస్‌క్లబ్‌ను జిల్లా అధికారులు కుట్రపూరిత ధోరణితో చట్టాలకు అతీతంగా ఏకపక్షంగా రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారన్నారు. కలెక్టర్ నిర్ణయాన్ని న్యాయపరంగా ఎదుర్కోవడం కోసం రాష్ట్రస్థాయిలో జిల్లా కలెక్టర్ తీరును ఎండగడతామన్నారు.

ప్రెస్‌క్లబ్ సీజ్ విషయం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విస్మయం వ్యక్తం చేశారన్నారు. జిల్లా జర్నలిస్టులంతా సంఘటితంగా కదిలిరావడం శుభపరిణామ మన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ఐజేయూ కార్యవర్గ సభ్యులు దిమిలి అచ్యుతరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు చందు జనార్దన్, సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షులు వి.మహాపాత్రో, రాష్ట్ర నాయకులు పీఎస్ఎస్‌వీ ప్రసాద్ (శివ), రాధాకృష్ణ, వైఎస్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

- పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న వైనం
- ఇద్దరికీ తీవ్ర గాయాలు
- కృష్ణాజిల్లాలో ఘటన

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెళ్లికి పెద్దలు అంగీకరించలేదన్న కారణంతో ఓ ప్రేమజంట ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న ఘటన శనివారం కృష్ణాజిల్లాలో చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెనుగంచిప్రోలు సమీపంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టిం చింది. పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామానికి చెందిన దరావత్ వెంకటేశ్వర్లు కుమారుడు సాయి(17) పెనుగంచిప్రోలులోని పశువుల ఆస్పత్రి ఎదురుగా ఉన్న నూడుల్స్ బండి వద్ద పని చేస్తుంటాడు. అతనికి తెలంగాణలోని సూర్యాపేట జిల్లా దమ్మచర్లకు చెందిన దారావతు చిన్నా కుమార్తె సునీతతో కొద్దికాలం క్రితం పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే, వరుసకు అన్నాచెల్లెళ్లు అవుతా రంటూ పెద్దలు వారి పెళ్లికి అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి గురైన సాయి, సునీత తాము కలిసి జీవించలేమని, కలిసే చనిపోవాలని నిర్ణ యించుకున్నారు. ఈ మేరకు శనివారం మధ్యా హ్నం పెనుగంచిప్రోలు చేరుకున్నారు. పెట్రోలు తీసుకుని పెనుగంచిప్రోలు సమీపంలోని లింగ గూడెం నుంచి గౌరవరం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న సుబాబుల్ తోటలోకి చేరుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇద్దరూ తమ ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నారు. మంట లకు తాళలేక కేకలు వేయడంతో సమీపంలోని పొలాల్లో ఉన్నవారు వచ్చి మంటలు ఆర్పారు. అయితే, అప్పటికే ఇద్దరి శరీరాలపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న సాయి, సునీతను జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ పంపారు. స్థానిక ఎస్ఐ అవినాష్ ఘటనాస్థలిలో వివరాలు సేకరించారు. సాయి, సునీత నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మహాసభలో మాట్లాడుతున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు పక్కన జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి తదితరులు

ఖరీదైపోయిన విద్య, వైద్యం

సీపీఐతోనే పేదల రాజ్యం

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : ఎన్నికల వాగ్దానాలను అమలు పరచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ గుంటూరు నగర 23వ మహాసభలు శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. తొలుత గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి డప్పులు, టపాసుల మోతతో జిన్నాటవర్, పాత బస్టాండు, ఎన్టీఆర్ బొమ్మ సెంటర్, బి.ఆర్.స్టేడియం మీదుగా పాతగుంటూరు జెండా చెట్టు వరకు ప్రదర్శన కొన సాగింది. అనంతరం జెండా చెట్టు వద్ద సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిధిగా హాజరైన ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ 100 రోజులలో ధరలు తగ్గిస్తాం, విదేశాలలో దాచిన ధనాన్ని వెనక్కు తీసుకువస్తామంటూ చేసిన ఎన్నికల వాగ్దాలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. విద్య, వైద్యం, నిత్యావసరాలు ఖరీదైపోతున్న పరిస్థితుల్లో ప్రజలపై మరింత భారాలు మోపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు గని మాట్లాడుతూ సాంకేతిక మాధ్యమాలతో యువత తమ విలువైన సమయాన్ని వృధా చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

ఏపీకిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

కొణతల రామకృష్ణ



విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : ఆంధ్రప్రదేశ్ పునర్వవస్థీకకరణ-2014 చట్టం ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక హోదా,ఆరు నెలల్లో కొత్త రైల్వేజోన్, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు నిధులు వంటి అనేక హామీల అమలులో కేంద్రం ఘోరంగా వైఫల్యం చెందిందని ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతల రామకృష్ణ తెలిపారు. పై డిమాండ్లతో ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతల రామకృష్ణ చేపట్టిన రైలు దీక్ష శనివారం విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఆయనకు మద్దతుగా సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్‌తోపాటు సీపీఎం,వైసీపీ,కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు సంఘీభావం తెలిపారు. ప్రత్యేక హోదా వస్తే వేలాది పరిశ్రమలు, లక్షలాది ఉద్యోగాలు మనకు రావడం ఖాయమన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, ఎంపీలు ఢిల్లీలో పెద్దలు చెప్పినట్లు వింటూ, గంగిరెద్దుల్లా తలలాడిస్తూ స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని పణంగా పెడుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం జరగనున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశల్లో కనుక మనకు న్యాయం జరగకపోతే ఇక ఎప్పటికి మనకు న్యాయం జరగదన్నారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా అందరూ ఏకతాటిపైకి వచ్చి రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎలుగెత్తి చాటాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

టీచర్లపై లైంగిక వేధింపులు

- మదనపల్లె జెడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్ నిర్వాకం
- అసభ్యంగా ప్రవర్తిస్తూ, సెల్‌ఫోన్ మెసేజ్‌లు పంపుతున్న వైనం
- అతనిపై దాడికి యత్నించిన మహిళా ఉద్యోగి బంధువులు
- జూ.అసిస్టెంట్‌ను బదిలీ చేయకపోతే సహించం : సిబ్బంది
- తరగతి గదుల్లో మాస్టారి మద్యం సేవనం



విశాలాంధ్ర-మదనపల్లె : మదనపల్లె ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులపై, మహిళా సిబ్బందిపై అక్కడ పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, సెల్‌ఫోన్ మెసేజ్‌లతో వేధింపులకు పాల్పడుతున్న వైనం వెలుగుచూసింది. మహిళా సిబ్బంది ఇన్ని రకాలుగా వేధింపులు ఎదుర్కొంటున్నా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పాఠశాలలోని సహచర మహిళా ఉద్యోగినిపై జూనియర్ అసిస్టెంట్ లైంగికంగా వేధిస్తూ అసభ్య పదజాలంతో మెసేజ్‌లు పంపిస్తూ తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాడు. దీన్ని గుర్తించిన మహిళా ఉద్యోగి బంధువులు పాఠశాలకు చేరుకొని ఆవరణలో జూనియర్ అసిస్టెంట్‌పై శనివారం దాడికి ప్రయత్నించారు. అయితే అక్కడ పని చేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు అడ్డుకున్నారు. దీంతో వేధింపులకు పాల్పడుతున్న జూనియర్ అసిస్టెంట్‌ను సరండర్ చేయాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో సిబ్బందితో ప్రధానోపాధ్యాయుడు రెడ్డన్నశెట్టి సమావేశమై జూనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇదిలాఉండగా జూనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోకపోతే మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందిపై మరింత కక్ష సాధింపు చర్యలకు పాల్పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతనిని బదిలీ చేయకపోతే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు.

పిల్లల కోడిగుడ్లను దిగమింగేస్తున్నారు..

ప్రభుత్వం ఉన్నత ఆశయంతో విద్యార్థులకు పౌష్టికాహారంగా భోజనంతో పాటు కోడిగుడ్లను అందిస్తున్నారు. విద్యార్థులకు పెట్టాల్సిన కోడిగుడ్లను ఉపాధ్యాయులే దిగమింగుతూ విద్యార్థుల పొట్టలు కొడుతూ ప్రభుత్వ ఆశయానికి నీరుగారుస్తున్నారు. ఇదే పాఠశాలలోని మరొక ఉపాధ్యాయుడు రోజూ పీకలదాకా మద్యం సేవించి విధులకు హాజరవు తున్న వైనం విద్యార్థులను, సహచర సిబ్బందిని ఆందోళనకు గురి చేస్తోంది. పాఠ్యాం శాలు సక్ర మంగా బోధించకుండా విద్యార్థులను బెదిరిస్తున్నా డని, దీనిపై ప్రధానోపాధ్యా యుడి పర్యవేక్షణ లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో మహిళా ఉద్యోగులపై వేధింపులు, అవినీతి జరగకుండా చర్యలు చేపట్ట వలసిన అవసరం ఉందని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

సూర్యారాధనతో ఆరోగ్యం : సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-అమరావతి : ఆరోగ్యం కోసం సూర్యారాధన కార్యక్రమంచేపట్టామని సీఎం అన్నారు. ప్రజలందరూ ప్రకృతితో మమేకం కావాలని, ప్రకృతిని ఆరాధించి, ప్రేమించాలని చంద్రబాబు అన్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు విజయవాడలో సూర్య ఆరాధన కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో, అన్ని గ్రామాల్లో అదే సమయానికి పవిత్రమైన మనసు, పరిశుభ్రతతో సూర్య నమస్కారాలు చేయాలని రాష్ట్ర ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇకపై ప్రతి ఏడాది రథసప్తమి రోజున గానీ లేక ఆ తరువాత వచ్చే మొదటి ఆదివారం (సూర్యుని ఇష్టమైన రోజు) గానీ ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సైన్సుపరంగా సూర్యుడుకి ప్రాముఖ్యత ఉందని, అందరికీ డీ విటమిన్ అందిస్తారని తెలిపారు.సూర్యుడనేది వాస్తవం అని అందువల్లే సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ అనే పేరు ఖరారు చేసినట్లు చెప్పారు.

ఒలింపిక్స్ నిర్వహించే సత్తా ఉంది

అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నీ ప్రారంభంలో సీఎం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : క్రీడలకు పెద్ద పీట వేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిష్టాత్మకమైన ఒలింపిక్స్‌ను నిర్వహించే సత్తా ఉందని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. అన్ని జిల్లాల్లోనూ అంతర్జాతీయ క్రీడా సౌకర్యాలు కల్పించే దిశగా 2017-22 నూతన క్రీడా విధానాన్ని ప్రటించామని, భవిష్యత్‌లో ఒలింపిక్స్‌ను రాష్ట్రంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. భారత్ కంటే చిన్న దేశాలు సైతం ఒలింపిక్స్ నిర్వహణకు పోటీ పడుతున్న తరుణంలో, వాటిని మించి పోటీలను నిర్వహించే సత్తా దేశానికి ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేవిధంగా 30 స్టేడియాలు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఉన్నాయన్నారు. విజయవాడకు సమీపంలోని ఇబ్రహీంపట్నం మూలపాడులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) స్టేడియంలో అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్‌ను సీఎం చంద్రబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 18 రాష్ట్రాలు, అనంతరం ఆయన మాట్లాడుతూ, తాను సీఎంగా ఉన్నపుడే జాతీయ క్రీడలు, ఆఫ్రో ఆసియా క్రీడలు, మిలటరీ క్రీడలను నిర్వహించామని, ఆ తర్వాత ప్రభుత్వాలు క్రీడలను నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. రాష్ట్రంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రతి జిల్లాల్లోనూ స్టేడియాలను ఏర్పాటు చేస్తోందని, గుంటూరు జిల్లా మంగళగిరిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం మరో ఆరు నెలల్లో సిద్ధమవుతుందని, ఇకపై అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లను ఆ స్టేడియంలో నిర్వహించే అవకాశం ఉందన్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలో ఒలింపిక్స్ నిర్వహించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. జన్మభూమి మా ఊరు గ్రామ సభల్లో నిర్వహించిన క్రీడా పోటీలు ప్రపంచ రికార్డును సృష్టించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 16 వేల గ్రామ పంచాయతీల్లో క్రీడా పోటీలు నిర్వహించామని, వాటిలో 71 లక్షల మంది పాల్గొన్నట్లు చెప్పారు. మరో పది రోజులలో ఈ రికార్డును నమోదు చేయనున్నట్లు తెలియజేశారు. భారత్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సాధించినపుడు గచ్చిబౌలీలో ఐదు ఎకరాల స్థలం కేటాయించానని, ఫలితంగా నేడు సైనా నెహ్వాల్, పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ వంటి స్టార్ క్రీడాకారులు తయారైనట్లు చంద్రబాబు తెలిపారు. దేశంలోనే గర్వించదగిన పద్మశ్రీ అవార్డు శ్రీకాంత్‌కు లభించిందన్నారు.

జీతం మూరెడు.. చాకిరిబారెడు...

బోరుమంటున్న ఈ-ఆఫీసు ఉద్యోగులు

విశాలాంధ్ర, అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు సాంకేతిక పరిజ్ఞానానికి ఈ- ఆఫీసు ఉద్యోగులను ఆయువుపట్టుగా చెప్పుకోవాలి. ఏ ఫైల్ కదలాలన్నా , నిలిపివేయాలన్నా ప్రభుత్వం ఆదేశాలను అమలుపరచడంలో వారే ప్రధాన పాత్ర పోషిస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే సౌకర్యాలు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ఉండనే ఉండవు. దీంతో కుటుంబాలతో అనేక అవస్థలు పడుతూ, ఐందెడు చాకిరీతో శ్రమకు తగిన జీతాలు లేక సతమతమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో పాలనాపరమైన సాంకేతిక అంశాలను వీరే అన్నీ తామై ముందుండి నడిపిస్తుంటారు. కానీ వారిని పట్టించుకునే వారే లేరు. రాష్ట్ర విభజనాంతరం చంద్రబాబు తీసుకున్న కీలక నిర్ణయాలలో కాగితరహిత పాలన ఒకటి. అందులో భాగంగానే ఈ-ఫైలింగ్ వ్యవస్థను ఏర్పాటుచేసి పాలనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు.



2014 డిసెంబర్ నుంచి..

రాష్ట్ర వ్యాప్తంగా 2014 డిసెంబరు నుంచి ఈ ఫైలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ఎలక్ట్రానిక్ సమాచార శాఖ పేరుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థలో వీరంతా ఫైళ్ల కదిలికలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంటారు. మొత్తం 70 మంది సిబ్బందికి గానూ ప్రతిజిల్లాకు నలుగురు చొప్పున విధులు నిర్వహిస్తుండగా.. రాష్ట్ర పాలనకు కీలకమైన వెలగపూడి సచివాలయంలో 24 మంది ఈ-ఫైలింగ్‌లో పనిచేస్తున్నారు. వీరిలో 12 మంది పురుషులు. 12 మంది మహిళలు ఉన్నారు. ప్రత్యేక విభాగం ఏర్పాటుచేసి మరీ పనిచేస్తున్నప్పటికీ వీరికి ఏ విధమైన ప్రాధాన్యం లేకపోవడం శోచనీయం.

ఏ ఫైల్ కదలాలన్నా..

పాలనాపరమైన ఏ ఫైల్ కదలాలన్నా ఈ 70 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులదే కీలకపాత్ర . ఒక అధికారి ఉన్నతాధికారిగా ప్రమోషన్ పొందినా, మరో అధికారి బదిలీ జరిగినా ఒక సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు ఫైలు వెళ్లాలన్నా అటెండర్ నుంచి ఐఏఎస్ అధికారి వరకు ప్రభుత్వం చేపట్టే ప్రతి పని కంప్యూటరీకరణ చేసేది వీరే. మూడేళ్లుగా రూ.12,500వేల జీతంతో నెలకు చేతికి రూ.10,780 తీసుకుంటూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగంలో పనిచేసే కేటలాగ్ సొల్యూషన్స్ సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా ఈ-ఫైల్స్ నిర్వహణలో సేవలు అందిస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్‌లో పనిచేసే వారికి జీతాలు రెండునెలలకొకసారి వస్తున్నాయని. దీంతో ఆర్థిక ఇబ్బందులు మరింత ఎక్కువవయ్యాయంటూ మథనపడుతున్నారు. తాము అందించే సర్వీసులు గురించి అందరూ ప్రశంసిస్తున్నా జీతాలు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. విధుల్లో చేరిననాడు సంవత్సరానికి 26 శాతం వేతనం పెంచుతామని హామీ ఇచ్చారని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే హామీల విషయమై అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తే పట్టించుకునేవారే కరువయ్యారని వాపోతున్నారు. విధులు నిర్వహించే వారిలో 70 మంది బీటెక్, పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వారు ఉండటం గమనార్హం. అధిక శాతం వివాహితులు ఉండడంతో కుటుంబ పోషణకు వేతనాలు సరిపోక, విధులు మానుకోలేక నానా అగచాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత ఉద్యోగులుగా గుర్తించే హామీ లేనప్పటికీ గడిచిన మూడేళ్ల కాలంలో 78 శాతం జీతం పెరగాలని అన్నారు. అందులో 10 శాతం కూడా పెరగలేదని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన మాదిరిగా ప్రతినెలా తమ వేతనాలు సక్రమంగా అందించి, పెరిగిన ఖర్చులను దృష్టిలో ఉంచుకొని జీతాలు పెంచాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా : జగన్



విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో : తమ ప్రభుత్వం నెలకొల్పిన తర్వాత జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జగన్ తన పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ చిన్నపత్రికల జర్నలిస్టు సంఘం ప్రతినిధుల సమస్యలపై జగన్‌కు వినతి పత్రం సమర్పించగా ఆయన పై విధంగా స్పందించారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, స్థానిక చిన్న పత్రికలకు ప్రతి నెలా రూ.10 వేల విలువైన ప్రకటనలు ఇవ్వాలని, తమకూ హెల్త్ కార్డులు అందజేయాలని, పిల్లలకు ఉచిత విద్య అందేలా వారు కోరారు. సగటూరులో ప్రారంభమైన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర 72వ రోజు శనివారం చిలమాను చేను క్రాస్ రోడ్స్, గుర్రంకొండ, ఆర్మేనుపాడు, కాండ, వెంకటేశుపల్లి మీదుగా తిమ్మసముద్రం క్రాస్ రోడ్స్ వరకు కొనసాగింది. అనంతరం గూడూరు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. పాదయాత్రలో గుర్రంకొండ, ఆర్మేసుపాడు వద్ద దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలతో పాటు, పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. చిల్లమానుచేను క్రాస్ రోడ్స్ చేరుకున్న ఆయనకు స్థానిక ప్రజలతో పాటు, పెద్ద సంఖ్యలో మహిళలు, రైతులు ఘనస్వాగతం పలికారు. పాదయాత్రలో ఎంపీలు వరప్రసాద్‌రావు, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి : పాదయాత్రలో తొలి రోజు నుంచి పాల్గొంటున్న అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన రంగారెడ్డి శనివారం గుండెపోటుతో ఆసుపత్రికి తరలించే లోపే కన్నుమూశారు. జగన్‌మోహన్ రెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు రంగారెడ్డికి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం, ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామానికి తరలించారు. రంగారెడ్డి అంత్యక్రియలు పార్టీ తరపున తాడిపత్రిలో ఏర్పాటు చేశారు.

జనసేనలోకి కీలక నేతలు

మంతనాలు సాగిస్తున్న ముఖ్యులు

పార్టీ వైపు పాతకాపుల చూపు

పార్టీ నిర్మాణం, పటిష్టతపై కల్యాణ్ దృష్టి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టారు. 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పోటీ చేయనున్నట్టు పవన్ కల్యాణ్ ఇప్పటికే ప్రకటించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై జనసేన ప్లాన్ చేస్తోంది. ఇతర పార్టీల నుండి కొందరు నేతలు జనసేనలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నారని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. 2014 ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. కానీ, ఆ ఎన్నికల్లో పవన్ పోటీ చేయలేదు. 2019 ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. 2019 ఎన్నికలకు ముందే రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ పార్టీల నుండి పలువురు జనసేనలో చేరే అవకాశం ఉందని జనసేన పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు రెండు రాష్ట్రాల్లో పలువురు నేతలతో జనసేన ముఖ్యులు ప్రాథమికంగా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే వీరంతా జనసేనలో చేరే అవకాశాలున్నాయని ఆ పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో కొందరు రిటైర్డ్ అధికారులు, సీనియర్ జర్నలిస్టులు జనసేనలో చేరే అవకాశాలున్నాయని సమాచారం. ఈ మేరకు ఆయా వర్గాలు ఇప్పటికే జనసేనతో సంప్రదింపులు జరిపేందుకు సానుకూలంగా స్పందించాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. 2009 ఎన్నికల సమయంలో పీఆర్‌పీ టికెట్టుపై పోటీ చేసిన కొందరు నేతలు జనసేనలో చేరేందుకు కొంత ఆసక్తి చూపుతున్నట్టు ప్రచారం సాగుతోంది. పీఆర్‌పీలో ఆనాడు పోటీ చేసిన నాయకుల్లో కొందరు టీడీపీ, మరికొందరు కాంగ్రెస్, వైసీపీల్లో చేరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 2019 నాటికి రాజకీయ పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశం ఉన్నట్టు భావిస్తున్న నేతలు జనసేన వైపు చూస్తున్నారని సమాచారం. ఎవరెవరు ఆ జాబితాలో ఉన్నారనే విషయాన్ని జనసేన వర్గాలు వెల్లడించడం లేదు. పార్టీ నిర్మాణంపైనా, క్షేత్రస్థాయి నుండి పార్టీ బలోపేతంపైనా జనసేన దృష్టి కేంద్రీకరించింది. పార్టీ నిర్మాణాన్ని కిందిస్థాయి నుండి చేపట్టాలని పవన్ ప్లాన్ చేస్తున్నారు. పార్టీ నిర్మాణం బలంగా లేకపోతే రాజకీయంగా నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని జనసేన చీఫ్ భావిస్తున్నాడు. ఈ తరుణంలోనే పవన్ కల్యాణ్ పార్టీ నిర్మాణంపై కేంద్రీకరించారు. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకుంటూనే ఇతర పార్టీల నుండి వచ్చే నేతలతో సంప్రదింపులు జరపాలని జనసేన భావిస్తోంది. తెలంగాణలో 'ఛలో రే ఛల్' పేరుతో ఇప్పటికే పవన్ పర్యటించిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం జిల్లాల జనసేన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ నెల 24న ఖమ్మంలోని ఎంబీ గార్డెన్స్‌లో జరిగిన ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉమ్మడి జిల్లాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. శనివారం నుంచి 29వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఛలో రే...ఛలో రే..చల్ కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లాలో కరవుపై అధ్యయనం, అవగాహన కోసం వివిధ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.

దేశంలో హెల్త్ ఎమర్జెన్సీ


వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా

విశాలాంధ్ర-విజయవాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని, అందువల్ల దేశంలో హెల్త్ ఎమర్జెన్సీ నెలకొందని వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్‌భాయ్ తొగాడియా అన్నారు. దేశంలో పేద, మధ్య తరగతి ప్రజలు సరైన వైద్యం కోసం తమ తాహతుకు మించి ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న హెల్త్ ఎమర్జెన్సీని అధిగమించేందుకు వీహెచ్‌పీ ఆధ్వర్యాన 'ఇండియన్ హెల్త్ లైన్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. నగరంలోని ఐఎంఏ హాలులో శనివారం ఆయన ప్రముఖ వైద్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌భాయ్ తొగాడియా విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగానికి బడ్జెట్‌లో అవసరమైన మేరకు నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలకన్నా మన దేశంలో కేంద్ర ప్రభుత్వం వైద్య రంగానికి తక్కువగా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం దారుణమన్నారు. దేశంలోని పేదలు తమ ఆదాయంలో 10 నుంచి 25 శాతం వైద్యం కోసం ఖర్చు చేయాల్సి రావడం బాధాకరమన్నారు. దేశంలో వైద్యరంగంలో సంక్షోభంలో కూరుకుపోవడానికి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నిర్వాకమే కారణమని ఆయన చెప్పారు. బ్యూరోక్రాట్ల నియంత్రణలో ఎంసీఐ పని చేస్తుందని తెలిపారు. వైద్యరంగంతో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులు తీసుకుంటున్న నిర్ణయాల వల్లే సంక్షోభం ఏర్పడుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో దేశంలోని పేదలకు అత్యవసర సమయంలో ఆదుకునేందుకు వీహెచ్‌పీ ఆధ్వర్యాన ఇండియా హెల్త్ లైన్ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రైవేటు హాస్పిటల్స్, ల్యాబ్‌ల సహకారంతో అన్ని రకాల వైద్యసేవలను ఉచితంగా అందిస్తామన్నారు. పదివేల మంది వైద్యులు, ఆరు వేల మంది వైద్య కార్యకర్తలు హెల్త్‌లైన్ కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు ముందుకొచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ ప్రాంతీయ కార్యదర్శి నాయుడు, మహానగర్ అధ్యక్షుడు సానా శ్రీనివాసరావు, ఆంధ్రా హాస్పిటల్ వైద్యుడు ఎం.రవీంద్రనాథ్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

పులి గోర్ల వ్యాపారమా..?

కడప జిల్లాలో చిరుత మరణంపై అనుమానాలు

దర్యాప్తు చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది



విశాలాంధ్ర-కాశినాయన : అటవీ ప్రాంతంలో జంతువులను మానవ మృగాలు చంపేస్తున్నాయి. వీరు పులి గోర్ల వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అనుమానాలు తలెత్తుతున్నాయి. వైఎస్ఆర్ కడప జిల్లా కాశినాయన మండలంలోని వరికుంట్ల నల్లమల్ల అటవీ ప్రాంతానికి చిట్ట చివరి గ్రామం. గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో జ్యోతి క్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో ప్రభుత్వ చెక్‌పోస్టు సమీపంలోని అరటి తోటలో శుక్రవారం రాత్రి చిరుతను చంపి పూడ్చిపెట్టడం సంచలనమైంది.

డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరికుంట్ల గ్రామానికి చెందిన పెనుబడి కొండయ్యకు సుమారు 20 ఎకరాల భూమి ఉంది. అయితే తన పొలాన్ని సాగు చేసుకోలేక అనంతపురం జిల్లా యల్లనూరు మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన సోముల నారాయణప్ప నాయుడుకు కౌలుకు భూమిని ఇచ్చాడు. మూడు రోజుల క్రితం పొలంలోని అరటి తోట మధ్యలో భూమి లోపల రెండేళ్ల వయసు కలిగిన మగ చిరుత పులిని, నెల రోజుల క్రితం మరో ఆడ పులిని చంపి పాడుబడిన శెట్టిగారి బావిలో రహస్యంగా దాచినట్లు తమకు రహస్యంగా సమాచారం అందిందని డీఎఫ్‌వో తెలిపారు.

కాగా తాము శుక్రవారం రాత్రి విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో అరటి తోట చుట్టూ ఉన్న విద్యుత్ సరఫరాను తొలగించి తనిఖీలు చేయగా పొలం మధ్యలో అడుగు లోతు గుంతలో చిరుత పులి మృతదేహాన్ని బయటికి తీసినట్లు వెల్లడించారు. అలాగే బావిలో పులి మెడ, తల, చేతుల భాగాలకు సంబంధించిన ఎముకలను సేకరించి అక్కడే పొలంలో ఉన్న నారాయణప్ప నాయుడును అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. అయితే విద్యుత్ కంచె ఏర్పాటు చేసింది వాస్తవమేనని,

పులిని చంపిన ఘటనకు, తమకు సంబంధం లేదని తెలిపాడని డీఎఫ్‌వో వివరించారు. అతని దగ్గర కావలిదారుడు తాడిపత్రి తాలూకా తిమ్మంపల్లెకు చెందిన పెద్ద అంకపుగారి రాముడును విచారించడంతో వాస్తవాలు బయటపడ్డాయి. గత సంవత్సరం నుంచి నారాయణప్ప నాయుడు దగ్గర పని చేస్తున్నానని, అరటి తోటకు కరెంటు పెట్టమంటే పెట్టానని, కరెంటు పెట్టినపుడు చిరుత పులికి తగలడంతో చనిపోవడంతో దానిని దాచి గోర్లను మొత్తం అతనికే ఇచ్చినట్లు చెప్పాడు.

చిరుతపులికి పంచనామా

డీఎఫ్‌వో గురుప్రభాకర్ ఆధ్వర్యంలో వరికుంట్ల గ్రామ చెక్‌పోస్టు దగ్గర గ్రామ పెద్దల సమక్షంలో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి చిరుతపులికి పంచనామా చేశారు. గురుప్రభాకర్ మాట్లాడుతూ సమగ్రంగా దర్యాప్తు జరిపి దోషులపై అటవీ జంతువుల నేరం కింద కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామన్నారు. ఫారెస్టు రేంజర్ సుబ్బరామిరెడ్డి, బీట్ ఆఫీసర్ సుబ్బరాయుడు, గార్డు ఆంజనేయులు, వాచర్ బాషా ఉన్నారు.

దుమ్మురేపారు



- బెన్ స్టోక్స్, మనీశ్ పాండే, కేఎల్ రాహుల్ పంట పండింది
- యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, గంభీర్‌కు తీవ్ర నిరాశ
- ఆఫ్ఘన్ యువ సంచలనం రషీద్ ఖాన్‌కు రూ.9 కోట్లు
- అమ్ముడుబోని క్రిస్ గేల్, హాషీం ఆమ్లా, మురళీ విజయ్, మార్టిన్ గప్టిల్

బెంగళూరు: ఐపీఎల్-11 సీజన్ ఆటగాళ్ల వేలంలో డబ్బులు దుమ్మురేపుతున్నాయి. ఇంగ్లండ్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ అత్యధికంగా రూ.12.5 కోట్ల ధర పలికాడు. గత రెండు సీజన్లలో నిషేధం ఎదుర్కొన్న రాజస్థాన్ రాయల్స్ తాజా సీజన్ ఆరంభంలో భారీ ధరకు స్టోక్స్‌ను సొంతం చేసుకుంది. ఈ వేలంలో భారత యువ క్రికెటర్లు హల్‌చల్ చేశారు. మనీశ్ పాండే, కేఎల్ రాహుల్‌లు రూ.11 కోట్లకు కొనుగోలు కాగా, సీనియర్ క్రికెటర్లు గంభీర్, హర్భజన్ సింగ్, టీ20 స్పెషలిస్టులు యువరాజ్ సింగ్, యూసఫ్ పఠాన్‌లు తక్కువ ధర పలకడం క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి లోను చేసింది. గంభీర్ రూ.2.8 కోట్లకు ఢిల్లీ డేర్ డెవిల్స్ కొనుగోలు చేయగా, హర్భజన్ సింగ్ రూ. 2 కోట్లు(చెన్నై సూపర్ కింగ్), యువరాజ్ రూ. 2 కోట్లు(కింగ్స్ ఎలవెన్ పంజాబ్), యూసఫ్ పఠాన్ రూ.1.9కోట్లు(సన్ రైజర్స్ హైదరాబాద్) లకు కొనుగోను అయ్యారు. ఆఫ్ఘాన్ యువ సంచలనం రషీద్ ఖాన్ రూ.9 కోట్ల ధర పలికాడు. రషీద్ ఖాన్‌ను ే సన్ రైజర్స్ హైదరాబాద్ కొనుగోను చేసింది. అత్యధిక ధర రూ.12.5 కోట్లు బెన్ స్టోక్స్‌ది కాగా, స్టూవర్ట్ బిన్నీను రాజస్థాన్ రాయల్స్ కనీస ధర రూ.50 లక్షల (అత్యల్పం)కు కొనుగోను చేసింది.

అమ్ముడుబోని ఆటగాళ్లు:

వెస్టిండీస్ స్టార్ ఆటగాడు క్రిస్ గేల్‌తో పాటు హాషీం ఆమ్లా, మురళీ విజయ్, మార్టిన్ గప్టిల్, జో రూట్, జెమ్స్ ఫాల్కనర్, పార్థివ్ పటేల్‌లను కొనుగోలుకు ఏ ఫ్రాంఛీస్ కూడా ముందుకు రాలేదు. దీంతో వీరంతా ఈ సారి ఐపీఎల్ కు దాదాపు దూరమయ్యారనే చెప్పాలి. ఒక వేళ ఆదివారం చివరి రోజు వేలంలో ఆయా ఆటగాళ్లకు నిర్ణయించబడి ఉన్న కనీస ధర కంటే తక్కువ మొత్తానికి ఫ్రాంచైజీలు కొనుగోలు చేయడానికి ముందుకొచ్చిన పక్షంలో మాత్రమే వీరు ఐపీఎల్లో ఆడే అవకాశం ఉంటుంది.







ఆటగాళ్లు, వారి జట్ల వివరాలు :

బెన్ స్టోక్స్- రాజస్థాన్ రాయల్స్ - 12.5 కోట్లు, మనీశ్ పాండే- సన్‌రైజర్స్ హైదరాబాద్- 11 కోట్లు, కేఎల్ రాహుల్- కింగ్స్ ఎలెవన్ పంజాబ్- రూ.11 కోట్లు, క్రిస్‌లిన్- కోల్‌కతా నైట్‌రైడర్స్- 9.6 కోట్లు, మిచెల్ స్టార్క్- కోల్‌కతా నైట్‌రైడర్స్- 9.4 కోట్లు, గ్లెన్ మాక్స్‌వెల్ - ఢిల్లీ డేర్‌డెవిల్స్- 9 కోట్లు, సంజూ శాంసన్- రాజస్థాన్ రాయల్స్ - 8 కోట్లు, కేదార్ జాదవ్- చెన్నై సూపర్ కింగ్స్- 7.8 కోట్లు, అశ్విన్- కింగ్స్ ఎలెవన్ పంజాబ్- 7.6 కోట్లు, క్రిస్ వోక్స్- రాయల్ చాలెంజర్స్ బెంగళూరు- 7.4 కోట్లు, దినేశ్ కార్తీక్- కోల్‌కతా నైట్‌రైడర్స్- 7.4 కోట్లు, డ్వేన్ బ్రేవో- చెన్నై సూపర్ కింగ్స్- 6.4 కోట్లు, రాబిన్ ఉతప్ప- కోల్‌కతా నైట్‌రైడర్స్- 6.4 కోట్లు, అరోన్ ఫించ్- కింగ్స్ ఎలెవన్ పంజాబ్- 6.2 కోట్లు, మార్కస్ స్టోయినిస్- కింగ్స్ ఎలెవన్ పంజాబ్- 6.2 కోట్లు, కరుణ్ నాయర్- కింగ్స్ ఎలెవన్ పంజాబ్- 5.6 కోట్లు, కీరన్ పోలార్డ్ - ముంబై ఇండియన్స్- 5.4 కోట్లు, శిఖర్ ధావన్- సన్‌రైజర్స్ హైదరాబాద్- 5.2 కోట్లు, వృద్ధిమాన్ సాహా- సన్‌రైజర్స్ హైదరాబాద్- 5 కోట్లు, అజింక్య రహానే- రాజస్థాన్ రాయల్స్ - 4 కోట్లు, బ్రెండన్ మెకల్లమ్- రాయల్ చాలెంజర్స్ బెంగళూరు- 3.6 కోట్లు, డేవిడ్ మిల్లర్- కింగ్స్ ఎలెవన్ పంజాబ్- 3 కోట్లు, గౌతం గంభీర్- ఢిల్లీ డేర్‌డెవిల్స్- 2.8 కోట్లు, క్వింటన్ డికాక్- రాయల్ చాలెంజర్స్ బెంగళూరు- 2.8 కోట్లు, డి గ్రాండ్‌హోమ్- రాయల్ చాలెంజర్స్ బెంగళూరు- 2.2 కోట్లు, కార్లోస్ బ్రాత్‌వైట్- సన్‌రైజర్స్ హైదరాబాద్- 2 కోట్లు (కనీస ధర కోటి), షేన్ వాట్సన్- చెన్నై సూపర్ కింగ్స్- 2 కోట్లు (కనీస ధర కోటి), హర్భజన్ సింగ్- చెన్నై సూపర్ కింగ్స్- 2 కోట్లు, యువరాజ్ సింగ్- కింగ్స్ ఎలెవన్ పంజాబ్- 2 కోట్లు, షకీబ్ అల్ హసన్- సన్‌రైజర్స్ హైదరాబాద్- 2 కోట్లు (కనీస ధర కోటి), యూసఫ్ పఠాన్- సన్‌రైజర్స్ హైదరాబాద్- 1.9 కోట్లు, మొయిన్ అలీ- రాయల్ చాలెంజర్స్ బెంగళూరు- 1.7 కోట్లు (కనీస ధర 1.5 కోట్లు), డుప్లెసిస్- చెన్నై సూపర్ కింగ్స్- రూ.1.6 కోట్లు, జేసన్ రాయ్- ఢిల్లీ డేర్‌డెవిల్స్- 1.5 కోట్లు, స్టూవర్ట్ బిన్నీ- రాజస్థాన్ రాయల్స్ - రూ. 50 లక్షలు (కనీస ధర 50 లక్షలు), ప్యాట్ కమిన్స్- ముంబై ఇండియన్స్ - రూ. 5.4 కోట్లు, ఉమేశ్ యాదవ్-ఆర్సీబీ- రూ.4.2 కోట్లు, మొహ్మద్ షమీ-ఢిల్లీ డేర్ డెవిల్స్-రూ. 3 కోట్లు, పీయూష్ చావ్లా-కేకేఆర్- రూ.4.2 కోట్లు, జాస్ బట్లర్- రాజస్థాన్ రాయల్స్- రూ. 4.4 కోట్లు, అంబటి రాయుడు - చెన్నై సూపర్ కింగ్స్ - రూ. 2.2 కోట్లు, రషీద్ ఖాన్ - సన్ రైజర్స్ - రూ. 9కోట్లు, కరణ్ శర్మ-చెన్నై సూపర్ కింగ్స్- రూ.5 కోట్లు, ఇమ్రాన్ తాహీర్-చెన్నై సూపర్ కింగ్స్-రూ. కోటి, శుభ్‌మాన్ గిల్-కేకేఆర్-రూ. 1.8 కోట్లు, సూర్యకుమార్ యాదవ్-ముంబై ఇండియన్స్-రూ.3.2 కోట్లు, కుల్దీప్ యాదవ్-కేకేఆర్- రూ.5.8 కోట్లు, యజ్వేంద్ర చాహల్-ఆర్సీబీ-రూ. 6 కోట్లు, అమిత్ మిశ్రా-ఢిల్లీ- రూ. 4 కోట్లు, రషీద్ ఖాన్- సన్ రైజర్స్-రూ. 9 కోట్లు, రాహుల్ త్రిపాఠి- రాజస్థాన్ రాయల్స్-రూ. 3.4 కోట్లు, మోహన్ వోహ్రా-ఆర్సీబీ-1.1 కోట్లు, పృథ్వీ షా-ఢిల్లీ-రూ.1.2 కోట్లు, మయాంక్ అగర్వాల్-కింగ్స్ పంజాబ్-రూ. కోటి.



ఆస్ట్రేలియా ఓపెన్ మహిళా విజేత వొజ్నియాకి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా గ్రాండ్ స్లామ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ డెన్మార్క్‌కు చెందిన వొజ్నియాకి విజేతగా నిలిచింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో వొజ్నియాకి 7-6(7/2), 3-6, 6-4 తేడాతో ప్రపంచ నంబర్‌వన్ క్రీడాకారిణి హలెప్(రొమేనియా)పై విజయం సాధించి టైటిల్‌ను సాధించింది. తద్వారా తొలిసారి ఆస్ట్రేలియా గ్రాండ్ స్లామ్ టోర్నీ ఫైనల్‌కు చేరిన క్రమంలోనే టైటిల్‌ను సాధించిన క్రీడాకారిణిగా అరుదైన ఘనతను వొజ్నియాకి సొంతం చేసుకుంది. హోరా హోరీగా సాగిన తొలి సెట్‌ను టై బ్రేక్ ద్వారా దక్కించుకున్న వొజ్నియాకి రెండో సెట్‌ను కోల్పోయింది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్‌లో వొజ్నియాకి విజృంభించి పదునైన సర్వీస్‌లను సంధించింది. దాంతో తడబాటకు లోనైన హలెప్ వరుస పాయింట్లను కోల్పోయి సెట్‌తో టైటిల్‌ను కూడా చేజార్చుకుంది. వొజ్నియాకి కు ఇదే తొలి గ్రాండ్ స్లామ్.

ఫైనల్లో సైనా..

జకర్తా:



భారత స్టార్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో థాయ్‌లాండ్ క్రీడాకారిణి, ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఇంతనోన్ రచనోక్‌తో సైనా, 49 నిమిషాల పాటు జరిగిన హోరాహోరి పోరులో 21-19, 21-19 తో మ్యాచ్‌ను గెలుచుకుని ఫైనల్‌కు చేరింది. గత ఏడాది గాయాలతో అంతగా రాణించలేకపోయిన సైనా తిరిగి కోలుకున్న అనంతరం ఈ ఏడాది పాల్గొన్న తొలి టోర్నమెంట్‌లోనే ఫైనల్‌కు చేరింది. ప్రపంచ నెం.1 తైజు యింగ్, ఎనిమిదో ర్యాంకర్ బింగ్‌జియో మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో సైనా ఆదివారం జరుగనున్న ఫైనల్ మ్యాచ్‌లో తలపడనుంది.



నిన్న బుమ్రా.. నేడు షమీ

మూడో టెస్టులో దక్షిణాఫ్రికాపై చిరస్మరణీయ విజయం

- సఫారీలకు చుక్కలు చూపిన పేస్ బౌలర్లు
- ఎల్గర్ పోరాటం వృథా
- ఐదు వికెట్లతో అదరగొట్టిన షమీ

జొహెన్నెస్‌బర్గ్: భారత్- దక్షిణాఫ్రికా క్రికెట్ జట్ల మధ్య ఇక్కడి వాండరర్స్ మైదానంలో జరుగుతున్న మూడవ క్రికెట్ టెస్టులో టీమిండియా 63 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. భారత పేసర్ల ధాటికి సఫారీ జట్టు విలవిలలాడింది. నాలుగోరోజైన శనివారం 17/1 ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్ కొనసాగించిన దక్షిణాఫ్రికా జట్టు 241 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 177 పరుగులకే చతికిలపడింది. ఆటలో రెండో సెషన్ తర్వాత టీమిండియా బౌలర్లు విజృంభించి బౌలింగ్ చేయడంతో గెలుపు దిశగా వచ్చిన సఫారీలు ఒక్కసారిగా కుప్ప కూలారు. భారత బౌలర్లలో షమీ ఐదు వికెట్లతో సఫారీల పతనాన్ని శాసించగా, బూమ్రా, ఇషాంత్ శర్మలు తలో రెండు వికెట్లు సాధించారు. భువనేశ్వర్‌కు ఒక వికెట్ దక్కింది. దక్షిణాఫ్రికా ఓపెనర్ డీన్ ఎల్గర్ (86 - 240 బంతుల్లో 9ఫోర్లు, 1 సిక్స్) కడవరకూ ఒంటరి పోరాటం చేసినా మరో వైపు ఎవరూ నిలవలేకపోవడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. జట్టును గెలిపించలేకపోయాడు. దక్షిణాఫ్రికా భోజన విరామ సమయం వరకూ నిలకడగా బ్యాటింగ్ చేసింది. ఓవర్‌నైట్ ఆటగాళ్లు డీన్ ఎల్గర్, హాషీమ్ ఆమ్లాలు బాధ్యతాయుతంగా ఆడి 119 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో టీమిండియాకు వైట్ వాష్ తప్పదనిపించింది. అయితే 124 పరుగుల వద్ద ఆమ్లా(52) రెండో వికెట్‌గా అవుటైన తరువాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆపై డివిలియర్స్(6), డుప్లెసిస్(2), డీ కాక్(0), ఫిలాండర్(10), పెహ్లుకోవాయూ(0), రబడా(0), మోర్నీ మోర్కెల్(0) లు స్వల్ప వ్యవధిలో పెవిలియన్ చేరడంతో దక్షిణాఫ్రికా ఓటమి పాలైంది. 36 పరుగుల వ్యవధిలో ఎనిమిది వికెట్లు సాధించిన భారత్ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలై విమర్శలెదుర్కొంటున్న టీమిండియాకు ఈ విజయం ఊరటనిచ్చింది. భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 187, రెండో ఇన్నింగ్స్‌లో 247 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్ - 194, రెండో ఇన్నింగ్స్‌లో 177 పరుగుల చేసింది.



అవినీతికి కొమ్ముకాయడమేనా మోడీ నీతి?

- రాష్ట్రమంతటా అవినీతి రాజ్యమేలుతోంది
- గజపతినగరం బహిరంగ సభలో రామకృష్ణ విమర్శ



విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం: 'గాలి జనార్ధనరెడ్డి, యెడ్యూరప్ప వంటి అవినీతిపరులకు కొమ్ముకాయడమేనా ప్రధాని నరేంద్రమోడీ నీతి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నల్లడబ్బు తెచ్చి పంచుతానని ఊరూవాడా ప్రచారం చేసిన మోడీ, ఈ 44 నెలల్లో ఎంత నల్లధనాన్ని తెచ్చారో, ఎంతమందికి పంచారో చెప్పాలని ఆయన డిమాండు చేశారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి ఆరోపణలతో జైలుపాలైన గాలి జనార్ధనరెడ్డికి, యెడ్యూరప్పకు ఇప్పుడు బీజేపీ నేతలే కొమ్ము కాస్తున్నారని ఆయన విమర్శించారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో శనివారం ప్రారంభమైన సీపీఐ జిల్లా 12వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పట్టణంలో జరిగిన భారీ ప్రదర్శనలో రాష్ట్ర, జిల్లా నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మోడీ, చంద్రబాబు చెప్పిన మాటలకు, ప్రస్తుత చేతలకు పొంతన లేదన్నారు. వీరి పాలనలో బడుగు, బలహీన వర్గాలు, దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయని అన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతుల ఆత్మహత్యలను తీవ్రంగా విమర్శించిన మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రైతుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రం మధ్య ప్రదేశ్‌లో ఏడుగురు రైతులను కాల్చిచంపారంటే, వారికి రైతులపట్ల ఏమాత్రం ఆపేక్ష ఉందో అర్థం అవుతోందన్నారు. రాష్ట్రంలో 16 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎక్కడ పరిశ్రమలు పెట్టారో, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో ఈ 44 నెలల కాలంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, అమరావతి నిర్మాణంలో గానీ, ప్రాజెక్టుల విషయంలో గాని సీఎం సినిమా చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రమంతటా లంచగొండితనం రాజ్యమేలుతోం దని, ఎమ్మెల్యేలను సైతం సంతలో పశువులను కొనుగోలు చేసినట్లు చేస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ దేశంలో దోపిడీ ఉన్నంత కాలం, దానిని ఎదుర్కొనేందుకు, శ్రామిక వర్గాలకు సహజ సంపదను సమానంగా పంపిణీ చేయించేవరకు కమ్యూనిస్టు పార్టీలు నిలిచే ఉంటాయని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీలకు అంతం ఉండదని, పక్కనే ఉన్న నేపాల్‌లో ఇటీవలే కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారని ఉదహరించారు. డీసీఐ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నం జరుగుతోందన్నారు. ఆంధ్రులు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కులో పెట్టుబడులను ఉపసంహరించేందుకు కూడా కేంద్రం ప్రయత్నిస్తోందని చెప్పారు. దళితులపై దాడులు రాష్ట్రవ్యాప్తంగా పెరిగిపోయాయని, ఇది దళిత వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. గిరిజనులు నివాసం ఉన్న ప్రాంతాల్లోని సహజ వనరులను కొల్లగొట్టేందుకు కార్పొరేట్ శక్తులు కుట్ర చేస్తున్నాయని, వీటిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ పేదలు, దళితులు, అట్టడుగు వర్గాలపై దాడులు పెరిగి పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ల్యాండ్ బ్యాంకు పేరుతో పేదల భూములను లాక్కొని పెద్దలకు కట్టబెట్టేందుకు ప్రయత్నం జరుగుతోందన్నారు. ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు వలస పోయేవారిలో విజయనగరం జిల్లా వాసులే ఎక్కువ ఉండటం బాధాకరమన్నారు. అటవీ హక్కుల చట్టానికి సైతం తూట్లు పొడిచే ప్రయత్నం జరుగుతోందని, వీటిన్నిటిపట్లా అప్రమత్తంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ డీవీజీ శంకరరావు, అధ్యక్షులు వి.కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి ఆల్తి అప్పలనాయుడు, కోశాధికారి ఎం.శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఒమ్మి రమణ, బుగత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్‌పై సెహ్వాగ్ సెటైర్!



బెంగళూరు: క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మిని క్రికెట్ సమరం ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)కు తెరలేచింది. బెంగళూరు వేదికగా ఐపీఎల్-11 కోసం ఆటగాళ్ల వేలం కొనసాగు తోంది. ఫ్రాంచైజీలు ఉత్తమ ఆటగాళ్లను దక్కించుకొనేం దుకు కోట్లానుకోట్లు వెచ్చిస్తున్నారు. అయితే ఈ వేలంలో పాల్గొన్న సెహ్వాగ్ ట్వీట్టర్ వేదికగా స్పందిచారు. ఐపీఎల్‌లో కింగ్ ఎలెవన్ పంజాబ్ జట్టు తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్న సెహ్వాగ్ ఆ జట్టు ఓనర్ ప్రీతి జింటాపై సెటైర్ వేశారు. "సాధారణంగా అమ్మాయిలకు షాపింగ్ అంటే ఎంతో ఇష్టం. ఇప్పుడు ప్రీతి ఫుల్ షాపింగ్ మూడ్‌లో ఉంది. ఏదీ కనిపించినా కొనుగోలు చేస్తోంది" అని సెహ్వాగ్ ట్వీట్ చేశారు. ఈ రోజు వేలంలో ప్రీతి జట్టు యువరాజ్, ఫించ్, కేఎల్ రాహుల్ తదితర ఆటగాళ్లను సొంతం చేసుకుంది. ఇక ఐపీఎల్ వేలం గురించి కూడా సెహ్వాగ్ అంతే ఫన్నీగా ట్వీట్ చేశారు. "చిన్నప్పుడు మనం కూర గాయలు కొనేందుకు వెళితే.. అమ్మ రేటు సరిగ్గా చూసుకొని కొనమని చెప్పేది. ఇప్పుడు మేం మను షుల్ని కొనడానికి వెళుతున్నాం. తేడా ఏంటంటే.. ఇప్పుడు ఓనర్ చెబుతారు.. సరైన ధరకి కొనమని" అంటూ స్పందించారు.

చెత్త బ్యాటింగ్: స్మిత్



పెర్త్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో పేలవంగా ఆడిన ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ తెగ బాధపడిపోతున్నాడు. ఐదు వన్డేల సిరీస్‌లో మూడు వన్డేల్లో ఓడిపోయి సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా నాలుగో వన్డేలో అతి కష్టం మీద గెలిచింది. రేపు (ఆదివారం) పెర్త్‌లో ఐదో వన్డే జరగనుంది. ఇంగ్లండ్‌తో జరిగిన యాషెస్ సిరీస్‌లో ఇరగదీసిన స్మిత్ వన్డేల్లో చతికిల పడడం జట్టును ఇబ్బందుల్లోకి నెట్టింది. తొలి వన్డేలో 23, రెండో వన్డేలో 18, మూడో వన్డేలో 45, నాలుగో వన్డేలో 4 పరుగులు మాత్రమే చేశాడు. నాలుగు మ్యాచుల్లో కలిసి వంద పరుగులు కూడా చేయలేకపోయిన స్మిత్ రేపటి మ్యాచ్‌పై దిగులుగా ఉన్నాడు. దీనికి తోడు తర్వాతి సిరీస్ పటిష్టమైన సౌతాఫ్రికాతో కావడంతో ఫామ్‌పై ఆవేదన చెందుతున్నాడు. ఇంగ్లండ్-న్యూజిలాండ్‌తో త్వరలో జరగనున్న టీ20 ముక్కోణపు సిరీస్‌కు 28 ఏళ్ల స్మిత్ విశ్రాంతి తీసుకుంటున్నాడు. దీంతో డేవిడ్ వార్నర్ నాయకత్వ బాధ్యతలు స్వీకరించనున్నాడు. యాషెస్ సిరీస్‌లో మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డు గెలుచుకున్న స్మిత్ వన్డే సిరీస్‌లో కేవలం 22.5 సగటుతో పరుగులు తీయంలో విఫలమయ్యాడు. బ్యాటింగ్ ప్రదర్శన తనను తీవ్ర నిరాశకు గురిచేసిందని స్మిత్ వాపోయాడు. రేపు జరగనున్న చివరి వన్డేలో అదుతే ప్రదర్శన కనబరిచి తిరిగి ఫామ్‌లోకి రావాలని యోచిస్తున్నట్టు చెప్పాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.